రంభ! రంభ!! రంభ!!!

చీకటేది

3/4

ప్రపంచ సాహిత్యంలో నోబిల్
బహుమతిపొందడానికి అన్నివిధాల
అర్హతలు కలిగిన తెలుగు కలం
ఒకటుంది. తెలుగు తనానికిది కలికి
తురాయి. హృదయ స్పందనికీ -
గుప్పెట బిగించడానికీ, నిట్టూర్చ
డానికీ-నిప్పులా వేడి పుట్టించడానికీ,
మంచికీ, మానవతకీ, సర్వమానవ
సౌభ్రాతృత్వానికీ అర్థాలు చెబు
తోంది. ఆలోచించమని ఆదే
శిస్తోంది. పశ్చిమ దేశాల పరువు
నిలిపిన సాహిత్యానికి పోటీగా నిల
బడి ఈ తెలుగు గడ్డ ఖ్యాతిని నలు
దిక్కులా చాటించేందుకు ఛాలెంజ్
చేస్తున్న కలం పేరు వీనాదేవి!

ఆ కలం వెలువరించిన సాహిత్యాన్ని
సగర్వంగా సమర్పించుకుంటున్నాం...

రండి! రండి!! రండి!!!

University Book Centre,
PRAKASAM ROAD,
TIRUPATI.

ప్ర చు ర ణ :

ప్రతిభా పబ్లికేషన్స్

విజయవాడ-2.

ము ద్ర ణ :

'సు బ్ర మ ణ్యే శ్వ ర'

విజయవాడ-2.

మొదటి ముద్రణ :

సెప్టెంబరు - '75



సోల్ డిస్ట్రిబ్యూటర్స్ :

నవభారత్ బుక్ హౌస్

పీబీరు రోడ్డు • విజయవాడ-2

వెల :

ఆ ఱు రూ పా యలు

చి. రవీంద్రనాథ


525
1-14
2nd
Three

లోక వృత్తానికి భూతద్దం పట్టే
గాఢ వాస్తవికత ఇందు ప్రత్యేకత!

డబ్బు! డబ్బు!! డబ్బు!!!

బీనాదేవి

కథలు



వివా అభివాన రచయిత్రుల రచనలు

బీనాదేవి రచనలు

పుణ్యభూమీ ! కళ్ళుతెరూ-	10-00
రాధమ్మ పెళ్ళి ఆగిపోయింది	6-00
ఫస్ట్‌కేస్	6-00
డబ్బు ! డబ్బు !! డబ్బు !!!	6-00
ఏ మేటర్ ఆఫ్ నో ఇంపార్టెన్స్	6-00

కె. రామలక్ష్మి రచనలు

చీకటి దారి	6-00
అందుకో ఈ ప్రేమ లేఖ	6-00
లవంగి	6-00
కరుణ కథ	5-00
ఆశకు సంకెళ్ళు	6-00
మూడో మనిషి	6-00
ఆడది	6-00
ప్రేమించు ప్రేమకై	6-00

పురాణం సీత రచనలు

ఆనంద భైరవి	6-00
ముగ్గురమ్మాయిలు	6-00
దేవుడున్నాడు జాగ్రత్త !	6-00
జలతరంగిణి	6-00

వయసొచ్చిన కథలు

వార పత్రికల కథలు చదివి చదివి జిహ్వ చచ్చిపోయి వున్న నాకు ఈ సంపుటిలోని బీనాదేవిగారి కథలు చదివితే రోగికి పథ్యం రుచించనపుడు నిమ్మకాయ ముక్క నాలికకు తగిలిస్తే లేచివచ్చినట్లు ప్రాణం లేచి వచ్చింది.

చాలామంది కథకులు రాసినవి, స్పానిష్ బుల్‌ఫైట్‌లో రింగులోకి దిగి, బుల్‌తో ఫైట్‌చేసి, నేలంతా దున్నేసి నెత్తుటి మయం చేసేసినట్లు, ఛాలెంజికోసం రాసినవి అనిపిస్తాయి. అంటే, నా భాష, నా ఉపమానాలు, నా శిల్పం, నా పాత్రలు, నా శక్తి చూడు అన్నట్లు తమ విశ్వరూపం చూపిస్తారు. కథకులు విధిగా మాటిడార్ కానవసరంలేదు. ఆ బలప్రదర్శన ఆ ఫీట్లు అయాక రచయితలు రాసే కథలను వయసొచ్చిన కథలు అనొచ్చు. బీనాదేవిగారి కథలకు వయసొచ్చింది.

తెలుగులో, పెద్దలు చదువుకుందుకు పనికివచ్చే కథలు, నవలలు, పుస్తకాలు, పత్రికలులేవు. పెద్దలంటే వయసు చేతకాదు. ఎదిగిన పాఠకులకు ఎదగని రచయితలే కాని ఎదిగిన రచయితల్లేరు. బీనాదేవిగారి కథలు వార,మాస

పత్రికల కంటే ఎదిగిన వారి కోసమని ధైర్యంగాచెప్ప వచ్చు. మూసలో పోసినట్లున్న ఒకే రకం సాహిత్యం నిలవసరుకులా ప్రాణాలు తోడేస్తున్నప్పుడు బీనాదేవి గారి కథలు చదివితే అందరూ నిద్రపోతున్నప్పుడు మనం మాత్రమే లేచి మార్నింగు వాక్‌కి వెళుతున్న పుడు కలిగే 'ఏకైక హాయి'ని కలిగిస్తాయి.

ఈ సంపుటిలోని కథలన్నీగొప్పకోసం రాసినవి కావు. నారదుడికి సంసారంగురించి అందులోనిమాయగురించి చెప్పడానికి విష్ణుమూర్తి నారద సంసారం ఆడించినట్టు మనకు ఈ సంసారంలోవుండే మాయనంతా బీనాదేవి గారు ఈ సంపుటిలోని కొన్ని కథల్లో కుక్కి, మన్ని వుక్కిరిబిక్కిరి చేసేరు.

కేవలం రావిశాస్త్రిగారికి 'ఏకో'గా మాత్రమే ఉంటాయి వీరి కథలు అనే వివాదాన్ని పూర్వపక్షం చేస్తాయి డబ్బు కథలు. ఇందులో వున్నదంతా మనకు తెలిసిన జీవితమే. మనుషులందర్నీ మనం ఎంతో సన్నిహితంగాగుర్తించొచ్చు. తెలీనిదల్లా యివి యింత బ్రహ్మాండంగా కథలవుతాయన్న నిజం మాత్రమే. ఇవి అడల్టు స్టోరీస్ కాని అడల్టరేటెడ్ కావు.

ఈ కథల్లో రచయితకు ఎపరిపట్లా క్రోధం, అసూయ, ద్వేషం, పగ, లేదు. వున్నదల్లా లోకంపట్ల జీవితంపట్ల ప్రగాఢమైన ఆపేక్ష మరియు లవ్ అండ్ కంపాషన్. జీవించడానికి ఎంత సెన్స్ ఆఫ్ హ్యూమర్ కావాలో అంత సెన్సు, హ్యూమర్ పుష్కలంగా వున్న కలం నుంచి వెలువడ్డ కథ లివి.

ఈ మధ్యన పోలీసువాళ్ళకోసం బాష్పవాయు ప్రయోగానికి వుపయోగపడే పిస్టల్సు లాటివి కనిపెట్టారని విన్నాను. ఆ పిస్టలు ప్రేలిస్తే మనిషికేం అపకారం జరగదు. సమ్మోహనాస్త్రం వేసినట్లు పడిపోతార్ట జనం.

అదుగో అలాటి కొత్తరకం పిస్తోళ్ళు బీనాదేవిగారి డబ్బు కథలు.

విజయవాడ,
9 - 9 - 75.

పురాణం సుబ్రహ్మణ్య శర్మ.

మంచి స్నేహితులు

డాక్టరు పి. వి. సత్యవతి

డాక్టరు పి. చిరంజీవిరాజు

గార్లకు

అభివందనములతో

రచయిత్రి

ఇ ం దు...

1. ది ఎటర్నల్ ట్రయాంగిల్	5
2. డబ్బు—3	13
3. జలుబు చేసిందా ?	34
4. పెన్సిలిన్ అయిపోయింది	48
5. మున్నా లేక సమ్‌పేర్ ఇన్ బంగ్లాదేశ్	58
6. ది స్మోకింగ్ డాగ్	66
7. అతి సర్వత్ర వర్జయేత్	82
8. మిసెస్ అండ్ మిస్టర్ సక్సేనా	121
9. డబ్బు—1	138
10. వెయ్యని ప్రశ్న-ఇయ్యని జవాబు	158
11. డబ్బు—2	172

ది ఎటర్నల్ ట్రయాంగిల్

"డబ్బున్న వాళ్లకు కొండొకచో సిన్సియర్ గానే ఓఘున మైన ఆశయమూ ఉంటుంది. ఆ ఆశయం నెరవేర్చుకొనేందుకు సిన్సియర్ గానే ప్రయత్నమూ చేస్తారు. నాశనంలేని ఆడామగా, ఎటర్నల్ ట్రయాంగిల్ యీ సిన్సియర్ ప్రయత్నాలను జరగనిస్తుందా మరి!"

పద్మకి మహాచికాగ్గావుంది నచ్చని చీరెలమీద. సేల్స్ మన్ కూడా చాలా చికాగ్గాఉంది. ఎప్పటికీ బేరం తేల్చని ఆవిడ మీద.

ప్రొప్రైటరుకి సూపర్ చికాగ్గా ఉంది చేతకాని సేల్స్ మాన్ మీదా, డబ్బున్న ఆడవాళ్ళమీదా.

పాపు గుమ్మంలో నిల్చున్న ముష్టిపిల్లకి చికాకు కాదు గాని బాధగావుంది అరగంట్నై అరుస్తువ్నా అణా కూడా యివ్వని తను చుట్టూవున్న మనుషులమీద.

అది ఖాన్ అండ్ ఖాన్ బట్టల షాపు.
ఆ ఊరంతటకీ ఖరీదైన షాపు.
అంటే అక్కడ ఖరీదైన బట్టలుండవు.
అక్కడి బట్టలకి ఖరీదెక్కువ.
పద్మకూడా చాలా ఖరీదైన మనిషి.

ఆవిడ కట్టుకున్న చీర ఖరీదుతో అరడజను సంసారాలు అర్నెల్లు హాయిగా బతకొచ్చు. అవిడ ఒంటి మీదున్న నగల ఖరీదుతో నలుగురు ఆడపిల్లలకి సునాయాసంగా పెళ్ళి చెయ్యొచ్చు.

ఆవిడ మొగుడి ఖరీదు ఒకోఁటీ ముప్పై లక్షలు ఖరీదుచేసే మూడు ఫ్యాక్టరీలు.

ఆవిడకి పాతికేళ్ళు. పాతికేళ్ళ ఆడదాని కుండాల్సిన అందం ఉన్నాయి. అందంగా వున్నానన్న అహంకూడావుంది.

ఆవేళ పద్మకేం తోచలేదు. నిజం చెప్పాలంటే ఆవేళే కాదు ఏవేళా ఆవిడకేం తోచదు. సాధారణంగా ఏం తోచని ఆడవాళ్లు నిద్రపోతారు. అయితే డబ్బుండీ ఏం తోచని ఆడవాళ్లు షాపింగుకి వెళ్తారు (డబ్బులేని ఆడవాళ్ళకి, మగ వాళ్ళకూడా - తోచకపోవడం వుండదుట.) అంచేత కనీసం పట్టుచీరైనా కొనుక్కుందామని షాపు కొచ్చింది అవిడ. కాని, ఛీ! ఛీ! అక్కడున్న చీరలన్నీ తనదగ్గరున్నవే. ఈ దిక్కుమాలిన దేశంలో డబ్బుండి కొనుక్కుందామన్న దొరికుండి, కొందామంటే సరైన చీర కూడా దొరక్కపోతే యింకేందుకు? వాట్ ఎడిన్ గ్రేస్? ఇదిగో, ఇలాటప్పుడే ఆవిడికి అకస్మాత్తుగా అమెరికా పారిపోవాలనిపిస్తుంది. ఏం లాభం? ఆ కోరికా తీరదు. ఆవిడ ఖరీదైన మొగుడికిగల అతిఖరీదైన ఫ్యాక్టరీలన్నీ ఆవిడ దరిద్రంకొద్దీ యీ దేశం లోనే వుండిపోయేయి. అతను అందరు మగవాళ్ళలాంటివాడు కాదు. అతనికి పద్మంటే చాలా ఇష్టం. కాని డబ్బంటే యింకా

ఎక్కువిష్టం. ఎవరైనా సరే ఎక్కువిష్టమైన పన్లే చేస్తారు కాబట్టి అతను అమెరికా ప్రయాణం ఒప్పుకోవడంలేదు. మన దేశంలో ఆవిడకి చెయ్యాల్సిన పన్లేవీ కనిపించడంలేదు - చీరలు, నగలూ కొనడం, సోఫాలూ, రేడియోలు ప్రతినెలా మార్చేయడం మినహా.

మనుషుల ఆలోచనలు వాళ్ళ ఖరీదునిబట్టి వుంటాయి (ట) అడుక్కునే వాడికి అమెరికా వెళ్లాలన్న ఆలోచన రాదు. అలాగే గొప్పవాడికి గుడిసెల్లో వుండాలన్న ఆలోచన రాదు. సరదాకైనా సరే—కలలోనైనా సరే. ఖరీదైన పద్మకి ఎప్పుడూ అతిఖరీదైన ఆలోచనలే వస్తాయి. తన పేరన ఒక పెద్ద పిల్లల ఆస్పత్రి కట్టిస్తే? అసాధ్యంకాదు. కాని ఆవిడ మొగుడికి పిల్లలన్నా, ఆస్పత్రి అన్నా విపరీతమైన ఎలర్జీ. హోస్పీ, స్కూలు గానీ, కాలేజీగాని కట్టించొచ్చు. అదీ అసంభవం కాదు. కాని ఇప్పటికే ఎక్కువగావున్న నిరుద్యోగ సమస్యని యింకా ఎక్కువ చెయ్యటం నేషనల్ క్రైమ్.

అవును. సినిమా తియ్యొచ్చు పెర్సనాలిటీ, పాపులారిటీ కూడా పెరుగుతాయి. కానీ ఏ డైరెక్టరూ తనని హీరోయినుగా ఒప్పుకోలేదు. తను అందముగా వున్నప్పటికీ. కనీసం నాలుగు రోజులలో నవల రాసి పారేయ్యొచ్చును. ఆమధ్య ఎవరో అన్నారు. ఆడ నవలలకున్న డమాండు దేనికీలేదని. డిమాండువుంటే వుందికాని అందులో పెద్ద థ్రిల్ ఏంవుంటుది. చేతులు పీకటంతప్ప. ఈఆలోచన లన్నిటి తోనూ పద్మ మనసేం బాగుండకనే కాలక్షేపం కోసం పాపింగు కొచ్చింది. అదేం దర్శిదవో కాని పాపింగుకూడా విసుకొచ్చేస్తుంది.

పద్మ కెందుకుగా గోడలని పెద్దనిలువుటద్దాలున్నాయి. నేలని పట్టుచీరల గుట్టలున్నాయి. పద్మ చీరలవేపు చూడటం లేదు. అద్దాలలో కనిపిస్తున్న రోడ్డుమీద పోతున్న కార్లన్నీ, జనాన్నీ, రిక్షాలనీ వగైరాలని చూస్తోంది. ఆ వగైరాలలో అరగంటై అక్కడే నిల్చుని అడుక్కుంటున్న ముష్టి పిల్ల కూడా కనిపించింది. ఆ పిల్ల తల్లిగాని బతికుంటే ఆ పిల్లకి పదిహేనేళ్ళని చెప్పగలదు. ఆ రోజుకి ఆ పిల్ల అన్నంతిని ఆర్రోజుల ఒకపూటైంది. కడుపునిండా మంచినీళ్ళు తాగి అరగంట మీద ఆరు నిముషాలైంది పుట్టినదగ్గర్నించి ముష్టి త్తుకునే దాన్లా కాకుండా ఒకప్పుడు బాగా బతికి పరిస్తితుల ప్రభావంవల్ల యీ స్తితికి దిగజారిన దాన్లా అతి దీనంగానూ, అతి ఎపోలజెటిక్‌గానూ వుంది. అనుకోకుండా ఆ అమ్మాయిని చూసిన పద్మకి జెల్లకొట్టినట్టు జ్ఞానోదయమైనట్లయింది.

ఇంత మంచి ఆలోచన ఇన్నాళ్ళూ తన కెందుకు రాలేదు? ఈ అమెరికా, ఆస్పత్రి వగైరాలు కాకుండా యిలాంటి పిల్లని చేరదీసి చదువు చెప్పించి, పెంచి పెద్దచేస్తే! పెంచితే యీ సైజులో దాన్నే పెంచాలి. మరో చిన్నదాన్ని తెస్తే దానిని తను పెంచినట్టు తెలీదు, తను కన్న పిల్లే అనుకుంటే కృతజ్ఞత ఎలా వస్తుంది! యీ పిల్లని పెంచితే! ఏవిఁ త్రిల్! ఎంతపేరు, ప్రతిష్ట!! అప్పుడు పద్మకి కనిపించనది - ఎక్కడో కాలేజి డే జరుగుతోంది. స్టేజీమీద ఎవరో ఇద్దరు మంత్రులు, ఒక కెర్లిన్ కార కూర్చుని వున్నారు. తనూ ప్రభాకర్రావు తమకోసం ప్రత్యేకంగా వేసిన సోఫాల్లో కూర్చున్నారు. పెద్దాపురం పట్టుపంచ, చిన్న

చీరల ఎదురుగా కూర్చున్న పద్మకి నిజంగానే కన్నీరు రాబోయింది. వెంటనే తపోభంగం అయిన తపస్వినిలా గబుక్కున లేచి చీరల గుట్టలు దాటుకుంటూ నిద్రలో నడుస్తున్నదాన్లా కారుదగ్గరికి వెళ్ళింది. ఆ అమ్మాయి కూడా పద్మవెనుకే కారువరకూ వెళ్ళింది ఏమైనా యివ్వమని అడుగుతూ. పద్మ ఆ అమ్మాయిని చెయ్యి పట్టుకొని లాగి కారులో కూర్చోపెట్టుకొని కారు స్టార్ట్ చేసింది. పద్మవేపూ, ఆ అమ్మాయివేపూ, వెళ్ళిపోతున్న కారువేపూ, నిశ్చేష్టులై చూస్తున్న జనం పద్మకి కావలసినదానికంటే ఎక్కువ ఎంక రేజిమెంటే యిచ్చేరు.

ఏం జరుగుతుందో తెలీని ఆ అమ్మాయి ముందుగా భయపడింది. తరువాత తనకి అణావో, అర్ధణావో యిచ్చేస్తే దిగిపోతానని బతిమాలుకుంది పద్మని; పద్మ జవాబు యివ్వలేదు. పోనీ ఏంవీఁ యివ్వనవసరంలేదనీ, కనీసం కారాపేస్తే దిగిపోతాననీ వేడుకుంది. అయినా జవాబివ్వని పద్మ గంభీరతని చూసి బెదిరిపోయి కుక్కపిల్లలా మూలని ఒదిగి కూర్చుంది.

ఇల్లు చేరిన వెంటనే పద్మ పనిమనిషిని కేకవేసి ఆ అమ్మాయిని తీసికెళ్ళి అర్జంటుగా స్నానంచేయించి, బట్టలు మార్పించి తీసుకొని రమ్మంది. ఆ అమ్మాయికి అర్జంటుగా కావాల్సినవి స్నానం. పట్టుబట్టలూ, అగరొత్తులూ కావనీ, కేవలం పిడికెడు అన్నం మాత్రం అర్జంటని ఖరీదయిన ఆలోచనల పద్మకి తట్టలేదు. ఏగది ఆ అమ్మాయికి కేటా

యించాలి. ఏ బట్టలు కొనాలి వగైరాలు ఆలోచిస్తున్న పద్మని 'ఏం కొన్నారు రాణీగారు?' అంటూ పలుకరించేడు. అప్పుడే వచ్చిన ప్రభాకర్‌రావు.

అతనికి ముప్పైఏళ్ళు. మూరెడు గెడ్డంవున్నాయి. అతని ప్రశ్నకు జవాబివ్వకుండా అతని వేపొక సుపీరియర్ నవ్వొకటి విసిరింది పద్మ. నిజానికతనికి ఆ నవ్వు అర్థం కాలేదు. అర్థంకాదని ఆవిడ నమ్మకం. అర్థం చేసుకోనవసరం లేదని అతని ఉద్దేశం. అతను ఆడవాళ్ళని, వాళ్ళ నవ్వుల్నీ అతి లైట్‌గానూ, డబ్బుని అతి సీరియస్‌గానూ, తీసుకుంటారు. అందుకే చక్కగా కాళ్ళు చాపుకొని సోపాలో పడుకొని పేపరు చదువుకుంటున్నాడు. "ఏంవిటి విశేషం" అని అడుగుతాడనీ, అప్పుడతనికి తన గొప్పతనం అతి డ్రమెటిక్‌గా వర్ణించి చెప్దామనీ ఆశించిన పద్మకి అతని వాలకం పిచ్చికోపం తెప్పించింది. ఛీ ... ఛీ ... ఏం మగాళ్ళు? డబ్బుండగానేసరా టేస్ట్ వుండొద్దూ? నిజంగా తను చెయ్యబోయే పనికి అతను ఎంకరేజ్ చేస్తే ఎంత బావుంటుంది? కానీ అసలు ప్రపంచంలో ఏ మొగాడు ఏ ఆడదాన్ని - ముఖ్యంగా పెళ్లాన్ని ఎంకరేజ్ చేసేడు? నెవర్. అసలేం చెప్పకూడదు ఇతనితో. ఎందుకూ చెప్పడం? మంచిపని చెయ్యడానికి ఒకరి పర్మిషన్ దేనికి? ముందుగా చెప్పడం కంటే ఒక్కసారే సర్‌ప్రైజూ, సస్పెన్సూ కలుగచెయ్యాలి. ఏవో ఆలోచిస్తూ అడుగుల చప్పుడికి తలెత్తినపద్మ ఎదురుగా నిల్చున్న ఆ అమ్మాయినిజూసి ఆశ్చర్యపోయింది.

12

"ఏ అలంకరణా లేకపోతే యింత అందంగా వున్న యీపిల్లఅందం అన్నీ అమరిస్తే ఎవరాపగలరు ?" అనుకుంది.

సరిగ్గా అదే సమయంలో అదే అడుగుల చప్పుడుకి తలెత్తి పేపరు కిందనుండి కాజువల్‌గా చూపిన ప్రభాకర్‌రావు కళ్ళలో గమ్మత్తయిన మెరుపు మెరిసింది. ఆ మెరుపు చూసిన పద్మకి వెంటనే "వాట్ ఎ బ్యూటీ" అన్న అతని మాటలు పిడుగుల్లా వినిపించేయి. ఆవిడ అరసెకండు కాలం అతనివేపు, ఆ అమ్మాయివేపు మార్చి మార్చి చూసింది. ఆ అరసెకండులో ఆవిడకి ఎన్ని యుగాల చరిత్ర కనిపించిందో కాని ఏం మాట్లాడకుండా పక్క గదిలోకి వెళ్ళిపోయింది. పేపరు చదువుకోవటమో, ఆ అమ్మాయిని మళ్ళీ చూడ్డమో తేల్చుకోలేని ప్రభాకర్‌రావు పద్మ వెళ్ళినవేపే చూస్తూ కూర్చున్నాడు.

అయిదు నిమిషాల తర్వాత పనిమనిషి వచ్చి ఆ అమ్మాయి చేతిలో ఒక మూడు రూపాయలు పెట్టి పంపించేసింది.

(ఎప్పుడో, ఎక్కడో యిలాటి కథ చదివిన జ్ఞాపకం. లేక కలగన్నానో)

—: o :—

"ఏటి మావా అప్పుడే అంత ముసిలోడి వైపోనా నంటావేటి !"

"నా ననకపోతే కానేటి ! మొన్న నా వయసోడే మా వూరోడు అగపడ్డాడు. అగుపడి ఆ వూసూ ఈ వూసూ ఆడి ఆస్పత్రి కెళతానని లెగిసేడు. పిప్పళ్ళ బస్తాలాగున్నావు. ఆసుపత్రి కేలొరే అన్నాను. "ఏటి చెప్మంటావు ? రేత్రి మా ఆడది..." అన్నాడు. బొడ్డూడని వెధవలు మీ కెందుకొరే ఈ కబుర్లన్నీని...కాస్త ఒటేలు ప్రొపైట్రు బాబుని పిలు. బల్లు క్లీన్ సెయ్యమనాలి."

"పల్లూడిపోయినా పోనిది, పళ్ళన్నీ రాకముందు వుడితే తప్పా !" మీసం వస్తున్న వాడొకడడిగాడు.

"నిజమేనొరే. ముందటేడు గుంటూరు కెళ్ళినప్పుడు సివంచెలంగోడు కనిపించి" ఊళ్లోకి నరసమ్మ వచ్చిందిట. నా నెళ్ళి సూసొస్తాను కాస్త టాక్సీ కాడ నిలబడు. బేరం పోద్దో ఏటో అన్నాడు.

"నరసమ్మెవరు ?"

"ఆడొగ్గేసిన పెళ్ళాం."

"ఒగ్గేసిన పెళ్ళాన్ని సూడ్డానికా"

"పనిమాలా బేరం మానుకొని ఒగ్గేసిన పెళ్ళాన్ని కాపోతే ఒదిగున్న పెళ్ళాన్ని సూడ్డాని కెడతాడటరా ఎవరన్నా సన్నాసీ. నువు మాటి మాటికి అడ్డొచ్చినావంటే రాని దంతాలు కూడా పీకేగలను...ఇందాకేటన్నానూ ?

ఆపినావా ! లేపోతే ఈ వొరసంలో మామూలు ఐదూ, రాంగ్‌సైడు ఆపినందుకైదూ ఇమ్మని పోలీసో డెవడో వచ్చేస్తాడు."

"ఇంత వొరసంలో ఏ పోలీసొస్తాడు మావా !"

"అలాగనకొకే దొంగలకీ, లంజలకీ, పోలీసోళ్ళకి వొరసం రాతే గిట్టుబాటు జాస్తి" లోకంలో సీమదూరని జాగా వుంటాదేటో గాని పోలీసోడు సూడని పెదేశం ఉండదనుకో. ఎనకటికి మల్నాటోళ్ళే సంతపేట సన్నాసమ్మది ఆరో మనుమావా ఏడో మనుమావా అని కొట్టుకు సచ్చినార్ట. పోలీసోడి సంగతి తరవాత చూద్దాం కాని ఆప్రొపైట్రిటు బాబుని బేగి పిలండి. ఆకల్నేదు గాని కడుపులో సచ్చిపోయినట్టు సల్లబడిపోనాది. కాస్త ఏడీ టీ నీళ్ళడితేగాని పళ్ళు కరుసుకు పోతున్నాయి. బాబూ. ప్రొపైట్రిటు బాబూ. కాస్త సేతి గుడ్డట్టుకురా" అని గట్టిగా పిలిచాడు.

ఆ హోటేలు పాకలో వున్న పది బల్లలచుట్టూ లారీల మనుషులూ, బస్సు పాసింజెర్లూ కిక్కిరిసి వున్నారు. పాక పాకంతా పొయ్యి పొగతోనూ, బీడీల పొగతోనూ ఎంత నిండి పోయిందంటే ఆపాకలో వున్న కర్రకూడా కాన్న ప్రాణాలు, మసిబారిన గ్లాసు లైటుకంటే ఎర్రటి పొయ్యి వెలుగే ఎక్కువగా కనిపిస్తోంది. చూరుకింద పడుకున్న ఒక కుక్క వర్షంజల్లు తగిలి లేచి హోటలు నిండా వున్న జనాన్ని చూసి చూరుకిందే నిలబడిపోయింది.

తలోగా వాళ్ళ బల్లదగ్గరికి ప్రొపైట్రిటు వెళ్ళాడు

అడక్క ఏటడిగాడో తెలుసా. నాకో ఇసయం తెలుసుకోవా లని వుంది. బతకడానికి ముక్యంగా ఏటి కావాలి అనడిగాడు. అప్పుడు ఈస్వారుసు ఏటన్నాడంటే" నీకు లేందీ మీ ఈదికుక్క కూడా తెలిసిందీ-"డబ్బు"అని. ఆపిచ్చిముని అయితే ఆడబ్బే తే అని అడుగుతాడేమో అని ఎంటనే మాయమై పోయాట్ట."

"అయితే నువ్వాననది. డబ్బులేనిదే బదకలేవంటా వేటి?" ధర్మసందేహం వెలిబుచ్చాడొకడు.

"బతకలేకేంరా. బతకొచ్చు. డబ్బులేకుండా నీ ఈది కుక్క మీ సాకలోడి గాడిద బతకడం లేదూ. అదిగో ఆటి ల్లాగే బతకొచ్చు. కాని నీ బతుకు కూడా ఆటి బతుకుల్లాగే వుంటాది."

"నీకో డబ్బుంటే ఏటి చేస్తావ్?"

"ఏటిసెయ్యను ఏటి సెయ్యక పోడానికే డబ్బు."

"ఏటిసెయ్యక పోడానికి డబ్బెలరా?"

"అద్దదీ, అక్కడే వుంది. హరిదాసు చెప్పినట్టు అసలు యిసయం. డబ్బుంటే ఏటీ సెయ్యక్కరలేదు. అదే సేసు కొచ్చేస్తాది అన్నాను."

"ఏటి సేసాదేం?"

"ఏటి సెయ్యకేం?"

"నువ్వే సూసుకో. నువ్వో పకీరుగోడివి. నెత్తిమీద రూపాయెడితే ఎవడూ పావలాకి కొనడు. నీ పక్క నెవ రున్నారు? కుల్లు కుక్క ఎలాగున్నది? నువ్వు స్తే నిన్ను పీక్కు

తినాలన్నట్టు నీవేపే సూస్తున్నాది. నువ్వుసస్తే నీ శవాన్ని సూపిసందాలెత్తుకోవచ్చినట్టు సూత్తున్నారు నీపక్కనున్నోళ్లు. నువు పుడితే సంతోషించి నోడెవడు? అసలెందుకు సంతోషించాలా? రాజ్జానికి రాజు పుట్టాడనా? లచ్చలకి అధికారి పుట్టాడనా? పెజకి నాయకుడు పుట్టాడనా? ఎందుకురా? ఎందుకు సంతోసించాలా? లేని పాలివ్వలేక మీ అమ్మ ఏడిసుండాలా? పేడకుప్పలేరుకునే ఈడుచ్చే వొరకన్నా వొణ్ణా పెట్టాలని మీనాయయ్య ఏడుసుండాలి. కాస్త వొయసొచ్చాక తన జోబిలో బీడీలు కొట్టేస్తున్నావని మీ యన్న ఏడిసుండాలి! పడుసుకుని తెచ్చిన డబ్బుతో నువ్వు తాగేస్తున్నావని మీ యప్ప ఏడిసుండాలి. సినిమాహాలుకాడ స్టూడెంటు కుర్రాళ్ళని సూసినప్పుడల్లా నిన్నెందుకు కట్టుకున్నానని నీ పెళ్ళాం ఏడుస్తుండాలి. నువ్వు రేత్తిరి వొణ్ణా తిన్నాక నీ బీడీలకట్టకి కొట్టుకెళ్ళిన నీ కొడుకు తనీడువాళ్లు సదువుకుంటూంటే సూసి ఏడుస్తుండాలి. నీ కూతురుకే ఈడొస్తే దాని బతుకు బజారు పాలు చెయ్యని దేవుణ్ణీ, నిన్నూ తలుసుకుని ఏడుస్తుండాలి. ఇంక నువ్వు సస్తే ఏడిసేదెవ్వరూ? నీయమ్మా? నీలాటోడ్ని కన్నప్పుడు పురుట్లోనే సచ్చీసుంటాది.

నీ పెళ్ళామా? దెయ్యమై నీ మొదటి తద్దినాని కెళ్ళి చూడు ఎవడితో వుంటాదో?

నీ పిల్లలా? బతికినప్పుడు వీవంత బణారసు చీరలూ, సిలుకు లాలిచీలు కొనిచ్చీసినావని. సచ్చినప్పుడు ఏడవడానికి ఆళ్ళు పుట్టి బుద్దెరగాక ఎప్పుడూ నవ్వేరగరు.

మరంచేత మీలాంటి బీదెదవలకి సత్తేనే ఇవల ఎక్కువ నీ శవాన్ని సూపి సందాలెత్తుకోవచ్చు."

అయితే అన్నింటికి డబ్బే మూలం అంటావ్ ?" ఎవడో అడ్డు ప్రశ్న వేశేడు.

"నీలాటోడే బజారుముండని సూసి కుసింత సెడ్డట్టు అగుపడుతోందన్నట్టు. ఆడూసొగ్గేకాని నానోకత సెప్తా యింటారా ?"

"యిప్పుడు కతలెందుకులే మావా" ఒకడు మూలిగేడు.

"నాలాటిదే ఓపాలి బెమిసి బేపనాడ్ని పిలిస్తే యీపొద్దు బుదవారం బుద్దిగుండాలన్నట్టు. అదిగో అలాగుంది మీ సంగతి. నా కతలినడానికి పత్రికలోళ్ళు పరుగులెకతా వుంటే, కోరి సెప్తానంటే యినవంటున్నారు కానీండి, నాదేటి పోతాది ?"

ఈలోగా "టీ"లు తెచ్చాడు ప్రొప్రైటరు.

ఒక గ్లాసు తీసుకొని రుచి చూశేశాడు అతను "ఇదేటి ప్రొప్రైట్రు బాబూ 'కాపీ' వా ? 'టీ' వా ? కాపీ అయితే టీ ఒట్టుకురా టీ అయితే కాపీ అట్టుకురా రెండూ కాకపోతే ఏద్దై నా పట్రా" అన్నాడు.

"నీకెప్పుడు పరాసికాలే" అంటూ నవ్వేడు ప్రొప్రైటరు.

"నువ్వు ఆడదానివైనా అంటాలని ఉండదు. నీతో పరాసకాలేటి నాకు ?"

ప్రొపైట్రరు వెళ్ళిపోయేడు.

"ఇందాక ఆసికాని కొద్దన్నాను. కత సెప్పుగురూ" అన్నాడు యిందాక కథ వద్దన్నవాడు.

"నీ యమ్మ నీ అయ్యని పెళ్ళి సేసుకుందిరా? మని షన్నాక ఒక మాటమీదుండాల".

"వింటే మాత్తరం ఆడికర్దమై ఏడుస్తా దేటి! ఆడో గుంట ఎదవ. ఆడిమాటకేంగాని కత కానీ గురూ" అంటూ మిగతావాళ్ళు బతిమాలేరు.

"అయితే యినండీ. ఎంకటరత్నం బాబు కథ సెప్తా"

"ఆ బాబెవడు?" ఉండలేనివాడు అడిగేడు.

"తాటకి తమ్ముడ్డుం మరిడమ్మ మొగుడు. ఇంత తోందర ఎదవపని కట్టుకున్న యీడిపెళ్లాం ఎలా ఏమస్తోందో. కదకాడ కూడుకాడ నిదానం వుండాల్రా నిదానం. మళ్ళీ ఎర్రి మొర్రి పెళ్ళి లేసి కద కడ్డం వచ్చినావంటే ఎంవీక విరి సీసి పొయిలో పెట్టేగల్ను. వల్లకుండు. ఎంతవరకూ సెప్సి నానూ?" అంటూ ఆగి బీడీ అంటించేడు.

"వెంకటరత్నం బాబుండీవోడన్నావ్."

"అన్నానా. ఆ బాబు బస్సులోనే నాను మొదట ల్లోనరు పని సేసింది. ఆ బాబు కారే నాను మొదట గుద్దిం చేసింది. ఆ బాబు నెలా మరిసిపోతాను." అంటూ అగి ఆరి పోతున్న బీడీని గట్టిగా పీల్చి మళ్ళీ ఆరంభించేడు.

"మనకి సొతంత్రం రాకముందెక్కడుండీవోడో తెల్దు గాని సొతంత్రం వొచ్చీ సరికి పట్నం జేరి రెండు టాక్సీలు

ఎట్టేడు. ఆ బాబు ఉంచుకున్న దానిది గొప్ప దన జాతకం. రెండు టాక్సీలూ రెండేళ్ళ నాటికి యిరవై అయేయి. ఆ తర్వాత అవి బస్సులయేయి. బస్సులు లారీలయేయి. ఇయన్నీ కలిసి రెండు సినీమా హాళ్ళు అయేయి. ఆ ఊరికా బాబు సెయిర్మన్ అయిపోనాడు. అయితే ఒక మాటొరె. సంపాయించడానికి సెయిర్మన్ అవలేదు. ఎంత రెండు సంసారాలుంటే మాత్తరం ఆ బాబుకున్న ఆస్తి సాలదేటి? మనం ఆబాబు పొలానికెత్తే అవలి గట్టు అగుపడదు. ఇంటికెత్తే పై అంతస్తు మనక్కనపడదు. ఆ బంగళా ఎలా గుండిదేటి? అందులోకెల్లిన పెతివోడూ అభిమన్యుడే. మరి బైటికి రాలేడు. అందులో నేలని ఏసిన తివాసీలు సేత్తో అంటుకుంటే మాసిపోతాయి. ఒక్కో బాత్ రూమూ నాలుగు బెడ్ రూములంతుంటాది. యింతెందుకూ. ఆ బాబు అత్తరు సీసా మన ఆనందం బుడ్డి అంతుంటాది. ఆ బాబు యిచ్చే మందు పార్టీలు లెక్కవెయ్యడానికి పెత్యేకం ఓ గుమాస్తా వుండి పోతాడు. అయితే యిన్నున్నా ఆడదాని విషయంలో మాత్తరం మహా నిజాయితీ అయినవోడు. ఆ గంగమ్మని ఎందుకు తీసి నాడో తెల్దు కాని ఆవిడ్ని, పెళ్ళాన్ని తప్ప మరో ఆడమనిషిని కన్నెత్తి జూసేవోడు కాడు. గంగమ్మని తెచ్చేడని పెళ్ళంవేపు సూడ్నేదు అనుకునేవోరు! గంగకాడ యీవోరం పడుకుంటే సీతమ్మ అంటే పెళ్ళంకాడ కింది టోరం పడుకున్నాడన్నమాటే. గంగమ్మకి రంగమ్మ ఒక్కతే కూతురై తే, సీతమ్మ తల్లికి అయిదుగురు రత్నాల్లాటి కొడుకులు. పెపంచికానికి జెకిసి ఆళ్ళిద్దర్నీ ఒకింటిలో ఎట్టలేనుగాని,

ఆళ్లిద్దరికీ ఏ కోపాలూ నేవంట. అలాగని ఆ విడింటిలో యావిడా, యావిడయింటిలో ఆవిడా ఎప్పుడూ వుండే వోరనుకున్నావ్! ఆ బాబుతో తిరపతో మక్కేడకో ఎల్లినప్పుడు తప్ప కల్సుకునేవోరుకారు.

ఇన్నున్నా ఆ బాబుకొకటే యిశారం. "సదువునేదే" అని. సెయిర్మన్ అవక తప్పదని సంతకం నేరుసుకున్నాడనుకో. మరింక ఏం సేసినా సదువు రానేదు. సినీమా పేపరైనా సరే కొడుకో, కూతురో సదివి యినిపించాల్సిందే. కాని ఎలక్సన్లలో మాత్తరం...ఆ డెవడూ బారతంలో కొస్తాడూ? ఆఁ శకుని అలాంటోడు. మొగోడు ఎవుడన్నా అవతల పార్టీకి ఓటిస్తే ఆడిముండ ఓటు ఆ బాబు లాగీసేడన్నమాటే. నూటికి ఎనభై వోట్లు ఆ బాబుకే అయినా, అవతలి పార్టీ ఓటు ఒక్కటి లాగడానికి పదివేలన్నా సరే కరుసుపెడ్తాడు. వొంద పాపాలు సెయ్యమన్నా సేస్తాడు కాని ఏ మాట కామాటే సెప్పుకోవాల. ఆడదాని కాడ ఎంత నిజాయితీవో డబ్బుకాడా అంతే. ఆ ఆస్తి అంతా రావాల్సి వచ్చిందేగాని ఆ బాబు పాపాలు జేయిస్సి సంపాయించింది మాత్తరంకాదు.

"డబ్బు కేత్రా! ఆడది సంపాయిస్తాది." అని కొట్టి పారీసీవోడు. ఆ బాబు యాపారం అంతా మేనిజెర్లు సూడాల్సిందే. లెక్కలన్నా జూసేవోడుకాడు. ఆ బాబు కాడకిరాని ఆపీసరు నేడు. హైదరాబాదులో నవాబు మాటకెంత యిలవో ఆ బాబు మాటకీ అంతే. కాని తన కోసరం అని ఏ ఆపీసర్నీ ఏదీ అడిగీవోడుకాడు ఒక పాలేర్తెందంటే, కొత్తగా వొచ్చిన

ఆబేకినసపెట్టు ఎవుడో హెల్పీక ఆ బాబు బస్సునిూద ఓవర్లోడు కేసు పెడితే. ఆ బాబు కేసు తీసేమని సెప్పలేదు సరికదా ఆబేకినసపెట్టోని పిలిసి, ఆడి ఎదకే ఓవర్లోడు సేసిన కండట్రుగోడ్ని కంచీతో కొట్టితొక్కెక్కలాగేసేడు.

అయితే ఆబాబుకి ఒకటే పిచ్చి. పవరుపిచ్చి. ఎప్పుడూ ఆ బాబు గదిలో పదిమంది వుండాలి. గది అవతల మరో పదిమందుండాల. "బాబూ! మాకే పంచదార కోటా ఇప్పించండి" అనొచ్చినా, "తెలక జేసినాడు మావోడు యాకూనీ కేసులో తప్పించండీ" అనొచ్చినా ఒక్కలాగే జూసేవోడు. ఒక్కలాగే పాట్లు పడేవోడు.

అయితే ఒకట్లే. ఆ బాబు మాటకా యిలవుండేది. ఆ బాబు నోరిప్పి" "ఈన్ని ఒగ్గీయండి" అని జెప్పకుండానే ఒగ్గీసీవోళ్లు కూనీ కేసులో ఉన్నోడినైనా సరే ఇనసపెట్టర్లు. మర్రైతే ఆ బాబు మాటకి అంత యిలవ రాడానిక్కారణం సగం ఇస్సినాదం బాబు."

"ఈ బాబెవడు?"

"సరిగ్గా యీ మాటే అన్నారట కుశలవులు రామున్ణి చూసి. ఇస్సినాదం బాబు ఎంకటరత్నం బాబుకి ఏదో దూరం సుట్టం. ఎంకటరత్నంబాబు చాకైతే యిస్సినాదం బాబు బాకు. పోలిటిక్సుతో ఆ బాబు రాచ్చసుడైతే యీ బాబు బెమ్మరాచ్చసుడు. ఆ బాబు పాఁవైఁతే ఈ బాబు రెండుతలల పాము. ఆ బాబు పులైతే యీ బాబు సెట్టెక్కడం ఒచ్చిన పులి. మరంచేత యిసినాదం బాబుని సిన్నప్పుడే సేరదీశేడు ఎంకటరత్నం. సేరదీసి సదువు సెప్పించి

పెళ్ళిసేసి పై సరదాలకి రంగమ్మ నుంచుకోమన్నాడు. దాంతో మరి యిస్సినాదంబాబు వెంకటర తం కుక్కైపోయే డంచే నమ్మండొరే." అంటూ మరో బీడీ తీసి అంటించి ఆ చీకట్లో రంగమ్మ కనిపిస్తున్నట్టు చూస్తూ వుండిపోయేడు.

"ఈ కాలం గుంటలకి జెబ్బావుండదు చట్టావుండదు. ఆరు గజాల చీరగుడ్డిస్తే అందులోనే లంగా, బాడీ కుట్టేసు కుంటారు. రంగమ్మ అలాకాదు. ఏడుగజాల కోక ఒక చుట్టు కొస్తాది. నువ్వు కాలంలోవున్న పులి నెప్పుడన్నా జూశావా? అదిగో అలాగుండేది. పులిని జూసి సిన్న జంతువులు నిలబడి పోయినట్టు మొగాళ్ళు నిలబడిపోయావోరు, రోడ్డుమీద ఆ యమ్మ కారెక్కివస్తే. సెయ్యొత్తు మనిపేమో నీలాటోడ్ని సెయ్యొత్తి కొడితే నీకు వేరే గొయ్యి తియ్యక్కర్లేదు. అలా బూవిలోకి దిగిపోవాల్సిందే. జోబీలోకి పరుసు దిగిపోయి నట్టు. అమెరికా పెసిడెంటుని తీసుకొచ్చి ఇండియా అంతా చూపించి నీకేటి కావాలంటే రంగమ్మ కావాలంటాడు. అదేటోగాని పొట్టివాళ్ళనీ, పొడుగువాళ్ళనీ ఒక్కలాగే ఆకట్టుకుంటా దాయమ్మ. జనమంతా నీ పెళ్ళాంతో కాపరం చేస్తావా? రంగమ్మతో ఒక రేత్తిరుంటావా అంటే జబ్బు మనిసెవడన్నా పెళ్ళాంతోనే వుంటాడనొచ్చు. మళ్ళీ మనిషి...రంగు ఎలాంటిది! నలుపే. కాని తెల్లోడుకూడా యిలపకట్టే నలుపు. దానికో మెరుపుంది. ఆ యమ్మ సైజే ఆ యమ్మ అందం. ఇరవైకీ, ఎనభైకీ మధ్యనున్న ఏ మొగో డైనా ఆవిడ్ని చూస్తే యింక ఆడు ఆ యమ్మకి కుక్కే

ననుకో...ఇచి త్తరం ఏటంటే మగ్గురు పిల్లలతల్లి అయినా, ఆయమ్మ పిల్లల్ని కనడానికి పుట్టిన ఆడదాన్లా గుండదు.

మరింక అదిగా అలాంటి ఆడదాన్నిచ్చిన ఎంకటర త్తం మాట కాదని యిస్సినాదంబాబు ఎక్కడికెళ్ళగల్డు?

ఎంకటర త్తంబాబు యిస్సినాదానికి రంగమ్మ నియ్య డము ఒక ఎ త్తయితే, తొలిపాలి ఎమ్మెల్లే జెయ్యడం రెండెత్తులు. ఇస్సినాదం బాబైనా తక్కువరకంగాదు, వేలు జూపిస్తే ఊంగరం మింగేసేరకం. తొలిపాలి ఎమ్మెల్లేలయేడో లేదో మలిపాలి మినిష్టర్ అయిపోనాడు. ఆ తరవాత ఐదరాబాదులో ఆ బాబెలాగుండేవాడో నాకు తెల్దు కాని ఇక్కడ ఎంకటర త్తంబాబు మా త్తరం రాజుగారి మాదవలా గెలిగిపోనాడు. మళ్ళీ పెళ్ళీడు కొచ్చినట్టు అయిపోనాడు. ఆ రోజుల్లో అతనిల్లు చూస్తే ఇది ఇల్లా? మునసబు కోరటా? అనిపించీది. వొచ్చీపోళ్ళూ, పోయీవాళ్ళు, ఆ జనాన్ని చూస్తే ఇంటిముందు ఒక హోటేలో బీడీల బడ్డీవో పెట్టా లనిపించీది.

"మా అబ్బాయికి వుద్యోగం.... నా సెల్లెలు మొగు డ్నొగ్గేసింది .... బియ్యం లారీలు ముందు యినాసపెట్టు తరవాత కమరిషెల్ పెట్టుకోన్నాళ్ళూ పట్టేసుకున్నాను ... మీకు వోట్లిచ్చినాడవని అన్యాయంగా రైటింగ్ కేసెట్టినారు ... యీ ఒక్కపాలికి తప్పించేరంటే మళ్లా మావోళ్ళ కూనీ సెయ్యరు ... తెల్లారి నెగిస్తే యిలా గడిగీవోళ్ళు లచ్చా తోంబయిమంది. ఎపుడొచ్చినా కాదన్లేదాబాబు. తన సేతులమీద పెజలసొమ్ము ఏలకి ఏలూ ఎల్లేది.

మరంతే. అంతవరకూ డబ్బుకాదున్న నీతి ఒగ్గేసినాడు. తరవాత యినాసపెట్టు బాబుకి వంద వసూలుచేస్తే తనకోసం వెయ్యి వసూలు చేసేవోడు. అదివొరకు మొహమాటానికి చేసే ఆఫీసర్లు యిప్పుడుడబ్బుపడి నీతి పూర్తికా ఒగ్గేసేరు. అదివొరకు తెల్లోడి బావుటా ఎలా గెగిరీదో యిప్పుడలా ఎగురుతోంది ఆ బావుటా, ఆ బాభులేని సబలేదు. సరదాలేదు. మినిష్టర్ మీటింగులోనూ అబాబే, మేష్టర్ల మీటింగులోనూ ఆ బాబే, సినిమావోళ్ల కమిటీలోనూ ఆ బాబే, సర్కసోళ్ళ సంగంలోనూ ఆ బాబే.

మడిసి పాండురోగం వొచ్చినట్టు తెల్లబడిపోనాడు తనివికి.

ఇదిగో యీకత యిలాగుండగా ఆ జిల్లాకి ఓసారి గాలివానొచ్చింది. నడివేసంగిలో. ఏసంగిలో ఏళ్లు (నదులు) ముంచేస్తాయని బెన్మ్మంగోరు రాశేరట. వొరసానికి ఆకాసం బూడిదకి అంటుకుపోయిందనుకో. సావని పశువేదన్నా వుంటే పడిపోని యిల్లుండేమోనని చూసి అందులో కట్టేసేవోరు. సలికి వణకలేక గొర్రెలన్నీ సచ్చేయి. యీ యింటిని, ఆ సెట్టునీ పట్టుకొని వుండిపోయినారు పెజ!

ఆ తరవాత గవర్నమెంటు కోట్లు కరుసుపెట్టింది. ఆ కోట్లు పజకాడే వొసూలు సెయ్యమని ఐదరాబాదులో ఏసిన అర్డరు కలకటేరుకు ఎంటనే వొచ్చీసినాది. దాంతో తాసిల్దార్లూ, పోలీసోళ్ళూ ఊరిమీద పడ్డారు.

"వొరదొచ్చి పెజ సస్తావుంటే ఆళ్ళకి సాయంచెయ్య

డానికి అళ్ళనే అడగడవేఁవిఁటి నాయం?" ఎవరో సందేహం వెలిబుచ్చేరు.

"అదిగక్కడేవుంది కీలకం. మామూలప్పుడు ఆరు పైస లగ్గిపెట్టి పది పైసలకూ, రెండు రూపాయల పంచదార నాల్రూపాయలకూ, అమ్మి లచ్చలు కొట్టేస్తారు. ఈ ళ్ళిలాగ కొట్టేస్తుంటే గవుర్న మెంటూరుకున్నందుకు, వరదొస్తే ఒక చందా, వాన రాకపోతే ఒక చందా, ఎలక్సనొస్తే ఒక చందా పారేస్తారు. ఇదిగిక్కడేవుంది మోసం. ఆళ్ళు సందా లివ్వకపోతే సచ్చిపోయుండేవోళ్ళమని మనం ఆళ్లు ఎవళ్ళ కెయ్యమంటే ఆళ్ళకి ఓట్లు పడేస్తాం. మొన్న పార్కులో ఆ డెవడో చెన్నాపట్నంనుంచి వచ్చినాట్ట. వొచ్చి మీటిం గెట్టి, ఏటడిగాడంటే "మనల్ని ఏటి పాలిస్తుంది?" అన్నాడు. "కాగితం అన్నారు పెజ." "ఏకాగితం?" అన్నాడు మళ్ళీ. "ఓటు కాయితం అన్నారు పెజ." "కాయితం అన్నమాట నిజమేకాని ఓటుకాగితంకాదు. తుపాకి గుండుచుట్టున్న కాగితం" అన్నాడు. ఎర్రిమొర్రి పెళ్ళలేసి నా కత మరిపించీసినారు సీతమ్మతో హనుమంతు డన్నట్టు. ఎంతవరకు సెప్పినానూ?"

"చందాలవరకూ"

"అవునా. మరైతే యిను. యీ చందాలు ఎలా వసూలు చేస్తారంటే - కలకటేరు కూకుంటాడు. ఆ బాబూ సుట్టూ మిగతా ఆపీసర్లు అంటే సూపర్నింటూ, చెక్ పోష్టోళ్ళు, ప్రొహిబిషనోళ్లూ అంతా కూకుంటారు. అప్పుడు

కలకటేరు బాబు ఆళ్ళందర్నీ సూసి ఓనవ్వు నవ్వి" మన జిల్లాకి వొరదవల్ల యింతనష్టం వొచ్చినాది. మనం యింతైనా వసూలు సెయ్యాలంటాడు. "ఔనౌను" అంటారు మిగతా వాళ్ళు అంతే. మిగతా అపీసర్లు యిళ్ళకెళిపోయినా ముందు తలో సీటీ యిస్తారు. ఆ సీటీల్లో వుంటాయి ఆళ్ళు వసూలు సెయ్యాల్సిన మొత్తాలు. ఆళ్ళు ఎలా వొసూలు సేత్తారంటే మాటొరసకి సూపరెంటు బాబే ఒక లక్ష వొసూలు సెయ్యాలనుకో. ఆ బాబేటీ సెయ్యడు. ఆబాబు కిందున్న డీయస్పీ బాబుతో సెప్తాడు. ఆ బాబులు యినసపెట్టర్లమీద పడతారు.

"మజ్జెలో ఎవుడూ కొట్టీడేటి?"

"గవర్న మెంటు సొమ్మంటే లంజెమూనం లాంటిది. అందరికీ లోకువే. ఆకరికి రావణాసురుడిలాటోడె కొట్టేశేడు"....

ఒకనాడేకైందంటే ఎంకటరత్తం బాబుకాడికి యినాస పెట్రుబాబూ, తాసిల్దారుబాబూ వొచ్చినారు. గొప్పోళ్ళ సంగతి నీకు తెల్దుకామోసు. వొచ్చినాడు గొప్పోడైతే ఎందుకొచ్చేది సెప్పకు, మనం అడిగేవరకూ. ఆ బాబులు వొచ్చి మా బాబుతో ఐదరాబాడు యిసయాలడిగేరు. ఢిల్లీ యివరాలడిగేరు. ఆఖర్న మా బాబు అడిగితే రామారావు బాబు సందా యివ్వడానికి ఏడిపిస్తున్నాడు అన్నారు. ఆ బాబు పేరుమీద ఏసినవి ముష్టి పాతిక ఏలు. "కిందటేడు

వోనల్లేవస పాతిక వేలట్టుకెళ్లేరు. యీ ఏడు వొరదొచ్చిందని పాతిక వేలడుగుతున్నారు. నొచ్చీవేడు ఎలక్ష నొచ్చిందని ఎంకటరత్తం బాబు ఎలాగో పాతిక వేలు పితుకుతాడు. ఏటా పాతిక వేలు మీ మొహాన్ని గుమ్మరించడానికి నేనేం యాపారస్తుడి ననుకుంటున్నారా? నోట్లుమిషనున్నదనుకుంటున్నారా? మీ కిష్టమైతే అయిదు వేలిస్తాను. దణ్ణంపెట్టి ఒట్టుకెళ్ళండి లేపోతే దణ్ణంపెడతాను. ఎల్లిహొండి"అనేసెడు అని ఫిర్యాదు చేశేరు. అంతేకాదు. రామారావుబాబుగాని సండా ఎగ్గొడితే ఊరంతా ఎగ్గొడతారని హామీ యిచ్చేరు.

"రామారావు బాబెవరు?"

ఎవరంటావా మునిసిపల్ మెంబరు కాడు కాని ఎంకట రత్తం బాబుకి రెండు బుజాలూ అతనే. ఎలక్షన్లలో మదు పెట్టడం కాడ్నించి, ఎంకటరత్తం పేరు సెప్పి పెజల్ని జడిపించి ఓటు ఏయించడం వొరకూ చూసుకుండే పదిమందిలో రామారావు బాబొకడు. అయితే అలా సేసినందునా బాబు కేటి లాబం అనేవ్. యజమాని పాలకోసం పొర్లడు ఆవు. ఆ బాబు లాబం ఆ బాబు కుంటాది. ఆబాబు మొదట్లో పెద్ద బంగారం సావు ఎట్టేసు. ఇడ్లికి చెట్నీలాగ బంగారానికి బట్టలుతోడు. అంచేత పక్కనే పెద్ద బట్టలకొట్టెట్టేసు. సెంటర్లో రెండు షాపులు ఊరికే ఎందుకుపోవాలని ఆటి మీద ఆరంతస్తుల హొటేలు కట్టేడు. షాపులెట్టి, హొటేలెట్టి సుడిగాలిలా పెరిగిపోనాడు. ఊరంతా ఏటనుకుండీ వోరంటేబొంబాయినుంచి దొంగబంగారం తెచ్చేహోల్‌సేల్

యాపారం రామారావు బాబుదేనని. ఎప్పుడూ ఎంకటర త్తం బాబుకాడుంటాడు కాబట్టి ఆబాబుకేం పరవాలేదు. తాసిల్దారుకీ యినసపెట్రుకీ తెలీని యిసయం ఏమంటే అప్పటి కప్పుడే రామారావుబాబు ఎదుటి పారిటీలో కలిసిపోతున్నా డేమోనని ఎంకటర త్తం బాబుకున్న అనుమానం.

"సరే మీరెల్లండి. మళ్ళీ మద్దేనం అగపడండి" అని ఆళ్ళని అంపించీసి అలా పడక్కుర్చీలో సచ్చినోడిలా ఒక అరగంట ఉండిపోనాడు. ఆ తరవాత ఏటి సేసినాడంటే "నాన్నా" అని సిన్నకొడుకుని పిలిచి "నువ్వు బట్టలు కొను క్కుంటాననన్నావ్ ?" అన్నాడు. అన్నాననన్నాడు కొడుకు. "ఎంతకావాలేటి ?" అన్నాడు కొడుకు.

"రెండువేల"న్నాడు కొడుకు.

"బట్టలకి రెండ వేలే !" సందేహించేడో శ్రోత.

"బట్టలకేనా రెండువేలు. బలాదూర్ గా తిరగటానికి అవేటి సరిపోతాయి. ఆళ్ళేటి సైనుగుడ్డలూ, సీటీగుడ్డలూ కట్టుకుంటా రనుకుంటావేటి ? మాట కడ్డురాక. "ఎయ్యి స్తాను తీసుకో ! నీ కిష్టంవొచ్చినకాడ కొనుక్కో. కాని ఆ రామారావు కొట పాతబాకీ యిదిగో యీ అయిదువేలూ కట్టి" అంటూ యినప్పెకెట్లోంచి అస్నీ వొందరూపాయిల కాయితాలు తీసిచ్చేడు.

మద్దేనం వొచ్చినాకు యినసపెట్రూ, తాసిల్దారూనూ. ఆళ్ళతో ఆ మాటా యీ మాటా సెప్పి ఆ రామారావు గోడికి దొంగనోట్లు యాపారంవుండేమోనని అనుమానం. ఆడి బట్టలసాపు చెక్ చెయ్యండి. కాని వొందరపడి ఆడికి

బేడిలేసి తీసుకు పోవద్దు" అని ఆళ్ళని అంపించేశేడు. ఆల్లెళ్ళిన అరగంటకి ఎవిఁకెమికా యిరిగి పోయాటట్లు ఏడున్తూ కారు దిగింది రామారావు బాబు పెళ్ళాం.

"కదంతా సెప్పి బేడీలేసినారు బాబూ. నువ్వే కాపాడాల" అని ఎంకటరత్తం బాబు కాళ్ళ మీద పడి పోనాది.

ఆదికి ముందే కాపాడతానన్లేదు ఎంకటరత్తం బాబు "యింత డబ్బుండి యీ ఎదవ దొంగనోట్ల యాపారం ఎందు కెట్టేడు? ఆశకి అద్దుండాలి. పాపానికి శిచ్చుండాలి. నాను రానన్నాడు.

"నువ్వు రాకపోతే నాన్నాతిలో పడిపోతానంది ఆ యమ్మ.

"జైలు నుంచి ఒచ్చేక ఆడు పడతాడు కానీ ఎదవ యాపారాలు ఎట్టీవోడు ఎదవ చండాలు కట్టడానికి వీడు పెందుకు" అంటూ ఎంతమందికో ఫోన్లు చేసి కారెక్కేడు. "నానొచ్చే వొరకూ నువ్వికక్కడే వుండు" అని రామారావు పెళ్ళంతో అని.

మళ్ళీ ఇంటికొచ్చేటప్పుడు రామారావునీ, లచ్చ రూపాయల్నీ ఎంటబెట్టుకొచ్చేడు.

లచ్చ దేనికనుకుంటా రేటో గాలివోన సందా కేసుకు ముందు పాతిక వేలైతే పట్టుకున్నాక యాభై అన్నాడు. బేడీ లెయ్యకుండా ఉండడానికి ఐదు వేలూ, పోలీస్ టేషన్‌కి నడి పించకుండా ఉందడానికి ఐదు వేలూ అన్నాడు. కేసు పెట్టు కున్నందుకు ఐదు వేలూ. సిల్లర కరుచులుకి మరో పదీ

అన్నాడు. ఇదిగో నీ మిగిలిన పాతిక నువ్వు తీసుకో" అని రామారావుకి ఇచ్చేసేడు. ఆ తర్వాత పోలీసోళ్ళ సొమ్మ్నలో సగం ఆళ్ళకి పారీసేడు. గాలివోన సందా పాతిక వేలూ కట్టీ సేడు. "ఇది వసూలు జేసేసరికి తలప్రాణం తోక్కి రాలేదు వూర్తిగా పోయిందంటూ."

"నాకు తెలకడుగుతాను. రామారావు కొట్లో దొరి కిన దొంగనోట్లు ఎంకట రత్నం బాబు పంపినవేనంటావేటి?"

"లేదు. అసలు నోట్లు పెట్టిన పిల్లలంటాను. బుర్రుంటే సాలదురా. అందులో బుద్ధుండాలి. లేకపోతే ఏటా ఎదవ పెళ్ళ."

"ఆ బాబు కాడ దొంగ బంగారం ఉందికదా. నోట్లు బణాయించడం దేనికీ అంట?"

"దొంగబంగారం ఎక్కడు పాతేసాడో ఎంకట రత్నానికి తెలియొద్దా అంట."

"హమ్మ్మ లంజికొడుకెంత పన్జేసేడు. కదన్నా కదకాదు గురూ. యమకద."

"కద ఎప్పుడవుద్దో తెలీని లంజికొడుకు కద ఇనడం ఎందుకూ అంట. అప్పుడే అయిపోయిందనుకున్నావేటి? ఎంకట రత్నం బాబే తెలివైనోడను కున్నావ్ కాబోలు ఆడి బాబు తెలివి రామారావు కుంది. మరి ఆవేళనుంచీ ఆర్నెల్లున్న తిరిగీ వొరకూ ఆ బాబు అంటే ఎవరనుకున్నావ్—రామా రావు బాబు తన దొంగనోట్ల యాపారం తగ్గించేసుకున్నాడు"

—:o:—

జలుబు చేసిందా?

"ఏవిటా చప్పుడు" తుళ్ళిపడి కప్పులో కాఫీ చీర మీద వంపేసుకుంటూ అడిగింది పరమహంసగారి భార్య గీత.

దక్షిణాన భూకంపం వచ్చిందన్నా, అధమం మా బాత్‌రూము పడిపోయిందనేనా చెప్తే గాని నమ్మే పరిస్థితిలో లేదు ఆవిడ. నిజానికి యీ రెండింటిలో [illegible]వేది జరిగినా బావుండేది. కాని అంతకంటె ఘోరం జరిగింది.

"మా ఆయన తుమ్మేరు" అన్నాను.

వీలైనంత నెమ్మదిగా, లోపల పెరుగుతున్న ఆత్రుత కనపడకుండా.

మా వారికి కోపం వస్తే ఒళ్ళు తెలీదు జలుబుచేస్తే ప్రపంచమే తెలీదు.

"జడ్జిగారు తుమ్మేరా?" అంది గీత అదేదో నమ్మ్మ రాని దన్నట్లు. ఆవిడ యింకా ఆ షాక్ నుండి కోలుకోలేదన డానికి సాక్ష్యం - ఆవిడ చేతిలో కప్పూ, చీరమీద ఒలికిన కాఫీ యింకా అలాగే వున్నాయి.

"ఏం? ఆయనకు తుమ్మడం రాదనుకున్నావా? లేక పోతే జడ్జీలు తుమ్మకూడదా?" అన్నాను. ఆ సంభాషణ అంతటితో ఆపేద్దామని.

"అబ్బే. అదికాదు..." ఏదో అనబోయి మాటలు రాక ఆగిపోయింది పాపం. ఆవిడ పరిస్థితి నాకు పూర్తిగా తెలుసు. ఆవిడ తప్పేంలేదు. ఆయనలా తుమ్మ్లితారు - బిందెనిండా పటాసూ, గంధకం కుక్కి అంటించినట్లు.

ఒకసారి...మా తోటికోడలు వడ్డన ఏర్పాట్లుచేస్తూ కంచు మరచెంబుతో నీళ్లు పట్టుకొని వంటింట్లోకి వెళ్తోంది. అదేసైములో ఆయన ఆఫీసు గదిలో తుమ్మేరు. వెంటనే మాకందరికీ వినిపించింది వంటింట్లోంచి ఓ గావుకేక. మత్తు మందు లేకుండా ఆపరేషన్ చేయించుకుంటున్న రోగి ఆ కేకను ఇమిటేట్ చేస్తే కొంతవరకు సక్సెస్ అవొచ్చు. మేవంతా వంటింట్లోకి పరిగెత్తేం. మా తోటికోడలు పరిగెత్తడానికి వీల్లేనంత భయపడి "ఏవైంది!" అంది వెర్రి చూపులు చూస్తూ - పడిపోడానికి ఓపిక లేక నిల్చొనే ఫెయింట్ అయిన దానిలావుంది.

"నీ కాలు బద్దలైంది" అన్నాన్నేను. అప్పుడు చూసుకుంది. తన కుడికాలి బొటనవేలు రమారమీ లేదని. ఆ వేలు స్తానే ఒక మాంసం ముద్దవుంది. నేలని నీళ్ళతో కలిసి రక్తం పారుతోంది. అప్పటికి ఆవిడకి ఒంటిమీద తెలివివచ్చి "అయ్యో..." అని ఏదో అనబోయింది.

"మరచెంబు సొట్ట పోయింది" అన్నారు అతను.

మా తోటికోడలు వీడుపు "అయ్యో" తో ఆగి పోయింది.

మరో సారి—

మాంగో కుక్క పిల్ల వుండేది. పెద్దదికాదు కాబట్టి పిల్లే అనాలి. కుక్కలు రాత్రి మేలుకొని పగలు పడుకుంటాయి (ట). అది మాత్రం కేవలం భోజనం టైములోనే మేలుకొని వుండేది. అప్పుడైనా భోజనానికి ఏవైపు వెళ్ళాలో చూసి, ఆవైపుకన్నే విసేపేది. అది కమ్యూనిస్టు (కుక్క) అని నా నమ్మకం. ఎందుకంటే దొంగ వచ్చినా, దొర వచ్చినా ఒక్కలాగే నిద్రపోయేది. అది కమ్యూనిస్టు కాకుండా మహర్షి అని కూడా నా నమ్మకం! అది ఎప్పుడూ ఎవర మీదా అరవగా నేను చూళ్ళేదు. ఆఖరికి తోటి కుక్క మీద కూడా. అది కొంచెం పెద్దయ్యేక మా ఇంట్లో దొంగలు పడ్డారు. అసలొద్దీ పడ్డారే కాని మా ఇంట్లో వాళ్ళకి తీసికెళ్ళడానికి పనికొచ్చేవి ఏవీ కనిపించలేదు. అంత శ్రమ పడి వచ్చేక ఏవీ తీసికెళ్ళకుండా వెళ్ళడానికి మన సొప్పక ఏవో తువ్వాళ్ళూ, చీరలూ వగైరాలు పట్టుకుపోయేరు. ఆ వగైరాలలో మా కుక్క కూడా వుంది. అసలు మా ఇంట్లో ఏవస్తువూ వాళ్ళకి నచ్చినట్లులేదు. నిజం చెప్పాలంటే దొంగకి కాకపోయినా, మా ఇంట్లో వస్తువు నాకూనచ్చదు. కాని ఏంచేస్తాం! దొంగలకున్న ఛాయిస్ నాకు లేదు.

ఇంతకీ చెప్పొచ్చేది ఏంటంటే ... అది...అంటే మా కుక్క ఒక సాయంత్రం అరుగుమీద పడుక్కుంది. అప్పటికి దానికి ఆరునెలలుంటాయి. మా ఆయన మేడ మీద తుమ్మేరు. అంతే! మా కుక్క పడుకున్న పోజులోనే గాలిలోకి గజం మీదకి ఎగిరి - అక్కడో అరక్షణం అగి, అదే పోజుతో నేలని పడి పరిగెత్తడం ప్రారంభించింది. అది రెండు కళ్ళు

ఒక్కసారి విప్పగలదనీ, పరిగెత్తగలదనీ కూడా అప్పుడే తెలిసింది మాకు. దాని వెనకాలే మేమూ బైల్దేరేసరికి అది ఊరవతలకి వెళ్ళిపోయి, యింక పరిగెత్తలేక ఆగిపోయింది. మేము దాన్ని చేరేసరికి, అది మళ్ళీ పరిగెత్తడానికి ప్రయత్నించింది కాని, అలవాటులేకో, అతి నీరసంవల్లో ఆ ప్రయత్నం వణుకుగా మారింది.

మేవంతా దాన్ని ఇంటికి రమ్మని బతిమాలేం. "బలుసాకులుతిని బతుకుతాను, కాని రా" నంది.

ఆర్గ్యుమెంటు చెప్పేం.

అది లక్ష్యపెట్టలేదు.

"ఇంకెప్పుడూ తుమ్మల్లే, రా." అని మావారు దానికి అభయం ఇచ్చేరు. కాని అంతగట్టిగా తుమ్మేవారి మాటలు నమ్మకూడదన్నట్టు రానంది.

"పో. వెధవా. నీ ఇష్టంవచ్చిన చోటుకి పో, ఇవాళనుండి నువ్వు మా కుక్కవి కావు." వగైరా అచ్చుపెయ్యడానికి అభ్యంతరంలేని తిట్లు మూమూ, అభ్యంతరంవున్న తిట్లు ఒకటీ తిట్టేను. మేవంతా రామ, రావణ సంవాదంలా, మావారి, కుక్క సంవాదం వింటూ నిల్చున్నాం.

మా కుక్కకి అంత ఆత్మగౌరవం వుందని మాకు అంత వరకూ తెలీదు. బూతు వినిపడగానే రక్కున మావెంట వచ్చేసింది.

ఇంతకీ ప్రస్తుత విషయం ఆయన తుమ్మేరు. అంటే

మా ఇంటి సూర్యుడికి వారం రోజులు గ్రహణం. ఈ వారం రోజులూ మా ఇంట్లో ఎవరూ మాట్లాడ్డానికి వీల్లేదు. కుక్క కూడా అరవడానికి వీల్లేదు. ఆ సంగతి దానికీ తెలుసు. వారం చివర కొనుక్కోవలసినవి అరడజను గాజుగ్లాసులూ, రెండో మూడో కప్పులూ, అప్పుడప్పుడూ నూనె సీసాలు కూడాను. ఈ వారం రోజులూ అధమం రోజుకోసారైనా చేతిలోవున్న కప్పో, గ్లాసో గోడకి విసిరి కొట్టేస్తారు. ఈ వారం రోజులూ మా పిల్లలు ఆయన కంటపడరు. జవాన్లకీ, నాకూ తప్పదు.

అసలు వాళ్ళ వంశంలోనేవుంది ఈ రొంప (జలుబు) పిచ్చి అనాలో - పిచ్చి రొంప అనాలో - ఇది. వాళ్ళనాన్న అంటే మా మావఁగారు మరీను. అతని ప్రకారం జలుబుని మించిన జబ్బు యింకోటి లేదు. అతనికోసారి రొంపచేసింది. అప్పుడు మా ఇంట్లో దూరపుబంధు వొకడున్నాడు. ఉన్న వాడు ఊరుకోక - మెహర్బానీ కోసవేఁవో - "పడిశం పది రోగాలపెట్టు అంటారు" అన్నాడు.

"అలా అన్న గాడిదకొడికి పదికిమించి రోగాలుంటా యని తెలియదు" అన్నారు మా మావగారు.

"అంటారు" అని తన వాక్యానికి కలిపినందుకు మా బంధు వెంతో సంతోషించి వుండాలి.

మా మావఁగారి దగ్గర ఓ కర్ర పెట్టి వుండేది. దాన్ని ఎవరూ ముట్టుకోవడానికి వీల్లేదు. రొంపకి ఆయన సంపాదించిన మందులన్నీ అందులో వుంటాయి. అంచులో

సుమారు వందకి పైనేవుంటాయి. ఏ ఒక్కటీ రెండుసార్లు వాడలేదు. ఏ ఒక్క పని చెయ్యలేదు.

అతను మొదటి తుమ్ము తుమ్మగానే భూతవైద్యుడికీ, మంత్రసానికీ మిసహా వైద్యంతో సంబంధించిన అంతమందికీ కబుర్లు వెళ్ళేవి. ఎవరు ఏ మందు యిచ్చినా తాగేసేవారు ఏ పని చెయ్యమన్నా చేసేవారు. రొంపలేని రోజుల్లోకూడా మందులు సేకరిస్తూనే వుండేవారు. ఒకసారి ఏదో ఊరు వెళ్ళి రాత్రి భోజనాల కైముకి తిరిగి వచ్చేరు. ఆయన చేతిలో కిరసనాయిలు సీసా అంత సీసావుంది. అప్పుడు యుద్ధం రోజులు కిరసనాయిలు దొరకదు కాబట్టి ఎక్కడైనా దొరికితే కిరసనాయిలే తెచ్చేరనుకున్నాను. కాని కాదుట: తరవాత తెలిసింది. ఎలాగంటే. అప్పుడే భోజనం చేసి చేయి కడుక్కుంటున్న "వారాలబ్బాయి" పేరు అప్పల నరసింహ తుమ్మేడు.

"ఓరేయ్ ఇలారా" అన్నారు. మా మావగారు ద్రోహం చేసిన వాళ్ళ వెళ్ళేడు ఆ అబ్బాయి.

"తుమ్మేవా?" అన్నారు.

కాదంటే కాల్చేస్తారేమోనని అవుననన్నాడు.

"అయితే గ్లాసు తీసుకురా" అని, ఇదిగో, ఇది రొంపకి దివ్యౌషధమంటే, శ్రీపాద ఆయన స్వంతంగా కనిపెట్టేట్టు. రొంప రావడానికి, పోవడానికీ కూడా అదే మందుట" అన్నారు మా అందరితో.

అప్పల నరసింహం గ్లాసు పట్టుకొనివచ్చేడు. గ్లాసు

సగంవరకు మందుపోసి "అంతా ఒక్క గుక్కలోనే మింగేయ్యాలిట. రెండో గుటకివేసేవా డిదు పనిచెయ్యదు" అంటూ అతనికిచ్చేరు.

ఒక్క గుటకలోవే మింగేసేడు పాపం ఆ అబ్బాయి. అంతే తర్వాత ఏమైందీ మాకు కనిపించలేదు. మాకు వినిపించిందల్లా గ్లాసు నేలని ఎత్తేసిన శబ్దం. మనిషి పరిగెడుతున్న శబ్దం. మేము ఏం జరిగిందో గ్రహించే లోపునే ఆ అబ్బాయి వీధి దాటి ఎటో వెళ్ళిపోయేడు. అరాత్రి అతనికోసం వెతికేం కాని కనిపించలేదు. మర్నాడు పొద్దునే "చెరువు గట్టుమీద పడివున్నాడని" చెప్పి ఎవరో తీసుకొచ్చేరు.

కొంతసేపయ్యేక పక్కకి పిల్చి అడిగేను "మందు ఎలావుందని."

"లావా ఎప్పుడూ తాగలేదుగానీండి ఇలాగే వుంటుదను కుంటాను" అన్నాడు.

"మందు తాగేక ఏమైంది?" అన్నాను.

"నాకు తెలీదండి. చెరువు గట్టుమీద ఎవరో లేపడవే, జ్ఞాపకంవుంది" అన్నాడు.

ఈ సారి అన్ని విషయాలూ గుర్తుంచుకోమన్నాను. ఆ తర్వాత మళ్ళీ మా ఇంటికి వారానికి రాలేదు. అతను.

మరోనాడు...

మా మావగారికి రొంప పట్టినప్పుడు రంగాచారిగారు పాలూ, మిరియాలూ కలిపి తీసుకోమన్నారుట. ఇంటికొస్తూనే "చూసేవా! ఇంత చిన్నవిషయం మనకి తెలీనే

తెలీదు. అమోఘంగా పని చేస్తుందట. ఉట్టి పాలూ, ఉట్టి మిరియాలూ నట. కలిపి తీసుకుంటే చాలుట" అన్నా మా అత్తగారితో. అప్పటికి మా అత్తగారికి మొగుడ్ని బాహాటంగా ధిక్కరించే వయసు వచ్చేసింది. నిజం చెప్పాలంటే ఆవిడ చిన్నప్పటి నుండీ అతన్ని బాహాటంగానే ధిక్కరించేదిట!

"ఉట్టి పాలంటే-పోనీ ఒట్టిపోయిన ఆవులు యిస్తాయనుకున్నా. ఉట్టి మిరియాలెక్కడ దొరుకుతాయి!" అందావిడ.

"ఏంటేవిటే! మళ్ళీ అనూ" అన్నారతను.

మళ్ళీ అందావిడ.

అతనేమనే వారో తెలియదు తుమ్మడం ప్రారంభించడం వల్ల. తర్వాత ఆయనే మిరియాలు రోట్లోవేసి కొట్టడం ప్రారంభించేరు. "ఈ మిరియాలు వస్త్రికాళితం చెయ్యాలేంటో కనుక్కురా" అని ఆచారిగారి దగ్గరకు మనిషిని పంపేరు. చెయ్యమన్నారు ఆచారిగారు. తర్వాత మళ్ళీ "కప్పుడు పాలల్లో మిరియాల పొడి వెయ్యాలా! కప్పు పొడిలో పాలు వెయ్యాలా!" కనుక్కోమని మనిషిని పంపేరు. ఇక్కడే ఏదో పొరపాటు జరిగింది. కప్పుడు పొడిలో పాలు వేసుకోమన్నారట ఆచారిగారు. వైద్యం పూర్తయేసరికి రాత్రి ఎనిమిదైంది. ఎనిమిదిన్నర వరకూ బాగానే వున్నారు. తర్వాత ఎంతమంది చెప్పినా వినకుండా పెరట్లో నూతి దగ్గరకు వెళ్ళి స్వయంగా నీళ్లు తోడుకొని అరగంటసేపు చన్నీళ్ళ

స్నానం చేశారు. తడి బట్టల్తోనే ఇంట్లోకి వస్తూ "ఈ రాత్రి నాకంట ఎవరు పడినా ఖూనీ చేసేస్తానని" వార్నింగిచ్చి తన గదిలోకి వెళ్ళి తలుపు గడియపెట్టేసుకున్నారు. రాత్రి పన్నెండు వరకూ భక్తి పాటలూ, తర్వాత బండ బూతులూ వినిపించేయి. ఆ మందు బాధ వదిలేసరికి వారం పట్టింది.

ఇంకోసారి.... మా మావగారికి మంచుల పాత్రుడు మరో చిట్కా చెప్పేడు. ఒక చదరపుటడుగు తెలక పిండి తెచ్చి ఆవిరి మీద ఆకారం పోకుండా ఉడకపెట్టి, తులం వీలకు గుండ జల్లి దానికి అయిదు లవంగాలు (నాలుగు మూలలా నాలుగూ; మధ్య నొకటి) గుచ్చి, రెండు గంటలు చల్లార్చి గుండెలకు కట్టుకొని పడుకుంటే ఏనుగు జలుబైనా సరే ఎగిరి పోతుందిట. నాకు యీ వైద్యంలో నమ్మకం ఏర్పడింది. ఎంచేతనంటే రొంపరాగానే ప్రయత్నిస్తే, పోయా స్థైముకి దొరకవచ్చు చదరపుటడుగు తెలక పిండి ముక్క. ఎలాగైతేనేం తెలక పిండిని పాత్రుడో క్తంగా తయారు చేసే సరికి మధ్యాన్నం ఒంటి గంటైంది. వరండాలో మంచంమీద పడుకున్న మావగారు మందుని పక్కనే టేబిలుమీదపెట్టి "మీరు పాపం పన్లు చూసుకోండి. నేను కట్టు కుంటాను" అన్నారు. బతుకు జీవుడా అనుకొని మేవంతా వేళ్ళిపోయేం. ఆయన యిలా కన్నుమూసీ సరికి మా పక్కింటి గొల్లపూడి వారి గేదె, దానికి తెలకపిండి ఇష్టమో, లవంగాలు ఇష్టమో వీలకపొడి ఇష్టమో, లేక బొత్తే దానికీ జలుబు చేస్తే దాని డాక్టరు యీ వైద్యం చెప్పేడో (గేదెల్లో కూడా ఆచార్లం

మొదట వచ్చింది కృష్ణమూర్తి. రాగానే "అసలు రొంప ఎందుకు వస్తుంది?" అన్నారు ఈయన ఓరల్ని ఎగ్జామినర్ లాగా.

"అసలు రొంపైనా, వడ్డీ రొంపైనా వైరస్ యిన్ ఫెక్షన్" అన్నాడు క్రిష్ణమూర్తి.

"నాకు రొంప పట్టింది. ఏమందూ పనిచెయ్యడంలేదు" అన్నారు ఈయన.

"దానికి మేవంతా చేసుకునే వైద్యం ఒక క్వార్టర్ బాటిల్ బ్రాందీ - తీసుకొండి. కాని మీరు వెళ్ళి కొంచెం ఏం బావుంటుంది! నేనే తెచ్చిపెడతాలెండి" అని వెళ్ళిపోయేడు.

ఆ సాయంత్రం ఇద్దరూ చెరో క్వార్టరు బాటిలూ తెచ్చి యిచ్చేరు. రొంప విషయంలో మాత్రం ఎవరేం చెప్పినా పాటించే నియమం వుంది కాబట్టి ఇద్దరు తెచ్చినవీ తాగెయ్యాలన్నారు ఆయన. ఆయన జీనియస్‌లో నా కెలాంటి డౌటూలేదు కాని, రొంప పట్టినప్పుడు మాత్రం ఆయనకి పదో ఎక్కంకూడా రాదు. అంచేత ఒక్క సీసా తాగితే చాలని నమ్మించడానికి ప్రయత్నించిన నేనూ, పిల్లలూ కూడా చేసిన ప్రయత్నాలేం పనిచెయ్యలేదు. పోనీ మనిషికి 'మందు' వ్యామోహమా, అంటే గాంధీలాంటి మనిషి.

రాత్రి పడ్డైంది. రెండు బాటిల్నూ పూర్తి అయేయి. ఆ రాత్రంతా నిద్రాలేదు. రొంపాలేదు. ఒంటిమీద తెలివీ లేదు.

మర్నాడయం తెలివి పూర్తిగా రాలేదుగాని రొంప విత్ తలనొప్పి పూర్తిగా వచ్చేసింది. ఆ మధ్యాన్నం పాపం కాస్త కునుకుపట్టింది అమ్మాయ్య అనుకున్నాను. కాని అనుకున్నంతసేపు కూడాలేదు. నిద్రలో ఏదో గొణగడం ప్రారంభించేరు తర్వాత ఆ గొణుగు కేకలుగామారి దిగ్గున లేచి కూర్చున్నారు.

"జడుసుకున్నావేఁవిఁటి నాన్నా! ఇలా కేకలేసున్నావ్!" మా చిన్ని ధైర్యంగా అడిగాడు. ఆయన్తో - విత్ ఆర్ విత్తౌట్ రొంప. ఏమాత్రైనా అనగల, ఏ జోక్కైనా వెయ్యగల ధైర్యం మా ఇంట్లోవా డొక్కడికే వుంది.

"అలా చెప్పు నా కేకలే నన్నమాట అంత గట్టిగా వినిపించేయి. నా కేకలకి నేనే లేచిపోయేనా! మంచి జోకే" అని మళ్ళీ పడుకున్నారు. ఇంకా నయం. నేను కేకలెయ్యకుండా కాపలాకాయి అని నన్ను పురమాయించలేదు.

ఆ తర్వాత కృష్ణమూర్తే బ్రాందీ వైద్యం మానేసి ఇంకేదో వైద్యం చేసేడు. ఎలాగైతేనేం రొంప పూర్తిగా పోయేసరికి వారం పట్టింది. అంచేతే కాబోలు రొంప. మందు పుచ్చుకుంటే వారంలోనూ, పుచ్చుకోకపోతే ఏడు రోజుల్లోనూ పోతుందంటారు.

మరోసారి ఆయనకి రొంప వచ్చినప్పుడు క్రిష్ణమూర్తే కాబోలు - కాబోలేఁవిఁటి, అతనికే ఆయన దగ్గర ఆ

చనువుంది - "ఈ మందులు సంగతలా వుంచండి. ఫీడ్ది కోల్డ్ అండ్ స్టార్వ్ ది ఫీవర్" అంటారు అన్నాడు.

"మరిన్నాళ్ళా చెప్పేవే కాదేవిటి! నాకొకంచెం జ్వరం వుందనుకో. దానికి ఉపవాసం పెడతాను రాత్రి" అని సుష్టు పూర్తిగా రొంపకి భోజనం పెట్టేరు. పెరుగూ అన్నం తిన్న పడిశం పెరిగింది. ఉపవాసం వుండబోయే జ్వరంకూడా పెరిగింది.

"స్టార్వేషన్ ఈజ్ ది బెస్ట్ డయట్ అని చేపల విషయంలోనే అన్నా రనుకున్నాను. జ్వరానికూడా వర్తిస్తుందన్నమాట" ఆశ్చర్యపోయేరు ఆయన.

ఇంతకీ అసలు విషయం. బాత్ రూమ్‌లో ఆయన తుమ్మేరు. తుమ్మేక వార్ క్లౌడ్‌లా డైనింగ్ హాల్లోకి వచ్చి "ఆయనేరీ? ఎప్పుడొచ్చేరు మీరు? ఒకసారి నా రూమ్‌లోకి రా" అని గీతతోనూ, నాతోనూ ఒక్క గుక్కలోనే మాట్లాడి జవాబు అక్కర్లేనట్టు తన గదిలోకి పరిగెత్తారు. నేను విళ్ళేసరికి పక్కమీద బోర్లా పడుకున్నారు. చెప్పొద్దూ. ఎంత మొగుడైనప్పటికీ నాకు నిజంగానే జాలేసింది. ఎంతటి మనిషి ఎలా అయిపోయేరు. కడవంత గుమ్మడికాయి కత్తిపీటకు లోకువ - అన్నట్టు.

నేనేం అతి తెలివైనదాన్ని కాను. కాని ఆయనతో ఎప్పుడు మాట్లాడకూడదో మాత్రం బాగా తెలుసు. అంచేత వెళ్ళి మంచం పక్కన మాట్లాడకుండా నిల్చున్నాను.

"వచ్చేవా!?" అన్నారు వీలైనంత శాంతంగా.

"ఆఁ" అన్నాను.

"చూడూ. నాకు రొంప వచ్చేసింది. గీత బహుశా నాలుగు రోజులుంటారు. ఈ రొంప వారం వుంటుంది. మరంచేత ఈ నాలుగురోజులూ నువ్వు నాకు కనిపిస్తే బహుశా చంపీక మానను, చంపడానికి మొహమాట పడితే కురుక్షేత్రం తప్పదు. మరంచేత కాఫీ వగైరాలన్నీ నా గదిలోకే పంపించీ. వింటున్నావా?" అన్నారు.

"ఊఁ"

"ఇప్పుడు దయచేసి గెటవుట్" అని గట్టిగా అరిచారు. ఆ అరపుకి గోడనున్న ఫొటో ఒకటి కిందపడి భళ్ళుమంది. నేను గబగబా బైటికి పోయి తలుపులు ధామ్మని వేశేసేను.

ఈ గెటవుటూ, భళ్ళుమన్న శబ్దం విన్న గీత భయపడిపోయి "ఏవైఁంది?" అందిఁ ఏవౌతుంది?

ఇంక ఆపేస్తాను. ఎంచేతంటే మావారు ఇప్పుడే తుమ్మేరు.

—: o :—

పెన్సిలిన్ ఐపోయింది

అలా తనెంత సేపు ఆ వరండాలో కూర్చ్చనుందో ఆ ముసలమ్మకి తెలీదు. కాని సుమారు ఓ గంట గడిచేక హాస్పిటల్ తలుపులు తెరుచుకున్నాయి. తను మొక్కిన దేవుడు స్వయంగా వచ్చి తనకోసమే గుడితలుపులు తెరచి నట్టనిపించిం దామెకి ఆలస్యం చేస్తే ఈన దేవుడు మాయమై పోతాడేమోనన్న ఆత్రతతో భుజంమీదున్న పిల్ల బరువుకి తూలుతూ ఆమె లోపలికి వెళ్ళింది.

అప్పటికే కుర్చీలో కూర్చొని తలొంచుకొని ఏదో రాసుకుంటున్న డాక్టరు రాజేశ్వరరావు తలెత్తకుండానే అడిగేడు.

"పేరు ?"

ముసల్ది మాట్లాడలేదు. పసిదానికి పేరులేదు.

జవాబు రాకపోవడంతో తలెత్తి చూసేడు డాక్టరు. ఎదురుగా నిల్చున్న ముసలమ్మ పుట్టగానే చచ్చిపోయి ఎదిగి, ముసలై పోయిన శవంలా వుంది. చచ్చిపోయిన పాదు చివర్న వేలాడుతున్న యెండు కాయలా ఆమె భుజాన వేలాడుతోంది ఓ పిల్ల. ఆ పిల్లకి నాలుగేళ్ళ వయసూ, నాల్రోజులజ్వరమూ

ఉన్నాయి. ముందు ముందు తను పడవలసిన బాధలన్నీ ఎదురుగా కన్పిస్తున్నట్టు, వాటిని చూడలేక భయపడిపోయినట్లు. ఆ పిల్ల కళ్ళు బెదురుతున్నాయి. జబ్బు ముసలిదానికా, పిల్లకా అన్నట్టు ఆశ్చర్యపోయే డతను. ఇద్దరూ "కాపు జబ్బు" చేసినట్టు దుర్వాసన కొడుతున్నారు.

"ఏవిటి సుస్తీ?"

"నాల్రోజులై ఒళ్ళు కాలిపోతున్నాది. పడవలా పడిపోనాది పిల్ల."

స్టెత్ తీసుకొని లేచాడతను. "ఏమాతుంది ఈ పిల్ల!" అని పరామర్శిస్తూ:

పరీక్ష పాసై పదినెల్లూ, ఈ తాలూకా హాస్పిటల్లో చేరి ఆరు నెలలే అయినప్పటికీ తన మీదున్న ముగ్గురు పెద్ద డాక్టర్లకంటే తానే పాప్యులర్ అయిపోవాలని అతని ఆశ.

"కూతురు ... మిగిల్చి పోనాది."

ఆ పిల్ల చనిపోయిన ఆమె కూతురు మిగిల్చిపోయిన మచ్చ. ఆమె కలల మంట.

పరీక్ష చేస్తున్న అతనికి ఆ పిల్ల ఊపిరి వడగాలిలా తగిలింది జ్వరం చాలావుంది. దగ్గటానికి ఓపిక లేని ఆ పిల్ల చిన్నగా బెక్కుతోంది. చూడగానే అర్థమైపోయిం దతనికి - అది న్యుమోనియా అని.

వెంటనే ప్రిస్క్రిప్షన్ రాయబోయి ఏదో డైలమాలో పడినవాడిలా ఆగిపోయేడు.

చాలామంది డాక్టర్లు చాలాసార్లు డైలమాలో పడతారు. ఫలానా వాడికి ఎంకైరిక్ ఫీవరా? వైరల్ ఫీవరా? ఆరోనెంబరు బెడ్డుకి గేస్ట్రిక్ అల్సరా? స్టమక్ కేన్సరా? అని జబ్బుల విషయంలో పడవచ్చును. మూడో నెంబరు ముసలతని కడుపునొప్పి మందుల్తో తగ్గుతుందా? సర్జరీ చేసీయాలా? పదోనంబరు పంచకళ్యాణి పైన్‌ఫుల్ పీరియడ్సుకి "ఈస్ట్రోజన్స్" ఇవ్వాలా? యుటిరస్ పీకెయ్యాలా? అని వైద్యం విషయంలో పడవచ్చును. మందులు కొనుక్కోలేని ముష్టి పేషెంట్లకి శాంపులిచ్చి పుణ్యం కట్టుకోవడవా? వాటిని పాపులకి తోలేసి వాళ్ళని కర్మకి వదిలేసి పాపం పోసుకోవడవా? అని పాపపుణ్యాల విషయంలో పడవచ్చును. అదే యే కుర్రడాక్టరో అయితే తనతో తిరిగిన పిల్లకి పూలదండ వేయాలా? అమ్మా నాన్నా కుదిర్చిన అమ్మాయికి పసుపు తాడు కట్టాలా? అని ప్రేమ డైలమాలో పడవచ్చును. తన కూతుర్ని మెడిసిన్ చదివించాలా, మేనకోడలిని చేసేయాలా? మరో పెద్ద డాక్టరు పిల్ల డైలమాలో పడవచ్చును. డాక్టర్లు కూడా మనుషులే కాబట్టి, ఆదర్శంగా బ్రతకాలా, ఐశ్వర్యంతో బ్రతకాలా? మంచిగానా, చెడ్డగానా? అని బ్రతుకు డైలమాలో పడవచ్చును.

ఐదేళ్ళ క్రిందట - డాక్టర్ జగన్నాధం సరిగ్గా ఇదే డైలమాలో పడ్డాడు. అప్పుడతను వరండాలోని తన పాత పడకుర్చీలో పడుకొని పక్కనే వున్న వ్యక్తిని పట్టించుకోకుండా పైకప్పువంక చూస్తున్నాడు. ఆ ప్రక్క వ్యక్తి ముక్కుమూస్తే ముప్పైఏళ్లుంటా యనిపిస్తుంది. జుత్తు

చూస్తే యసభై పైనే ననిపిస్తుంది. కళ్లు చూస్తే ఇరవైలోపు, మీసం చూస్తే పదహారు పైనేనని అనిపిస్తుంది. కాని ఆమె వయసు నలభై. ఆమె జగన్నాధం భార్య యశోద. ఈ యశోదకి కన్న కొడుకులుగాని, పెంపుడుకొడుకులుగాని లేరు. కాని యిద్దరు కూతుళ్లూ, వారికి యింకా పెళ్ళికాలేదే అన్న బెంగ. యిటుపై అవుతుందో అవదోనన్న భయమూ ఉన్నా యావిడకి. అంతకు ఐదునిముషాల క్రితమే తన బెంగా, భయమూ అతనితో మొరపెట్టుకొంది.

ఆనాటివరకూ అతని కెలాంటి బెంగా, భయమూ లేవు. హాస్పటలే అతని ప్రపంచం. డ్యూటీయే అతని వ్యసనం. ఫస్టు తారీఖున జీతం తీసుకొచ్చి భార్య చేతులో పోయడం మినహా అతనికి సంసారంతో ఏమాత్రం సంబం ధమూ లేదు. వేళకి అన్నం పెడితే తినడమేగాని, పెట్టక పోతే ఎందుకు పెట్టలేదని కూడా అడిగెరగడు. అతనికెప్పుడూ ఏ విషయమూ పట్టేదికాదు. "ఏవిట్రా యిదసి" ఎవరన్నా దగ్గరవాళ్ళడిగితే ఏ దెలా జరగాలో అలా జరుగుతుంది, మనం పట్టుకుంటే ఆగుతుందా! వదిలేస్తే మానేస్తుందా? మనపని మనం చేసుకుంటే సరి" అంటూ ఒక వెర్రి వేదాం తపు నవ్వు నవ్వేవాడు.

ఆ నవ్వు అతనికి చిన్ననాటి నుంచీ ఉంది, అర మార్కు అర్థించకుండా, అతి చిన్న రికమండేషన్నైనా లేకుండా ఒకటో తరగతినుండి యం. యస్. జనరల్ సర్జరీ వరకూ మంచి మార్కులోనే పాసయ్యేవాడతను.

తను అందగాడే అయినప్పటికి అప్సరస భార్య కావా లని కోరుకోలేదు. అక్షరజ్ఞానంలేని తన తల్లిదండ్రులు ఐదో క్లాసు పాసైన యశోదని కుదిర్చినప్పుడు సంతోషంగా పెళ్ళి చేసుకున్నాడు.

అతనికి సంపాదనమీద కూడా అట్టే ధ్యాసలేదు. అంచేతే, సర్వీసులో చేరి పదిహేనేళ్ళయినా సివిల్ సర్జన్ ఐదేళ్ళయినా పాతకారు కాదుకదా, చివరికి పది రూపాయల బేంకెకౌంటు కూడా లేదు.

అలాగని అతని కే కోరికా లేదనుకోవడం పొరపాటు. అతనికున్న ఒక్క కోరికా తను మనిషిగా, డాక్టరుగా పది మందిచేత మంచివా డనిపించుకోవాలని. అతని కోరికకి అతని భార్య ఏనాడూ అడ్డురాలేదు. అతను రోజులో ఇరవైగంటలు హాస్పిటల్లో గడిపినా కనీసం మిగిలిన నాలుగ్గంటలైనా తనతో గడపమని ఆవిడేనాడూ అడిగెరుగదు. పెళ్ళినాడు పుట్టింటి వారు పెట్టిన పట్టుచీర తప్ప మళ్ళీ పట్టుచీరనీ, పందిరిమంచా లవీ కోరలేదు. అర్థజీతం అత్తారికి పంపించేసినా అదేమని అడ్డుచెప్పలేదు. ఆవిడకున్న ఒక్క కోరికా మెడిసిన్ చదువు తున్న తన కూతుళ్ళిద్దరికీ కాస్త మంచి సంబంధాలు చూసి పెందలాడే పెళ్ళిళ్ళు చేసేయాలని. ఆ కోరిక నెరవేరాలంటే జగన్నాథాన్ని బాధపెట్టక తప్పదు.

తన పిల్లల పెళ్ళి బాధ్యత పూర్తిగా తనదేనని అతని కామె చెప్పేవరకూ తట్టలేదు. తట్టినతరువాత కూడా అతను పెద్దగా బాధపడలేదు. కళ్యాణ ఘడియ రావాలేగాని

పెళ్ళేంతసేపు అనుకున్నాడు. కాని, తానొకటితలిస్తే కాబోయే అల్లుడు మరొకటి తలుస్తాడు.

"అసలాళ్ళకు రెండు లక్షలిస్తామని వచ్చారు. మీ అమ్మాయికూడా డాక్టరే కాబట్టి మా వాళ్ళని లక్షకి వప్పిస్తాను. మా యిద్దరి చదువు అయిపోయింది. కాబట్టి మమ్మల్ని ముందు కొలాలంపూరు, తరువాత అమెరికా పంపించేయండి. అక్కడే సెటిలైపోతాం. అఫ్‌కోర్స్, మీరూ అక్కడికే వచ్చేయొచ్చు-రిటైరయ్యాక" అన్నాడు పెద్దమ్మాయిని ప్రేమించిన ఓ రిచ్ డాక్టర్.

"మేమూ లక్షకే వచ్చే వాళ్ళం. కాని మీ అమ్మాయింకా ఫోర్తియిరేకదా! చదువు పూర్తయ్యే దెప్పుడు? ఆర్జేంచే దెప్పుడూ? మరంచేత ఒకటిన్నరయితే మాకే అభ్యంతరవూ ఉండదన్నాడు. ఓ. పి. హెచ్.డీని కన్న తండ్రి. ఆ కుర్రాడికి ఆరెకరాపొలవూ, ఆరుమైళ్ళ జుట్టూ తప్ప యింకేమి లేవు.

అప్పటివరకూ బుద్ధావతారంలాంటి జగన్నాధం యివన్నీ విన్నమీదట నరసింహావతారం ఎత్తేసి పెళ్ళికారి పేగులు పీకేసి తన పిల్లల మెళ్ళో వేసేస్తానన్నాడు. అతని వాలకం చూసిన యశోద ముందు భయపడింది. ఆ తరువాత బతిమాలింది. పేగులు పీకినంత మాత్రాన పెళ్ళిళ్ళు కావంది. దానికావలసింది ఓర్పు, డబ్బుగాని కోపవూ, పేగులూ కాదంది. కాబట్టి డబ్బు సంపాదించే మార్గం చూడమంది. అనాటినుండి అతను ఆలోచనల్లో పడ్డాడు

మళ్ళీ ఈ రోజు యశోద పిల్లల పెళ్ళి విషయం ఎత్తడంతో అతను డైలమాలో పడ్డాడు. మంచిగా బ్రతికి మన్నై పోవాలా? చెడ్డగానైనా సరే డబ్బార్జించాలా అన్న అతని డైలమాని యశోద కళ్ళల్లో తిరిగిన కన్నీరు "ఎలా గైనా సరే డబ్బే ఆర్జించాలి" అన్న నిర్ణయంగా మార్చింది.

అంతే-

ఆ రోజునుండి హాస్పటల్ క్లబ్బయింది, డబ్బే అతని ప్రపంచమయింది.

ఎవరై నా సరే డబ్బార్జించాలన్న నిర్ణయం తీసుకో వాలేగాని మరిక వాళ్ళకి మంచి-చెడ్డా, గొప్ప-బీదా, నీతి-నిజాయితీ, పాపం-పుణ్యం, ఉచ్ఛం-నీచం, అనే విచక్షణుం డదు. జగన్నాధానికూడా యిప్పుడే విచక్షణా లేదు.

అతను పేషంట్లకి బెడ్ లమ్మేడు, బల్లెకిరించి బేరా లాడేడు. తోటీలకీ, ఆయాలకి పోస్టింగులమ్మేడు. దొంగ సర్టి ఫికెట్లమ్మేడు. మర్డరు కేసుల్లో సాక్ష్యాలమ్మేడు. ఒక టేవిటి? పెళ్ళాం, పిల్లలూ మినహా అమ్మతగ్గవన్నీ అమ్మేడు. డబ్బు సంపాదించటానికి వందమార్గాలుంటే అతనే ఒక్క మార్గాన్ని వదల్లేదు.

దానితో—

అయిదేళ్ళు తిరిగేలోపల అద్దెకొంపని ఐదంతస్తుల మేడ చేసేసేడు. దాని పోర్టికోలో యింపోర్టెడ్ కారుని దించేసేడు. బేంకులో అయిదు లక్షలు కూడబెట్టేశాడు.

ఇప్పుడతని పెద్ద కూతురు అమెరికాలో ఉంది.

చిన్నకూతురు స్విడ్జర్లాండులో ఉంది.
యశోద ఎప్పటిలాగే వున్నా ఆమె కొకప్పుడున్న ఒక్కదిగులూ యిప్పుడు లేదు.

జగన్నాధమిప్పుడు డైలమాలోపడే స్థితినుండి D.M.O. గా ఎందరో్న డైలమాలో పెట్టే స్థితికి చేరుకున్నాడు.

• • •

ప్రిస్క్రిప్షన్ రాస్తూ ఆగిపోయిన డాక్టర్ రాజేశ్వర రావుకి ఆలోచన్లు ఆగలేదు. ఆ జబ్బుకావలసిన మందు ఆ హాస్పిటల్లోలేదు. బయటుందిగాని ఈ ముసలమ్మకి కొనుక్కొనే శక్తి లేదు. ఉన్నమందే ఇస్తే ఆ జబ్బు తగ్గుతుందో, తగ్గదో! తగ్గకపోతే ఆ పిల్ల బ్రతుకుతుందో లేదో! ఆ పసిది కూడా చనిపోతే ఆ ముసల్ది చచ్చి శపిస్తుందో! ఏవో! కానీ చేసేదేవుంది ఉన్నమందు రాసిచ్చేయడంతప్ప!

ఆలోచన్లు ఆపిన రాజేశ్వరరావు కాగితం మీద 'సల్ఫా' బిళ్ళలో మరే 'ఉల్ఫా' బిళ్లలో రాసిస్తూ భగవంతుడికి తీమాపణ చెప్పుకుంటున్నట్టుగా సన్నగా గొణుక్కున్నాడు.

"పెన్సిలిన్ ఐపోయింది."

మందురాసి ముసలమ్మని పంపించేసినా అతని మనసు చికాగ్గానే వుంది. అసలీ హాస్పిటల్లో అవసరానికే మందూ ఉండదేం? ఎప్పుడన్నా ఏదో ఒకటి ఐపోవడం న్యాయమే! కాని ఎప్పుడూ ఏదో ఒహ మందైపోవడమే! ఎక్కడుందీ

మిస్టరీ అనిపించింది ఎంత ఆలోచించినా అర్థం కాలేదతనికి. అంచేత ఆ సాయంకాలం అందరూ హాస్పిటల్ గార్డెన్‌లో కూర్చునుండగా అదే మాటడిగేడు కో-డాక్టరు మూర్తిని. అడిగిన తరువాత బాధపడ్డాడు-ఎందుకడిగేనా అని. అక్కడ కూర్చున్న వాళ్ళలో మెడికల్ ఆఫీసర్ మాధవరావు కూడా ఉన్నాడు.

"ఇందులో రావుగారి మహిమేమివీంలేదు. అంతా జగన్నాధ మహిమే" అంటూ నవ్వేడు టి బి స్పెషలిస్ట్ డాక్టర్ రెడ్డి.

"అంటే" అమాయకంగా మొహం పెట్టేడతను.

రావుగారిని రక్షించడానికా అన్నట్టుగా రెడ్డిగారే మళ్ళీ అందుకున్నారు.

"చెప్తానుండండి! అన్ని హాస్పిటల్స్‌కి మందు లెక్కడ నుంచొస్తాయి? గవర్నమెంటునుంచే! గవర్నమెంట్ లీ చిల్లర దుకాణం పెట్టుకూర్చోలేదు. వీరోజు మందులారోజు మన కమ్మడానికి. అంచేత ప్రతి హాస్పిటల్‌కి వాళ్ళ డిమాండ్‌ని బట్టి. వీళ్ళ వీలునిబట్టి పెన్సిలిన్ కొంటారో పిప్పరమెంట్లే కొంటారో? కొనుక్కోండని ఎంతో కొంత డబ్బు మొహాన పడేస్తుంది. అంతే. అక్కడితో వాళ్ళ బాధ్యత తీరిపోతుంది. గవర్నమెంటు డబ్బులిచ్చి కంపెనీలు మందు లిస్తే. మరికొరతేమిటని మీడౌటు! అదే జగన్నాధం మహిమ, ఎలా గంటారా? మాటవరసకి పెన్సిలిన్ తీసుకుందాం, వన్ డోస్ వయల్ ఖరీదెంత? మీకు తెలీదా? నాకూ

సరిగా తెలీదు. ఈ రోజు ధరెంతో సుళువుగోసం రూపా యనుకుందాం. ఫైవ్‌డోస్ వయలెంత? ఐదు రూపాయలా? కాదు! మూడూపాయలే! మన జిల్లాకి నెలకి పన్నెండు వేలు శాంక్షనైందనుకుందాం. ఆ డబ్బుతో వన్‌డోస్ వయల్సున్న కొంచే పన్నెండు వేల డోసులు ఫైవ్‌డోస్ వయల్సేకొంచె ఇరవై వేల డోస్‌లు వస్తాయి. మొదటిది కొంచె కంపెనీ వాడికి లాబం. రెండోది కొంచే పేషెంట్స్‌కి లాభం. ఎంచేత నంచే కంపెనీవాడు కొచ్చేసే కమీషను సీసాలెక్క నుంటుంది గాని. డోసుల్లెక్కనుండదు. కంపెనీవాళ్ళకి కావలసింది తమ లాభంకాని, పేషేంట్ల లాభంకాదు. మనపై ఆఫీసర్లకూడా పేషెంట్ల శ్రేయస్సు కంటే కంపెనీల శ్రేయస్సే ముఖ్యమై నప్పుడు మనకు మందులై పోతూనే వుంటాయి. మరింక నాచేత వివరాలు చెప్పించకండి" అన్నాడు అక్కణ్ణుంచి లేచి పోతూ.

కుర్ర డాక్టరికింకా అసలు విషయం అందలేదన్న సంగతి గ్రహించిన మాధవరావు వివరాలు కూడా చెప్పే శాడు.

"మన గురువులు కంపెనీవాళ్ళ దగ్గర కక్కుర్తి పడతారన్నమాట."

—: o :—

మంచి వాళ్ళ లేక

పమ్మివేర్ ఇన్ 'బాంగ్లాదేశ్'

మరాడేళ్ళ మున్నాకి దేశంలో ఏమవుతోందో తెలియదు కాని ఏదో అవుతోందని మాత్రం తెలుసు అసలు మున్నాకి యీ నెల రోజులనుండి ఊపిరి సలపడంలేదు. పల్లె అంతా ఏదో సంబరం చేసుకుంటున్నట్లు ఎంతో హడావిడిగా సరదాగావుంది. ఒకరోజు ఉన్నట్టుండి పాత జెండాలు తీసేసి ఇళ్ళమీద కొత్తజెండాలు పెట్టేరు. కొత్తజెండాలు పచ్చగా ముచ్చటగా ఎంతో నచ్చేయి మున్నాకి. తన యింటిమీదున్న జెండా తన స్వంతం అన్నట్టు ఫీలయ్యేరు. ఎంచేతంటే ఆవేళ ఇంటింటికి జెండాలు పంచిపెడుతున్న కుర్రాళ్ళు-వాళ్ళ ఇంటికి కూడా వచ్చినప్పుడు మున్నా నాన్నకి సలాం పెట్టేరు గాని జెండా ఇవ్వలేదు. మున్నాకి జెండా యిచ్చి, ఇంటి ముందు ఖాళీ స్తలంలో కొయ్య పాతి మున్నాచేత జెండా ఎగరవేయించారు. జెండా ఎగరవేశేక అందరూ మున్నాని ముద్దు పెట్టుకున్నారు. మామూలువాళ్ళు ముద్దుపెట్టు కున్నప్పుడు ఏమీ అవలేదు కాని, గెడ్డాలవాళ్లు ముద్దు పెట్టు కున్నప్పుడు మున్నాకి కితకితలు అనిపించి మొగ్గలా ముడుచుకు పోయేడు.

ఆ తర్వాత రోజూ పల్లెకు కాస్త దూరంగా వున్నవాళ్ళ ఇంటిముందే ఆడా మొగా అంతా పోగై డ్రిల్లు చేసేవారు. అంతవరకు డ్రిల్లు చూడని మున్నాకి ఆ డ్రిల్లు ఎంతో నచ్చింది. వాళ్ళలో కొంతమందికి కాకీబట్టలు వుండేవి ముగ్గురికే తుపాకులుండేవి. మిగిలినవాళ్ళకి పంచెలు, పైజమాలు, ఈలెలూ, కర్రలూ వుండేవి. అందరికంటే కాకిబట్టల వాళ్లంటేనే మున్నాకి చాలా గౌరవం. తుపాకులున్న వాళ్ళంటే భక్తి. తను కూడా పెద్దెయ్యేక కాకిబట్టలు వేసుకొని జీపు ఎక్కి ఎప్పుడు వెళతాడో? మొదట్లో జీపులు వాళ్ళ ఇంటికి వచ్చేవికావు. అప్పుడు ఎవరో ఎక్కడినుంచో సైకిళ్ళమీద వచ్చి, ఏవో కాయితాలు యిచ్చి,టీ త్రాగి, ఏదో మాటాడి, కాళ్లూ చేతులూ ఊపుకుంటూ వెళ్ళిపోయేవారు. ఎందుకో గాని కొందరు విపరీతంగా ఉమ్మేవారు. వాళ్లు ఉమ్ముతున్నప్పుడు వాళ్ళకళ్లు - అమ్మను అల్లప్పుడెప్పుడో కొట్టిన నాన్న కళ్ళలా - ఎర్రగా అయిపోయేవి. వాళ్ళకళ్లుచూస్తే మున్నాకి భయం వేసేది. కాని వాళ్లు మున్నాని ఎంతో ముద్దుచేసి చాక్‌లెట్లు, చక్కెర బిళ్ళలూ ఇచ్చేవారు.

డ్రిల్లు అవగానే తుపాకీ పేల్చేవారు. ఆ తుపాకీ గుండుకి ఒకసారి ఒక గెద్ద చనిపోతే అంతా విరగబడినవ్వేరు. వాళ్లు యెందుకు అంత నవ్వేరో మున్నాకి అర్థంకాలేదు. అంతగా నచ్చలేదు కూడాను. తుపాకీ పేల్చాక జెండాక్రింద నిలబడి ఎవడో ఒకడు ఏదో మాట్లాడేవాడు. అందులో ఒక్క అక్షరంకూడా తనకి అర్థం కాకపోయినా శ్రద్ధగా వినేవాడు మున్నా.

అన్నిటికంటె మున్నాకి బాగా నచ్చిన సంగతి – ఒక నాడు తెల్లవారుజామున ఊళ్లోవున్న మనుషులంతా వచ్చి వాళ్ళ పెరట్లో పేద్ద గొయ్యితీసి, ఊళ్ళోవున్న ధాన్యం అంతా అందులోపోసి కప్పెయ్యడం. ఇంకొకరోజు అంతకంటె యింకా నచ్చినది జరిగింది – ఆవేళ వాళ్ళ పెరట్లో వేపచెట్టు క్రింద యింకొక చిన్న గొయ్యితీసి ఊళ్లోని ఆడవాళ్ళందరూ తమ నగలూ అవీ అందులో పడెయ్యడం. అప్పుడా ఆడవాళ్ళందరూ కోపమొచ్చిన అమ్మలా ఎర్రగా అయిపోయేరు. మున్నాకి సిచ్చి భయంవేసింది. వెంటనే తన చిటికినవేలికున్న చిన్న వుంగరం కూడాతీసి అందులో పడేశాడు. అప్పుడు అక్కడవున్న ఆడవాళ్ళందరూ పక పక విరగబడి నవ్వి మున్నాని గుండెలకు వేసుకొని నొక్కేశారు. ఆ తర్వాత గొయ్యి కప్పేసి దానిమీద చెత్త, చెదారం కప్పి వెళ్ళిపోయేరు. వాళ్ళు వెళ్ళిపోయేక మున్నాకూడా వాళ్ళలాగే ఒక క్షణం ఆకాశంలోకి చూసి గోతిమీద నాలుగు ఎండు టాకులు పడేసేడు.

ఒకనాడు ఇంటిముందు పెద్దవాళ్ళ డ్రిల్లు చేస్తుంటే మున్నా తనకి కూడా తుపాకీ కావాలని ఏడిచేడు. ఇవ్వక పోయినా ముందు ముద్దుముద్దుగా ఊరుకున్న తర్వాత వాళ్లు మున్నాని కోప్పడ్డారు. అంచేతే మున్నాకి యీ పెద్దవాళ్లు చేసేవి ఏవీ అర్థంకావు.

"ఛీ! ఛీ! అందుకే యీ పెద్దవాళ్ళంటే నాకు అసహ్యం" అనుకున్నాడు మున్నా.

అనుకొని వెంటనే తనే ఒక కర్రకి తాడుకట్టి, డ్రిల్లులో

వాళ్ళ తుపాకి పట్టుకున్నట్టే పట్టుకొని ఇల్లంతా టకటకా నడిచేసు. ఆ కర్ర అతనికి అచ్చు తుపాకీలాగే కన్పించేది. బహుశా వాళ్ళమ్మకి కూడా అలాగే కన్పించేది ఏమో! ఈమధ్య అమ్మకి తనని ఎత్తుకోవడానికి బొత్తిగా తీరిక ఉండడంలేదు. ఈ హడావిడి రాకపూర్వం అమ్మ ఎప్పుడూ ఎత్తుకునే తిరిగేది. వంట, నౌకర్లే వండేవారు. కాని ఇప్పుడు ఎందుకోగాని నౌకర్లంతా ఒకడూ, ఒకడూ ఎక్కడికో వెళ్ళి పోయేరు. వంటంతా పాపం అమ్మే చేస్తోంది. మొదట్లో అమ్మ ఇంట్లోవాళ్ళకే వండేది. పై ఊళ్ళనుండి వచ్చిన వాళ్ళకు టీ మాత్రం ఇచ్చేది. కాని ఈ మధ్య ఆ వచ్చిన వాళ్లు భోజనంకూడా తమయింట్లోనే చేస్తున్నారు.

రోజులు అన్నీ సరదాగా, హడావిడిగా, హాయిగా గడిచిపోతున్నాయి, నాన్న ఏమీ అనకపోయినా అమ్మ ఏడుపు ప్రారంభించింది. కాని విచిత్రం! ఇదివరకైతే గదిలో పడుకుని ఏడిచేదా! ఆవేళమాత్రం ఏడుస్తూనే కళ్ళయినా తుడుచుకోకుండా ఇంటి పనంతా చేస్తూనేవుంది. ఆవేళ సాయంత్రం - డ్రిల్లు అయేక మున్నా అన్నలు ఇద్దరూ అమ్మకీ, నాన్నకీ సలాంచేశారు. నాన్న వాళ్ళ భుజాలు తట్టి తన తెల్ల మీసం తిప్పేడు. కాని అమ్మ వాళ్ళని పట్టుకొని కళ్ళు కరిగిపోయేలా ఏడిచింది. అమ్మ అంతే. మున్నాకి భయంవేసి గదిలో మంచంకింద దూరిపోయాడు. కాని అతని అన్నలు వెదికి పట్టుకుని బైటకు తీసుకొచ్చి ముద్దు పెట్టుకొని పెళ్ళిపోయేరు. మరి తర్వాత అన్నలు కనిపించలేదు. ఆ

వేళతో ఊరు దిక్కుమాలిపోయినట్లు అయిపోయింది. డిల్లూ లేదు, గిల్లూ లేదు. ఊళ్ళో వున్న కొద్దిమందీ ఆకాశంవేపు చూస్తూ కూర్చోడం, విమానం కనిపించగానే ఊరి ప్రక్కనున్న అడవిలో దాగోడం. ఇదేం నచ్చలేదు మున్నాకి. అమ్మ వ్యవహారం అసలు నచ్చలేదు ఆ వీరుడికి. ఆవిడ పని పూర్తిగా మానేసి తలుపులన్నీ వేసుకొని ఒకగదిలో ఏడుస్తూ పడుకుంటుంది. పైగా తనని కూడా ఆ గదిలోనే పడుకో మంటుంది. పాపం అక్కలే వంటంతా చేస్తున్నారు. వంట చేస్తూ చిన్నక్క చెయ్యి కాల్చుకుంది కూడాను. ఆవేళ నాన్నా, మిగిలిన ఒక్క నౌకరూ కూడా ఈకెలు పట్టుకొని ఎక్కడికో వెళ్ళిపోయేరు. మరి రాలేదు. ఈ వేళనుండి అక్కలు వంటచేస్తున్నా ఈకెలు పట్టుకునే వున్నారు. ఏంవిటో గమ్మత్తుగా వుంది. అంతవరకూ వాళ్ళు ఎప్పుడూ ఈకెలు పట్టుకోలేదు. ఛీ! ఛీ!! చిన్నక్కకి ఈకె సరిగ్గా పట్టుకోవడం కూడా రాదు.

ఆవేళ ... మున్నా ఇంటికి దూరంగా వెదురు గుబురు దగ్గర ఆడుకుంటున్నాడు. అతనికి కొంచెందూరంలో గొర్రెలు గడ్డి మేస్తున్నాయి. గొర్రెల్ని చూస్తే తనకేం భయం! తన తుపాకి తన దగ్గరేవుందిగా! తనని, తన తుపా కిని చూసి పారిపోయిందో పిరికిపాము. తన అన్నల గురించి ఎంతసేపు ఆలోచించేడో మున్నాకే తెలీదు కాని, ఊళ్లో జనం అంతా ఏడుస్తూ అడవిలోకి పారిపోవడం చూసి యీ ప్రపంచంలో పడ్డాడు అతను. అతనికి పెద్దవాళ్ళు ఎందుకు ఏడుస్తారో అర్థంకాదు. ఆ పారిపోయే వాళ్ళలో తన చిన్నక్క

కూడా వుంది. కాని వాళ్ళంతా చాలా దూరంలో వుండటం వల్ల తనని చూడలేదు.

అతను కూడా అడవిలోకి పరుగెత్తి వెళ్ళి వాళ్ళ కోసం ఎంత వెతికేడో? ఎంత తిరిగినా నక్కలూ, కుట్లూ తప్ప మనుషులు కనిపించలేదు. అబ్బ! కాళ్లు ఎంతనొప్పిగా వున్నాయి. పెద్దవాళ్ళకైతే కాళ్లు నొప్పిపెట్టవు! ఆవేళ తుపాకీ దెబ్బకి పడిన గెద్దలాంటి గెద్దలు మాత్రం ఆకాశంలో ఎగురుతున్నాయి. వెతకగా వెతకగా ఏవో వింతజాతువులు అతనికి కనిపించేయి. అవి మేకలుకావు, కుక్కలుకావు, ఆవులు అసలేకావు. వాటివేపుకి నడిచి వెళ్ళేడు మున్నా. తీరా వెళ్ళితే అవి జాతువులు కావు. అన్నలు వాళ్లు డ్రిల్లు చేసినప్పుడు వేసుకునేవారే అలాంటి బట్టలు తొడుక్కున్న మనుషులు. వాళ్ళలో కొందరికి ముక్కుకింద గెడ్డాలులేవు. కొందరికి మొహాలు సగమే వున్నాయి. గుండెలమీద షర్టులు ఎర్రగావున్నాయి. వాళ్లు కాళ్ళూ, చేతులమీద ప్రాకుతూ ఎగరలేని రాబందుల్లా ఉన్నారు. కాళ్లూ చేతులమీద పాకే కాకీ గుడ్డల వాళ్ళంటే మున్నాకి ఎంతోసరదా. తన ఇంటి ముందు డ్రిల్లు చేసేవాళ్లు తనని వీపుమీద "గుర్రం" ఎక్కించుకొని ఆడేవారు. అంచేత వాళ్ళలో ఒకడివీపు ఎక్కిపోయేడు మున్నా. వాడు మున్నాని కిందికి తోసేసి పొడవబోయే గొర్రెపోతు లా చూసి తనవాళ్ళతో కలసి ఏటి వేపు వెళ్ళి పోయేడు.

వాళ్ళంతా ఏట్లో తలలు ముంచి పశువులుతాగినట్లు నీళ్ళు తాగుతున్నారు. తనని "గుర్రం" ఎక్కనియ్యని

వీళ్ళంచే అసహ్యంవచ్చి మున్నా అక్కడినుండి వెళ్ళిపోయి తనవాళ్ళకోసం వెతికేడు. ఎంత నడిచేడో! అబ్బ కాళ్ళు పీకెడుతున్నాయి. కరకర ఆకలి వేస్తోంది. ఏంచెయ్యడమో తోచక ఒక రాతి బండమీద కూర్చున్నాడు. అతనికి తెలియకుండానే నిద్ర పట్టేసింది.

ఆకులు చీల్చుకుని సూర్యుడు అతనిమీద బండమీద పచ్చగా పడ్డాడు. తెలివివచ్చే సరికి మున్నాకి ఏమీకనిపించడం లేదు. గుడ్డితనం అంటే ఏమిటో తెలియదు కాబట్టి సరి పోయింది. లేకపోతే గుడ్డివాడు అయిపోయేనేమోనని భయ పడేవాడు. కళ్లు ఎంత పెద్దవిచేసిచూసినా అతనికి ఏమీ కనిపించడంలేదు. ఎవో పిట్టలో జంతువులో భయంకరంగా అరుస్తున్నాయి. పక్కనున్న "తుపాకీ" చేతిలోకి తీసుకున్నా మున్నాకి ఎంచేతో ధైర్యం రాలేదు. తుపాకి పట్టుకుని తనకు తోచినవేపు నడవడం ప్రారంభించేడు. ఎంతో నడిచేక సూర్యుడొస్తున్నట్టు ఆకాశం ఎర్రబడి పోయింది. కాని సూర్యుడు రాలేదు. ఎర్రటి ఆకాశం చూసేకధైర్యం వచ్చి యింకా జోరుగా నడిచేడు మున్నా, అడవి దాటి బయటికి వచ్చేడు కాని అతనికి పరిసరాలు అన్నీ కొత్తగా వున్నాయి. తనకి తెలిసిన మనుషులు లేరు. ఇళ్ళు లేవు. ఉన్న ఇళ్ళేవో కాలిపోతున్నాయి. కాలుతున్న ఇళ్ళకి దూరంగా వెళ్ళేడు అతను. అక్కడకూడా మరో ఇల్లు కాలుతోంది. ఆ వేడికి తట్టుకోలేక ఆ ఇంటిచుట్టూతిరగడం ప్రారంభించేడు. తిరు గుతూవుంటే ఆ పరిసరరాలు ఎప్పుడో చూసినట్టే అని పించేయి. అటూ, ఇటూ నడుస్తున్న అతను యేదో తన్ను

కొని పడిపోయేడు. అతని చేతిలోని తుపాకీ తూలిపోయింది. పడినదెబ్బకి కళ్ళ నీళ్లు తిరిగేయి. లేచి కళ్లు ఒత్తుకుంటూ చూశేసు. తను తన్నుకున్నది తన తల్లిని. ఆమె ఒంటిమీద బట్టలు లేవు గుండెలో బాకు గుచ్చుకొని వుంది.

"మా" అని పిలవబోయేడు.

అతని నోటినుండి వచ్చిన శబ్దం పక్షి ఆర్తనాదంలా లేదు. పశువు అరుపులా లేదు. మనిషి భాషలాలేదు.

అతను మూగవాడు. చెవిటి వాడు. కూడా.

("బియర్స్" రాసిన "షిక్ మగువా" కథ ఆధారంగా.)

—: o :—

ది స్మోకింగ్ డాగ్

అ సాయంత్రం చాలా అద్భుతంగావుంది. జీవిత వంతా యిలాంటి సాయంత్రాలే అయితే ఎంత బావుంటుంది. బంగారు సూర్యుడు అప్పుడే అస్తమిస్తున్నాడు. ఆకాశవంతా సముద్రవాఁ అన్నంత నీలిగావుంది. దూరంగా నదిలో వెళ్తున్న పడవ తేల్తున్న మబ్బు ముక్కలా వుంది. సరుగుడు తోటలో నుంచి వస్తున్న చల్లగాలి చల్లటి సెంటు వాసనలు పరు స్తోంది. ఇంకా చీకటి పడకుండానే వెలిగించిన వీధి దీపాలు లేతనక్షత్రాల్లా వున్నాయి. తనమీద మనిషికి యింకా నమ్మకం పోకుండా వుండడానికేమో భగవంతుడు అప్పు డప్పుడు అలాంటి సాయంత్రాలు సృష్టిస్తాడు!

చిక్కటి చీకటి తన నల్లని తివాసీని భూమ్యాకాశాల మీద పరుస్తూవుంటే చూస్తూ నిల్చున్నాను బాల్కనీ మీద. హడావిడిగా యింటికి పారిపోతున్న పశువుల్లా వున్నాయి, రోడ్డుమీద పోతున్న కార్లు. నేను - ప్రతిదానికీ విమర్శించే మొగుడ్ని, ప్రతిదానికీ ఆర్గ్యూమెంట్ చెప్పి, చెప్పినమాట వినని పిల్లల్ని, విప్లవకారుడులాంటి కుక్కనీ, జీతం అంతా రిపేరుకే తినేసే డొక్కు కారునీ, ఉడికీ ఉడకని వంటనీ-అన్నింటినీమరిచి పోగలిగి, ప్రపంచాన్ని మరచి బీచిలో ఆల్చిప్పలేరుకునే చంటి పిల్లాడిలా అలా ఎంతసేపు నిల్చున్నానో నాకే తెలీదు,

ఇంతలో కింద కాంపౌండులో గంపెడు గవ్వలు ఒక్కసారి ఒలికిపట్టు గలగల నవ్వులు వినిపించగానే కిందకి చూచేసరికి మా కుర్రడాక్టర్ల గ్రూపు వచ్చేసింది. మా పిల్లలంటే నాకెంత యిష్టమో వీళ్ళన్నా నాకంతే ఇష్టం. ఎంతో అమాయకంగా, నిస్సహాయంగా కనిపించే వీళ్లు యింత భయంకర ప్రపంచంలో ఎలా బతగ్గలరో అని ఆలోచిస్తే విపరీతమైన జాలి, భయం వేస్తాయి, నాకు. మెడిసన్‌తో సహా ప్రపంచంలో ఎన్నో విషయాల గురించి తెలీని వీళ్లు అన్నీ తెలుసనుకుంటారు. "నాయనల్లారా! మీకు తెలీని ప్రపంచం చాలా వుంది. మీరింకా అర ఆదివారం నక్కలు అని నేనెన్నోసార్లు చెప్పినా వాళ్ళు వినరు. వాళ్ళలోని ఆ పసితనమే నాకు చాలా ఇష్టం.

వాళ్ళని రిసీవ్ చేసుకోవడానికి గబగబా కిందికి దిగే సరికి వాళ్ళప్పుడే డ్రాయింగు రూములో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. అందరికీ ఒకే స్వాగతంనవ్వు పారేసి సిగరెట్టు కేసు, లైటరు ఆఫర్ చేసేను. కాఫీ యివ్వడానికి పాలు సరిపోతాయో లేదో పోనీ కూల్‌డ్రింక్స్ యిద్దామా అని ఆలోచిస్తూ.

"సిగరెట్ ఆడదాన్లాంటిది. అనుభవించేక కలిగేది అసంతృప్తే" అని బెర్నార్డ్ షావో, ఆస్కార్ వైల్డో అన్నారు. ఒకవేళ వాళ్ళనకపోతే నేనంటున్నాను" అన్నాడు కృష్ణమూర్తి. "అందుకే నేను సిగరేట్లు మానేశాను" అని కూడా కలిపేడు. అతను ప్రతి మాటకీ ముందు ఏదో ఒక

కొంచెమన్ వాడతాడు. అతన్ని డాక్టర్ క్రిష్ణమూర్తి అని కానీ, క్రిష్ణమూర్తి డాక్టరని కానీ మేమెవ్వరం అనం అసలు తను డాక్టరన్నమాట మాకు జ్ఞాపకం రాదు. ఎంచేతంటే అతడు డాక్టరు కాకపూర్వంనుంచీ మాకు తెలుసు.

"నిజంగా!" మూర్ఛ వస్తున్నట్టు అరిచేడు సత్యన్నారాయణ. ఆ టైములో అతని చేతిలో ఏదీ హత్యాయుధం లేకపోవడం కేవలం కృష్ణమూర్తి చేతిలో వున్న జెర్రిపోతు లాంటి లైఫ్ లైన్ గొప్పతనవేఁ.

"సిగిరెట్లు మానేయడం చాలా తేలిక లేవోయ్. నేను లక్షసార్లు మానేశాను," అన్నాడు గోపాలరెడ్డినవ్వుతూ. అతను "సిగిరెట్" అన్నప్పుడల్లా "సిగరెట్" అని కరెక్టు చేస్తారు - హత్యానేరమైనా క్షమిస్తారు కాని తప్పు ప్రొనన్సియేషన్ మాత్రం క్షమించలేని - మా వారు.

చంద్రమోహన్ అవాక్కైపోయేడు. స్వతహాగా అతను మాట్లాడడు. కేవలం తను మూగవాడు కాడని తెలియచేయడాని కన్నట్టు అప్పుడప్పుడు 'అవును', 'లేదు', 'కాదు' అని మొత్తం అతనున్న నాలుగ్గంటల్లో నాలుగు మాటలు మాట్లాడతాడు. అలాంటివాడు ఈ షాక్‌తో కంప్లీట్ మూగవాడైపోయాడు.

సర్వనాశనం అయిపోయిన తరవాత ఏర్పడే నిశ్శబ్దంలా అయిపోయింది వాతావరణం. క్రిష్ణమూర్తి, తను అప్పుడే ఎవరో్న చంపేసి శవాన్ని తినేసి వచ్చానన్నాకూడా మా కందరికి అంత షాక్ కలిగించి వుండపోను.

"అబద్ధం శుద్ధ అబద్ధం" అని అరవడం ప్రారంభించింది, మా కుక్క క్రిష్ణమూర్తిదగ్గర నిల్చుని.

అసలు మా కుక్క పెద్ద పండితుడో, స్కాలరో అని నా ఉద్దేశం. మేము పాలిటిక్స్ దగ్గర్నుంచి పాప్ మ్యూజిక్ వరకు చేసే అన్ని డిస్కషన్స్ దగ్గర్నుండి జాగ్రత్తగా వింటుంది. దానికి కేపిటలిజమ్, డెమోక్రసీ వగైరా విషయాలమీద చాలా ఇంటరెస్టు. ఆ విషయాలగురించి పాలు మానేసి కూడా గంటల తరబడి డిస్కషన్స్ వింటుంది. కాని "ఇలారా", "పో", "స్నానం చెయ్యి", "పాలు తాగు" వగైరా చిన్న మాటలు దాని కర్థం కావు. కాని నా అనుమానం ఏమిటంటే అది అర్థం చేసుకుంటుంది కానీ, చెప్పినట్టు చెయ్యడం ఇష్టంలేక విననట్టూ, విన్నా అర్థం కానట్టూ నటిస్తుందేమోనని. కారణా లేవైనా చాలా ఇండివిడ్యూలిటీ వున్న కుక్క. దానికి తోచినదే తప్ప ఒకరు చెప్పినట్టు ఛస్తే వినదు.

అసలది మా కెలా దొరికిందంటే - కాదు మేవే దానికెలా దొరికేం అంటే- కొన్నాళ్ళ కిందట మా పక్కింట్లో ఒక ముసలావిడ వుండేది. ఆవిడ వయస్సులోనే ముసిలి కాని శారీరకంగా నాలాంటివాళ్ళ పదిమందిని ఎడంచేత్తో ఎగరేసేగలదు. ఆవిడకి మొగుడు లేడు (చచ్చిపోవడం కాదు కాని బతికేడు అంటారు మావారు.) అంచేత కాలక్షేపానికి సింహంలాంటి అల్సేషియన్‌ని పెంచేది. ఉన్న ముగ్గురు కొడుకులూ మిలటరీలోకి పోయేరు. అందువల్ల ఓ రెండు

చిలకల్ని కూడా పెంచేది పంజరంలో. మేము ఆమె పక్కింట్లో చేరిన కొత్తల్లో నేనోసారి వాళ్ళింటికి వెళ్ళేను. పరిచయం చేసుకుందాం పోనీ పెద్దావిడ కదా ఎందుకైనా పనికొస్తుం దని. ఆవిడ నిన్ను తన్నడానికితప్ప ఎందుకూ పనికిరాదని మావారు హేళన చేసేవారు. నా వెనకాలే మా చిన్ని కూడా వచ్చేడు. వచ్చినవాడు వచ్చినట్టు వుంటే యింత కథ జరక్క-పోను. నెమ్మదిగా చిలక పంజరం దగ్గరచేరి ఎవరూ చూడనప్పుడు పంజరం తలుపు తీసేశాడు. కేవలం ఆ చిలకల్ని పట్టుకోవడమే వాడి ఉద్దేశం అయినప్పటికీ వీడిచేత పట్టించుకోవాలన్న కోరిక ఆ చిలకలకి లేకపోవడం వల్ల అవి సర్రున ఎగిరిపోయేయి. ఆ ముసలావిడ మనసులో ఏవనుకుందో కాని పైకిమాత్రం "పోన్లే బాబూ ఫరవాలేదు" అంది. పైకి అలా కనిపిస్తుంది. పాపం మంచిదే అనుకున్న నాకు ఆవిడ మంచితనంలోని అసలు సంగతి మరో నెల్లాళ్ళ గ్గాని అర్థం కాలేదు.

ఒక నెల పోయేక ఓనాడు మా చిన్ని ఒక నల్లటి గొంగళీలాంటి వస్తువు దేన్నో అతి భద్రంగా రెండు చేతుల్తోనూ పట్టుకొచ్చి కుర్చీలో దింపేడు. "ఎలుగుబంటిపిల్ల నీ కెక్కడ దొరికిందిరా" అనడగబోయిన నాకు "పక్కింటి ఆవిడ ప్రెజెంట్ చేసిన కుక్కపిల్ల" అని వాడు నచ్చచెప్పేడు. చూడ్డానికి బొద్దుగా, అందంగా వున్నమాట నిజమే కాని అదెందుకో నాకు నచ్చలేదు, ముఖ్యంగా దాని కళ్ళు. అంత మిస్చివస్ కళ్ళు నేనెక్కడా చూడలేదు. నాకెందుకో దాని కళ్లు నాగుపాము కళ్ళలా క్రూరంగానూ, కొండచిలువ

కళ్ళలా బద్ధకంగానూ కనిపించేయి. "వెధవకుక్కని ఇచ్చేసిరా" అందావనుకున్న నన్ను- వాడి మొహంలో కనిపించిన సంతోషం అలా అననివ్వలేదు. వాడి యీ అతి చిన్న సహజమైన కోరిక - తీర్చకపోవడం కేవలం క్రూరత్వం అనిపించింది. దాని చిన్నతనం ఏవంత చెప్పుకోదగ్గది కాదు - ఆకలేసినప్పుడు ఏడవడం - ఏడవనప్పుడు నిద్రపోవడంమినహా.

దానికి పేరుపెట్టడం విషయంలో మా పిల్లల మధ్య చాలా దెబ్బలాటలు జరిగేయి. అది కొంచెం పెద్దయ్యేక దాని గుణాల్నిబట్టి పేరు పెడదాం అన్నారు మావారు. దాని కున్న గుణం ఒక్కటే-కనిపించినవన్నీ కొరికేసి చింపేయడం. ఆ కనిపించే వాటిలో గలేబులు, జోళ్ళు, బంతులూ, లేసు కర్టెన్లు అంటే కొంచెం ఎక్కువిష్టం.

"మేజర్ అని పెడదాం" అన్నాడు ఆఖరివాడు చిన్ని. వాడికి మిలటరీలో చేరాలని కోరిక - ఎవరో చెప్పేరుట మిలటరీలో చేరడానికి ఎక్కువ చదువు అక్కర్లేదు. కొన్ని క్లాస్ చాలని.

"తప్పకుండా పెడదాం. ఎటొచ్చీ మేజర్లందరూ నల్లగా వుండి ఆకలేసినప్పుడు చెప్పులు తింటే" జోక్ చెయ్యబోయేడు మొన్ననే కాలేజీలో చేరిన పెద్దవాడు.

చిన్నికి కుక్కకి "మేజర్" అని పెట్టాలనుంది. కాని మేజర్లు జోళ్ళు తినరుట. పెద్ద చిక్కొచ్చింది చిన్నికి. వాడి కళ్ళలో నీళ్లు కనిపించిన నాకు జాలేసింది;

"మీకేవిఁ టంటాకే?" అనడిగేను మా అమ్మాయిల్ని.

"బ్లాక్ మెసేస్ అంటేనో" అంది ఆపరాధ పరిశోధక నవలలూ, ధెయ్యం సినిమాలూ అలవాటుపడ్డ పార్వతి.

"బ్లాక్ ఏంజల్ అన్నా ఫరవాలేదు" అంది బుజ్జి.

తన కుక్క పేరు విషయంలో ఇంత రగడ జరగడం యిష్టం లేక పోయింది చిన్నికి – "నువ్వే ఏదో ఒకటి నిర్ణయించు నాన్నా" అని ఆయన్ని అడిగేడు వాడు.

"పోనీ దాన్నే అడగరా ఏ పేరు ఇష్టమో" అన్నారు ఆయన.

"అలాకాదు, చెప్పనాన్నా" అని మారాంచేశాడు చిన్ని.

"జాక్ అంటే బావుంటుందేమో" అన్నారు ఆయన దొంగనవ్వు నవ్వుతూ. ఆ కిందటి రోజే ఆయన నాకు జాక్ ది రిప్పర్ కేసు గురించి చెప్పేరు. ఆఖరికి "జాక్" అన్న పేరు కుక్కతోసహా అందరికీ నచ్చింది. అదేదో పెద్ద డిటెక్టివ్ పేరనుకుంది పార్వతి. ఏ అమెరికన్ రివల్యూషనరీ పేరో అనుకొని తృప్తిపడ్డారు మిగిలినవాళ్ళు. లండన్లోని డాగ్ షోలో ఫస్ట్ ప్రైజ్ విన్నర్ పేరనుకుని కాలరు ఒకసారి సరి చేసుకుంది మా కుక్క. అప్పటి నుంచీ మేవందరం దాన్ని "జాక్" అని, మా చిన్ని మాత్రం "మేజర్" అని పిలుస్తున్నాం.

దానికి కొంచెం వయసొచ్చేక నేను కనిపెట్టిన విషయం దానికి ఆడవాళ్ళంటే అంత ఇష్టంలేదని. మావారు ఇంటిదగ్గర వున్నంతసేపూ ఆయన దగ్గరే వుంటుంది. ఆయన కోర్టుకెళ్ళినా, ఊరెళ్ళినా జవాన్ల దగ్గిరుంటుంది. "చిన్నప్పటినుంచి పెంచి పెద్ద చేశానే ఛీ, దీనికి కొంచెం కూడా విశ్వాసం లేదు. ఇది కుక్కల్లో చెడ పుట్టింది" అని నేను అస్తమానూ తిట్టుకుంటాను.

ఆ మధ్య ఎన్. జి. ఓ. ల స్ట్రయిక్ జరిగినప్పుడు జవాన్లు ఎవరూ పనులకి రాలేదు. ఆయన కోర్టుకి వెళ్ళగానే మా కుక్క చక్కగా సోఫాలో-జడ్జీకుండాల్సిన డిగ్నిటీ మేము మైన్‌టైన్ చేస్తున్నామో లేదో తెలీదు కాని మా కుక్క మాత్రం జడ్జీగారి కుక్కకుండాల్సిన డిగ్నిటీ అంతా అతి చక్కగా మైన్‌టైన్ చేస్తుంది. అదసలు కాన్వెంట్‌లో చదవాల్సిన కుక్క-చాలా డల్‌గా పడుకునేది. మొదట్లో నిద్ర పోతోందేమో అనుకున్నాను. కానీ తీరా చూస్తే ఒకకన్ను తెరిచి ఏదో ఆలోచిస్తూ ఉండేది. పాపం! వాళ్లమ్మ జ్ఞాపకం వచ్చిందేమో అనుకున్నాను. ఆ టైములోనే మావారు మూడ్రోజులు ఏదో వూరు వెళ్ళేరు. ఆ మూడ్రోజులూ రెండోకన్నుకూడా మూసేసి పడుకునేది. పడుకొని ఆలోచించేదో, నిద్రపోయేదో మాత్రం మాతో చెప్పేది కాదు. అంతకు ముందు ఆంధ్రా ఏజిటేషన్ వచ్చిన దగ్గిర్నుంచి రెగ్యులర్‌గా ఇంగ్లీష్ న్యూస్ వినేది. ఇప్పుడు న్యూస్ మానేసి భక్తిరంజని వినడం ప్రారంభించింది. నాలుగో

నాడు అది వీధి వరండాలో వుండగా మా కారు హారన్ ముందు వినిపించిన తరువాత కారు కనిపించింది. మామూలుగా అయితే తోక ఆడిస్తూ కారుకి ఎదురువెళ్ళి ఆయన కారు దిగి దిగగానే ఆయన సీట్లోకి అర్జంటుగా గెంతి వెళ్ళి మళ్ళీ అంత అర్జంటుగాను కిందికిగెంతి ఆయన కాళ్ళకి చుట్టుకోవడం దానికి అలవాటు.

ఈమారు మాత్రం కారునిచూసి లోపలికి పారిపోయింది. భక్తిగీతాలూ. వైరాగ్యం వంటబట్టేయి కాబోలు అనుకున్నాను. ఆయన ఇంట్లోకి వచ్చిన మూడో నాలుగో నిమిషాలకి పరిగెత్తుకొచ్చింది నోట్లో సిగరెట్టుపెట్టి కరచుకొని.

"థేంక్స్" అని ఆయన సిగరెట్టు పెట్టి తీసుకుకున్నారు.

"కాల్చు కాల్చు" అని పోలీసు హెడ్డులా కసిరింది.

ఆయన సిగరెట్టు అంటించినప్పుడు అది సంతోషంతో డాన్స్ చేసింది. తర్వాత ఆయన వడిలోకి యెక్కి కూర్చుని ఒదిలే పొగలో మొహంపెట్టింది. ముక్కుతో పీల్చింది. నూరేళ్ళ తపస్సు చేసిన మునికళ్ళలా దాని కళ్లు చిద్విలాసంతో నిండిపోయేయి.

దాని గురించి ఇంత చెప్పేక మరో మాటకూడా చెప్పాలి. దానికి అంత నేరో పొలిటికల్ వ్యూస్ వున్నాయని నాకు మొన్నటిదాకా తెలీదు. దానికి 'ఆంధ్రా'ఫీలింగ్

చాలా జాస్తి అనుకుంటాను. (చార్మినార్ సిగరెట్లు అంటే దానికి గిట్టవు.) ఆమధ్య మాకు కొత్త జవాన్ని వేసేరు. వాడు ఇంటికివచ్చిన దగ్గరనుంచి వెళిపోయేదాకా ఒక్కలా అరిచేది వాడిమీద. నాలుగురోజులు భరించి, ఐదోరోజుని పాతజవాన్ని సలహా అడిగేడు: "చార్‌మినార్ సిగరెట్లు దానికి యిష్టంలేదు. మరోరకం బ్రాండు కాల్చుకో" అని అతను సలహా ఇచ్చేడు. కొత్తవాడు ఇంకేదో బ్రాండ్‌కి మార్చేడు. ఆ తర్వాత అతనిమీద అంతగా అరిచేది కాదు కాని అందుబాటు అయినప్పుడు మాత్రం అతని కాలు అందుకునేది. ఒకప్పుడు చార్‌మినార్ సిగరెట్టు కాల్చిన దోషానికి.

సిగరెట్ విషయంలో దాని అభిరుచి మరొక్కటి చెప్పాలి. దానికి ఫారిన్ సిగరెట్లంటే మహామోజు. మా పక్కింటి డాక్టరుగారు ఎప్పుడేనా ఫారిన్ సిగరెట్లు కాలుస్తారు. కానీ కాల్చేముందు మా కుక్కకి కబురుచెయ్యరు. అంచేత పాపం అది ఏం చేయగలదు? ఆయన పారేసిన ఫారిన్ సిగరెట్టు పెట్టెలు తెచ్చుకుని పిల్లల డ్రాయర్లో దాచుకుంటుంది.

• • •

ఈ మధ్య ఏమిటి జరిగిందంటే...

మా అమ్మాయిలు మెడికల్ కాలేజీలో మున్నే అడుగుపెట్టినా, వైద్యమంతా వచ్చేసిందనుకుంటారు. అనుకున్నంత మాత్రాన ఫరవాలేదు. మామీద ప్రాక్టీసు మొదలు

పెట్టేను. ప్రాక్టీసు ముందు కుక్కమీద మొదలు పెట్టమన్నాను. కుక్క వప్పుకోలేదు. కుక్కంటే వాళ్ళకు అంత అభిమానం.

ఇంతకీ చెప్పొచ్చేదేమంటే కిందటివారం నాలుగు రోజులు వాళ్లు నాకు వరస లెక్చర్లిచ్చేరు. సిగరెట్లు కాలిస్తే కేన్సరొస్తుందని. కాబట్టి ఆయనచేత సిగరెట్లు మానిపించే పని లేదా పైప్ కాల్పించమనీ లెక్చర్ వింటున్నట్టు నేను నటించేదాన్ని. మొదటి రెండురోజులూ వినసట్లు మా కుక్క నటించింది.

"లెక్చర్ను పూర్తయ్యాక ఆయన సిగరెట్టు పెట్టెలు కొన్ని కనిపించడం మానేశాయి. మొగపిల్లలు కాల్చటం మొదలుపెట్టే రనుకున్నాను. తర్వాత ఆయన సిగరెట్టు అంటించిన దగ్గర్నుంచీ ఆయనమీద అరవడం, కరవబోవడం మొదలుపెట్టింది మా కుక్క. మొదటి రోజు "దీనికి దెయ్యం పట్టిం"దన్నారు. రెండోరోజు "దీన్ని పోలీసులతో చెప్పి కాల్పించేస్తానన్నారు."

"అదికాదు నాన్నా, నిన్ను సిగరెట్ మానీ మంటు న్నాది" అన్నది బుజ్జి, అంటే మా చిన్నది, దానికి కొంచెం ధైర్యం ఎక్కువ వాళ్ళ నాన్నదగ్గర.

"ఇదెవరు నన్ను మానమనడానికి, ఇదేం నాకు సిగ రెట్లు కొంటున్నాదా ఏం" అన్నారు ఆయన.

"సిగరెట్ కాలిస్తే కేన్సరొస్తుందట" అంది బుజ్జి.

"ఎవరికి? దానికా? నాకా!

దానికే వస్తుందని దాని భయం. కాని ఆ విషయం ఆయనకి ఎవరూ చెప్పలేదు.

"అదికాదు నాన్నా. అది నిన్ను సిగరెట్లు మాన మనడంలేదు. నైస్ కాల్చమంటూంది" అన్నాడు చిన్ని. మామూలుగా వాడిసీటు వాళ్ళ నాన్న నెత్తిమీదే.

"నీ కెప్పుడొచ్చిందో రే కుక్కభాష" అని విసుక్కున్నారు. ఆయన కుక్కభాష తన స్వంతం అయినట్టు. కానీ ఆయన సిగరెట్లు మానెయ్యలేదు.

తర్వాత వరసగా ఆలయానికి వెళ్ళి ఏదో పురాణం వింది మా కుక్క. "మనిషి (ఇక్కడ మనిషి అంటే కుక్క) పుట్టినవాడు చావక మానడు. చావుకి కారణం కలరా అయితేనేం, కేన్సర్ అయితేనేం?" అని గ్రహించి వుంటుంది. తనకీ, ఆయనకీ కేన్సర్ రావాలని ఈశ్వరాజ్ఞ అయితే ఏం చేస్తాం అనుకొని మళ్ళీ మామూలు స్థాయికి వచ్చేసింది సిగరెట్ల విషయంలో.

• • •

కుక్కకి అయిన జ్ఞానోదయం కొంచెం ఆలస్యంతో మావారికి అయింది. మావారు ఏ పురాణాలు, ఏ లెక్చర్లు విన్నేకుకాని కృష్ణమూర్తి ఆనూట అనగానే ఆయనలోని

పౌరుషం తలెత్తింది. ఈ గుంటడు మానేసినప్పుడు నా అంతటి వాడు మానకపోవడం పెద్ద ఇన్సల్టు అనుకున్నా రేమో.

అంచేత ఓ రోజు పొద్దున్నే లేచి "నే నివాళనుంచి సిగరెట్లు మానేస్తున్నాను" అని డిక్లేర్ చేశేను. ఆయన అలా డిక్లేర్ చేసినప్పుడు మా కుక్క కూడా అక్కడే వుంది. అది వెంటనే మా వారిమీద కెగిరి మొహం అంతా నాకేసి థ్యాంక్స్ చెప్పేసింది. "కుక్కకున్నపాటి ఇంగిత జ్ఞానం మీలో ఎవ్వరికీ లేకపోయింది" అని మా వారు తిట్టేగు కూడాను

నాకు మాత్రం గుండె పాదాల్లోకి జారిపోయింది. ప్రపంచంలో ఏదీ కూడా మా వారు సిగరెట్టు మానడం లాంటి కష్టంతో ఈక్వల్ కాదు. అది నా స్వానుభవం. ఈ మధ్య ఎప్పుడో ఓసారి "నాకు రాహువులో రాహువు నడుస్తోంది. వాడు మా చెడ్డ చికాకు పెట్టెస్తాడుట. మెల్లిగా ఈ అంతర్దశ దాటేసేవంటే ఆ తరవాత మనల్నం కెవరూ ఆప లేరు. "పులి" అనుకో. కాని యీ పీరయడ్ మాత్రం ఎన పాట్లు కుక్కలు కూడా పడవు" అన్నారు.

ఇంకేం కుక్కపాట్లు ప్రారంభించే యన్నమాట. ఎంత పని చేస్తున్నావయ్యా రాహువూ !

ఆవేళ మావారు జడ్జిమెంటు చెప్పలేకపోయారు. మా కుక్క పాలు తాగలేదు. మా వారికి వంటలో ఏ పదార్థం, నుంచినీళ్ళతో సహా రుచించలేదు. ఆయన కోర్టుకి వెళ్ళిపో గానే రోజూ అయితే మా కుక్క శుభ్రంగా నిద్రపోయి మళ్ళీ మా కారు హారన్ వినిగాని లేచేది కాదు. ఆవేళ

మాతం ఇల్లంతా పచారు చెయ్యడం ప్రారంభించింది. ఒక్క నిమిషం కూడా నిద్ర పోలేదు. ఆ రాతి మా వారూ, కుక్కా ఇద్దరూ చాలాసేపు కబుర్లు చెప్పుకున్నారు. అందులో ఎక్కువ భాగం సిగరెట గురించే.

ఆ మర్నాడు పొద్దున్నే మావారు కాఫీ దగ్గర రెండు కప్పులూ, అన్నం దగ్గర మూడు గ్లాసులూ ముక్కలు చేశేశారు. మా కుక్క ఎన్నడూ వరండా దిగనిది రోడ్డుమీద పోతున్న ఒక పిల్లనీ, ఒక కుక్కనీ కరిచేసింది. అసలది ఎప్పుడూ అరవదు, కరవదు. ఒకవేళ పిచ్చెత్తడం లేదు కదా అని భయం వేసింది మాకు. మా వారు భోజనం అయిందని పించేరు కాని అది మెతుక్కూడా ముట్టుకోలేదు. మూడో నాటికి సీరసంతో నడవడానికూడా ఓపిక లేకపోయింది. చచ్చిపోదు కదా భగవంతుడా అని భయం వేసింది మాకు. మా చిన్ని ఏడుస్తూ కూర్చున్నాడు. ఆస్పత్రికి పంపిస్తే "జబ్బేమీ లేదు కేవలం మనోవ్యాధి. గాలిమార్పు అవసరం" అన్నాడు మెడిసన్ చదువుదా మనుకున్న వెటినరీ డాక్టరు. ఎవరైనా సైకియాట్రిస్టు దగ్గిరికి పంపిస్తేనో అనుకున్నాం. కాని కుక్కలకి సైకియాట్రిస్టు ఉండడుట. తరవాత్తరవాత అదసలు గదిలోంచి బైటికి రావడం మానేసింది. మే మెవరంవైనా వెళ్తే మా వైపు అతి జాలిగా కళ్ళనీళ్ళతో చూసి మళ్ళీ పడుకునేది. మావారు ఆఫీసులో కూర్చుంటున్నారనే కాని కాయితం కదలడం లేదు. రోజూ రెండో, మూడో గాజుగ్లాసులో, యాష్‌ట్రేలో, మేగజైన్లో

ఎవో ఒకటి ఎగిరి పోతున్నాయి. మా ఇంటికి కొత్తగా ఎవరేనా వస్తే "పాపం వీళ్ళింట్లో పదిమంది ఒక్కసారి చచ్చిపోయారు కాబో" లను కొండేటంత భయంకరంగా తయారైంది పరిస్థితి. ఇటు కుక్క అటు మావారు ఇద్దరూ దక్కరేమోనన్న భయం పట్టుకుంది నాకు. అంచేత ఇంక ఆవేళ కుక్క ఏదైనా తింటేకాని మే మెవ్వరం మంచినీళ్లు కూడా ముట్టకూడదని నిర్ణయించుకుని దాన్ని బతిమాలేం. భయ పెట్టాం. ముద్దు పెట్టుకున్నాం. మా చిన్ని దాన్ని కావలించు కొని ఏడ్చేశాడు. అయినా దానిలో ఏ మార్పూ లేదు ఒక్క కడుపు కరిగిపోయే చూపు తప్ప. మా బాధ, కుక్క బాధ చూసిన మావారు ఏవనుకున్నారో ఏమో "మీరంతా వెళ్ళండి. నేను దాన్ని అన్నానికి తీసుకొస్తాను" అన్నారు అతి సీరియస్‌గా.

మే మందరం అతి ఆతృతగా బైట నిల్చున్నాం. ఒక అరగంట గడిచింది. లోపలనుండి మావారూ, కుక్క మాటలు సన్నగా వినిపిస్తున్నాయి. కానీ మాకేవీ అర్థం కాలేదు.

ముప్పై ఒకటో నిమిషంలో తలుపు భళ్ళున తెరుచుకుంది. నోట్లో సిగరెట్టు కాలుస్తూ మావారు వచ్చేరు. మా కుక్క అతని మొహంలో మొహంపెట్టి సిగరెట్టు పొగ పీలుస్తూ మొహం అంతా నాకేస్తోంది. కఠోర తపస్సు తర వాత భగవంతుడు ప్రత్యక్షమైతే ఉన్న వెలుగుంది దాని

మొహంలో. అంత నీరసం ఏమై పోయిందో చెంగున గెంతి వెళ్ళి అన్నం తినేసింది.

"ఏవిఁటో, పిచ్చిముండ. దానికోసం కాల్చాలి సొచ్చింది." అన్నారు మావారు వేదాంతికంగా సిగరెట్టు వేపు చూస్తూ. ఆయన ఆఫీసుకి వెళ్ళేక మా చిన్నితో చెప్పిందట మా కుక్క. మావారు సిగరెట్టు మానేసి పడు తున్న బాధ అది చూడలేక, యజమాని అంత కష్టంలో ఉంటే తను చూడలేక మంచం పట్టేసేనని, నిజానికి దానికి సిగరెట్లలో ఇంటరెస్టు లేదనీని !

—o—

అతిసర్వత్ర వర్జయేత్

ఆవేళ మా వారెందుకో చాలా హుషారుగా వున్నారు.

బహుశా హైకోర్టు వాళ్ళు యువర్ వర్క్ ఈజ్ సాటిస్ఫాక్టరీ అనుంటారు. లేకపోతే ఈ మధ్య మీ జుత్తు నల్లగా కనిపిస్తోందని వాళ్ళ ఎడిషినల్ జడ్జి అన్నైనా ఉంటాడు. అదీ ఇదీ కాకపోతే ఎవడో దిక్కుమాలిన సాక్షిని అల్లరి పెట్టేస్తే వాడు పెయింట్ అయిపోయుంటాడు. అదేంటో ఆయన కదో సరదా. ఏ వకీలునీ ప్రశ్నలు వెయ్యనివ్వరు, క్రాస్ ఎగ్జామిన్ చెయ్యనివ్వరు. ఆర్గ్యుమెంట్ చెప్పనివ్వరు. రెండు వైపులా ప్రశ్నలు తనే వెయ్యడం, ఆర్గ్యుమెంట్ కూడా తనే చెప్పేసుకోవడం ఆయనికి సరదా. "ఆ వకీళ్లు బోలెడు డబ్బు పుచ్చుకుంటారు కదా. మీ కెందుకీ శ్రమ. హాయిగా వాళ్లు చెప్పేదేదో విని రెండు ముక్కలు రాసిపోక" అని నాలాంటి వాళ్లెవరైనా అంటే యుద్ధం చెయ్యనని నేలని చతికిల బడిన అర్జునుడి వేపు శ్రీకృష్ణుడు చూసిన చూపొకటి చూసి వెంటనే గీతా బోధకి ఉపక్రమిస్తారు. కృష్ణుడు గీతకి అంతం ఉంది కాని మావారి గీతకి అంతం లేదు. అదే వంటే "ఆ కృష్ణుడికేం తెలుసు నా మొహం ! పిల్లిగర్ర వాయించుకోడం ఆడపిల్లల్తో సరసాలాడ్డం తప్ప. చేతనైతే

ఒక్క సెషన్స్ కేసు విచారించమను చేతనైతే ఒక్క కేసులో ఒక్క సాక్షి చేత నిజం చెప్పించమను. మొన్న మర్డర్ కేసులో చచ్చినవాడి కొడుకు అంతా తను చూసినట్టు చెప్పేస్తున్నాడు. వాడిస్తున్న ఖూనీ వివరాలు చూస్తుంటే వీడే చేశాడేమో ననిపించింది. పాపం ఆముద్దాయి ప్లీడరు పాతకాలం మనిషి. ముద్దాయి ఎప్పుడు కొట్టేడు? ఎక్కడ కొట్టేడు? అంటూ చచ్చు ప్రశ్నలు వేస్తూ వుంటే ఆ సాక్షి ముండాకొడుకు అతన్ని ఛెడీ ఛెడీ మని అబద్ధాలతో మూతి మీద కొట్టేస్తున్నాడు ఇదిలాకాకాదని ఆ ప్లీడరుని ఆగమని నేను తలా తోకా ముడిపెట్టి రెండుప్రశ్నలు వేసేసరికి ఆ సాక్షిగాడు ముందు మంచినీళ్ళు అడిగేడు. మరో రెండు వేసేసరికి మంచినీళ్ళ డగలేదు. మూర్ఛపోయేడు ..."
అంటారు.

"అయ్యా! తమ కోర్టుకి వాడు సాక్ష్యం చెప్పడానికొస్తాడు కాని మూర్ఛపోవడానికాదు." అంటే "రాస్కెల్ మళ్ళీ వెళ్ళాం దగ్గిర కూడా జన్మలో అబద్ధం ఆడకుండా చేసేసేను వెధవని వాడి నోటికొచ్చిన కూతను కూస్తే నమ్మడానికి, నేనేం జడ్జీ ననుకున్నావా? జడ్జి వెధవ ననుకున్నావా? ఒకడ్ని మూడు చెరువుల నీళ్లు తాగిస్తే మరి వారంరోజులు ఎవడూ నోరు విప్పడు" అంటూ కాలరు సవరిస్తారు. మొదట్లో నేనూ సరదాగో, చిన్నతనం వల్లో అతనితో వాదించేదాన్ని. కాని యిప్పుడు మానుకున్నాను నా పనైతే చాలు ఎవరెలా పోతే నాకేం అన్న స్టేజ్ కొచ్చేసేను.

అసలు మా యింట్లో ఆయన్ని ఎవరూ ఎప్పుడూ ఏంవీ

అడగం. ఎందుకనంటే పొద్దున్నే అడిగితే "తెల్లారకుండా ఏంవిటి వెధవ గోల! అయినా ప్రతిదీ నాతో చెప్పడం ఎందుకు! మీ యిష్టమొచ్చినట్టు వేడవండి," అంటారు. పోనీ కోర్టుకు వెళ్ళే ముందు చెప్తే "ఐ టోల్డు యు సెవ రెల్ టైమ్స్‌నాట్ టు డిస్టర్బ మి విత్ యువర్ సిల్లీ థింగ్స్ వెన్ ఐగో టుది కోర్ట్ అంటారు. పోనీ సాయంత్రంచేస్తే "చచ్చి చచ్చి ఇంటికొస్తే ఓ కప్పు కాఫీ, ఓ సిగరెట్టూ పడీక" ఏవండీ పెద్దదాని ఫీజు కట్టాలి. ఏవండీ! చిన్నిగాడు సినిమా కెళ్తా డుట అని వెధవగోల కాన్ట్ యు మానేజ్ దీజ్ స్మాల్ థింగ్స్! లేకపోతే నువ్వేం గృహిణివి! చేతకాకపోతే 'సర్ ఐ ఆమ్ ది మోస్టు ఇన్‌ఎఫిషియంట్. ఇన్ కాంపిటెంట్ హౌస్ వైఫ్-నాట్ హౌస్‌వైఫ్' అని కాయితం రాసి సంతకం చేసి యిచ్చి యిల్లు ఎలా నడుపుతానో చూసుకో" అంటారు. ఇంక రాత్రి పడుకోబోయేముందు – "అమ్మా, తల్లి! నీకో నమస్కారం నీ బాబుకి పదివేల నమస్కారాలు. నోరు మూసుకు పడుకున్నావా, సరే. లేకపోతే చెప్పు. కోర్టుకి పోయి పడుకుంటాను. పొద్దున్న నుంచి రాత్రిదాకా చిన్న దానికి ఫీజుకట్టాలి. పెద్దదానికి పడిశం పట్టింది అంటూ వెధవ సమస్యలూ నువ్వూను. దానికి పడిశం పడితే నేను చేసే దేముంది. నేనేం పడిశాన్నా అర్స్రోనా! నోరు మూసుకు పడుకోవే" అంటారు.

పిల్లల పరీక్ష ఫీజులు, పడిశాలూ తప్ప నాకేం సమస్యలుంటాయి! నేనేం సిరిమావోనా! గోల్డామీర్‌నా! అంత కంటే పెద్ద సమస్యలుండటానికి. దేశంలో జడ్జిలు అంతా

ఇలాగే ఉంటారో లేక నా నోములపంట ఒక్కటి మాత్రం ఇంతో తెలియదు ఏది ఎలావున్నా మా ఇంట్లో ఎవరమూ ఆయన్ని అనవసరంగా ఏ విషయంలోనూ కదపం.

కాని యిప్పుడు మాత్రం అతనితో సంప్రదించక తప్పదు. దేశంలో బంద్ మూలాన్ని పిల్లలు కాలేజీకి వెళ్ళి మూణ్ణెల్లయింది. వాళ్ళ కాళ్లు గుంట్లుపడిపోయాయి. అప్పో సప్పో చేసి కొన్న కారు చేతిలోవుంది. పెట్రోల్ బంక్‌లో అరువుంది. అంచేత ఏ ఊరైనా తప్పక వెళ్ళకపోతే పెళ్ళిళ్లు కాకుండానే సన్యాసుల్లో కలిసిపోతామని పిల్లలు నాకు ఆ ఉదయం ఆఖరి వార్నింగ్ ఇచ్చేశారు.

అంచేత ఆవేళ చెమ్మదిగా ప్రారంభించేను ముందుగా మాంచి కాఫీ, ఓ సిగరెట్టు పాకెట్ సమర్పించుకొని, "వచ్చే వారం శలవలు కదూ?" అన్నాను.

పసికట్టడంలో వేటకుక్కలాంటివారు.

"నీకా, మీ నాన్నకా?

"మీకు"

"నువ్వు యిస్తున్నావా? మీ నాన్నయిస్తున్నాడా?"

కోర్టు విషయాలు మాటాడని టైములో మా నాన్నని నన్ను కలిపిగాని, విడివిడిగా గాని చెప్పడం వారి హాబీ!"

"చాలారోజులనుంచి ఎక్కడికీ వెళ్ళలేదు. ఈ శలవల కైనా ఎక్కడికైనా పోదాం అని పిల్లలు ఒకటే గోల పెట్టేస్తున్నారు."

"అంటే నీకు పాపం యిష్టంలేదన్నమాట."

"పోనీ ఈసారి ఎక్కడికైనా పోదాం"

"మీ పుట్టింటికా !"

"సాగరో, మరే వూరో పోదాం అంటున్నారు."

"ఏం ! మనియార్డరేవైనా వచ్చిందా మీ నాన్న దగ్గర్నించి."

ఎంత చంపుకుందామనుకున్నా నాలో చేతకాని పౌరుషం చావనంటోంది. తరవాత తల వాచిపోయినా సరే ముందు గింజుకుంటాను. "మా బావుంది. ముచ్చట, మీరూ మీ పిల్లలూ వూర్లు తిరగటానికి మా నాన్న ఎందుకిస్తారు?"

"ఏమో ! పాపం నా కూతురు పరమచేతగాని చవటని కట్టుకొని తెగ కష్టాలు పడిపోతోంది. ఏదో కొంత విశ్రాంతి ఇద్దాం అనుకోవచ్చును. ఎంతైనా పితృహృదయం కదూ పాపం !"

"చావో, రేవో చెప్పేస్తే మేకల్లోకి పోతానందట వెనకటికెవర్తో. యస్. ఆర్. నో చెప్పేస్తే పోతాను. పని చేసుకోవాలి." లేచి నిల్చున్నాను. సీరియస్‌నెస్ మొహం మీదకి తెచ్చుకొని అదే మామూలుగా అయితే "పోతే పో. అడిగేదానివి నీకే అంత తిక్కైతే నాకెంత వుండాలి. ఓ సరసంలేదు, చట్టుబండలూ లేదు. ఒట్టి మానుని కట్టుకున్నాను." అని తనే లేచి పోయేవారు. ఇప్పుడు అలా లేవలేదు సరికదా రెక్కపుచ్చుకుని లాగి కుర్చీలో కూలేసి "కూర్చోవే బాల త్రిపురసుందరీ ఆడదానికి ఒక్క పాతి

ప్రత్యం చాలకు. పతిభక్తి కూడా వుండాలని ఎన్నిసార్లు చెప్పాలి? సరేకాని యింత చిన్న విషయానికూడా నా సలహాలే కావాలా? యు ఆర్ ఎ గ్రాడ్యుయేట్ ఎండ్ ఎ రైటర్. నువ్వు, పిల్లలు ఆలోచించుకొని ఎక్కడికంటే అక్కడికే పోదాం" అన్నారు నవ్వుతూ.

నేను అంతవరకూ ఆరోగ్యంగానే ఉన్నాను. కాని అప్పుడు నాకు ఏమిటో మూవాగు రెండు మూడు ఆకారాలు గాను, నేల పైనా ఫేను కిందా కనిపించడం ప్రారంభించేయి. నాతో మాట్లాడుతున్నది యింకెవరో కాదుకదా! కాదు సందేహంలేదు. అధికార్లు యింకేదో ప్రమోషను యిస్తా నన్నారేమో? కాని మొన్నేకదా ప్రమోషనొచ్చింది. మళ్ళీ వీడిటో! ఏమో అధికార్ల లీలలు ఎవరికి తెలుసు! అధికార్ల లీలలు చిత్రమైన వైతే మూవారి లీలలు విచిత్రమైనవి. వారెవా అవి మన యిష్టమొచ్చినట్లు మాట్లాడితే పిలక సాగిపోతుంది. అంచేత ఎంత చనువిచ్చినా నేను తీసుకోను. తిరిగి చస్తే కలలోకూడా హాస్యమాడను.

"మీరే ఏదో ఒకటి చెప్పండి మీ రెక్కడికంటే అక్కడికే."

"ఔనే అపర సావిత్రీ. పాపం నా మాటంటే ఎంత గురి!"

నేను కుర్చీలోంచి లేచి పోబోయేను. అసలు మాటకి సమాధానం చెప్పకుండా ఆగ్రోజులు ఏకబిగిని మాటాడు తారు, నేను నిజంగానే పోతున్నానని పసికట్టేరు.

"కూర్చో పాపం అలసిపోయావు అడిగి అడిగీ. అయితే మన జగన్నాధం వూరు పోదాం ఏమంటావ్?"

"ఏ జగన్నాధం?"

"లోకంలో లక్ష జగన్నాధా లుండొచ్చు కాని నీకూ నాకూ తెలిసినది ఒక్కడే. నా చిన్ననాటి ఫ్రెండ్. మనం పెళ్లైన తర్వాత ఒక్కసారే వెళ్ళేం. అదీ ఇద్దరు పిల్లలు పుట్టేక. ఇప్పుడు నలుగురయ్యేరు కదూ మరోసారి పోల్దాం. ఆరుగు రయ్యేక మరో...

"నేను ఇంట్లోకి వెళ్ళిపోయేను, సరసన. అక్కడే వుండి నేను రానని వాదించి నెగ్గలేను ... వెళ్ళడానికి .... అమ్మో! అంతకంటే అడవికి పోతే నయం. పాకిస్తాన్ పోతే నయం. జగన్నాధం మావారి బెస్ట్ ఫ్రెండ్ కాబట్టి ఆయనకేం ఫర్వాలేదు. కానీ నా గతీ పిల్లల గతీ! ఇంతకీ జగన్నాధం రాక్షసుడూకాడు రావణాసురుడూ కాడు. నిజం చెప్పాలంటే మంచివాడు. కాని అతని తండ్రి ... అసలు కథేవిటంటే.

2

పదిహేనేళ్ళక్రింద ఒకసారి జగన్నాధంవూరు వెళ్లేం. అప్పుడు మాకు ఇద్దరే పిల్లలు. పావుగజం ఒక్కర్తీ, అరగజం ఒక్కర్తీను వాళ్ళది పల్లెటూరవటంవల్ల చుట్టూ తోటలూ, పొలాలూ వుండడంవల్లా యీ వూరుకంటే ప్రశాంతంగా

వుంటుందిలే అనుకున్నాం. మేము బస్సు దిగ్గానే మమ్మల్ని జగన్నాధమే రిసీవ్ చేసుకున్నాడు. రెండు రిక్షాల్లో యిల్లు చేరేం. గుమ్మంలోనే ఒకాయన తెల్లపంచా, తెల్లలాల్చీతో ఉన్నాడు. లాల్చీ పీకదగ్గర గుండీకూడా పెట్టేసుకున్నాడు. భుజంమీద తువ్వాలు అలంకారంగా వుంది. అతనే జగన్నాధం తండ్రి రామారావుగారట. మనిషిని చూస్తే నలభై ఏళ్లుంటాయేమో ననిపించింది. కాని జగన్నాధానికే ముప్పై దాటేయి. అప్పటికి ఇనప గునపం వీపుకు కట్టేసుకున్న వాడిలా రామారావు మంచి ఎరెక్టుగా వున్నారు. కుశలప్రశ్నలయ్యేక లోపలి కెళ్ళేం. మాకోసం ప్రత్యేకంగా మేడమీద గది కేటాయించేరు. జగన్నాధం మా వారు చిన్నప్పటినుండి ప్రాణ స్నేహితులు. యింకేం వారంరోజులూ హాయిగా బతికొచ్చు అనుకున్నాను. పొద్దున్నే పిల్లలకోసం తెల్లార కుండా లేవడం. ఆదరా బాదరా పరిగెత్తి వంట చేయడం అంతా రన్నింగ్ రేస్‌లా వుంటుంది– మా ఇంట్లో; ఈ వారం ఏ బాదా వుండదు. నిద్ర వచ్చినప్పుడు పడుకోవచ్చు. ఆక లేసినప్పుడు అన్నం తినొచ్చు. పైగా నాకొక తీరని కోరికొక టుండేది. రోజూ నా కాఫీ నేనే కలుపుకొని తాగాలి. అలా కాకుండా నేను మొహం కడుక్కోగానే ఎవరైనా కాఫీ ఇస్తే పేపరు చదువుకుంటూ కాఫీ తాగాలని నా చిర కాల వాంఛ అది యీనాడు తీరబోతోంది. న్యాయంగా ఏడాదికోసారైనా ఆడవాళ్ళకి ఈమాత్రం శెలవు యివ్వాని మొగాళ్లు వట్టి సెల్ఫిష్ ఫెల్లోస్. ఆ రాత్రి హాయిగా పడుకున్నాను.

నిద్రలో ఎవరో పిలిచినట్టయి లేచి కూర్చున్నాను. మెట్లమీంచి కాబోలు జగన్నాథం చెల్లెలు సీత నన్ను పిలుస్తోంది. కళ్లు తెరిచి చూద్దునూ! ఇంకా బాగా చీకటిగా వుంది. కొంపదీసి ఎవరికీ ఎమీ అవలేదు కదా ! లేకపోతే ఇంత తెల్లవారు జామునే ఎందుకు లేపుతుంది ! టైము చూసేను ఇంకా నాలుగు కూడా కాలేదు. గాభరాగా లేచి కిందకి వెళ్ళేను. ఏం కొంప మునిగి పోయిందోనని నన్ను చూసిన సీత "మొహం కడుక్కోండి బ్రహ్మగారూ" అంటూ బాత్‌రూమ్ చూపించింది. ఇందుకా యింత తెల్లవార కుండా లేపేసింది! మళ్ళీ ఎంత పెరాయి పిల్లయినా ఆ అమ్మాయి మీద నాకు మహోపం వచ్చేసింది. మళ్ళీ పోయి పడుకుంటేనో. అప్పుడు గాభరాలో తెలీలేదు కాని చలికి కళ్లు కర్రలై పోయేయి. కర్రకాళ్ళ వాళ్ళలాగ ఒంగలేక పోతున్నాను. లాభం లేదు. నెమ్మదిగా జారే యాలి. ఇంతలో వాకిట్లో నూతిలోంచి నీళ్లు తోడతున్న చప్పుడు. "సీతా, ఆ అమ్మాయి లేచిందా? లేపు లేపు. తెల్లారకుండా లేస్తేనే ఆరోగ్యం. ఈ గాలి తగిలితేనే మనిషి ఒళ్ళు గట్టి పడుతుంది. వాళ్ళ పిల్లల్ని, అతగాడ్ని, మీ అన్నయ్యని కూడా లేపు. వయసులో వున్న ఆడపిల్లవి కదా. చక చకా నడవక ఏమిటా యీడుపు నడక?" అన్న రామా రావుగారి కేకలు వినిపించేయి. అతను ఆ ఊరు ఎలమెంటరీ స్కూలు హెడ్ మేష్టరు మేష్టరవడం వల్ల ఎప్పుడూ ఎవరో ఒకరిని కేకలెయ్యడం అలవాటై పోయుంటుంది.

మళ్ళీ పడుకుందామున్న ఆలోచన విరమించి సీతని

కేకేశాను. రాతి మా బేగ్ ఎక్కడ పెట్టారో చూడమని. అందులో టూత్ బ్రష్, పేస్ట్ వున్నాయనీ. రామారావుగారివి పాము చెవులు "ఇదుగోమ్మా! అమ్మాయీ నీ పెరేవిఁటన్నావ్! సుందరమ్మా. సరే సరే. నా మాటవిని వేప పుల్లలతో పళ్ళు తోముకో. ఏముంది ఆ పేస్ట్‌లో అసలు ఈ కాలం వాళ్ళకి ఆరోగ్యం గురించిన ఆలోచన అసలు లేదు. మన పెద్దవాళ్ళు చూడు నూరేళ్ళు పైన బతికేవారు. అదీ ఎలా? పదేళ్ళ పిల్లలడికంటే చురుగ్గా. మీరు చూడూ! ఒక్కరైనా సరిగ్గా నిల్చో గలుగుతున్నారా? అర గడియ కూర్చోగలరా? ఎబ్బే లాభం లేదమ్మా. ఇక్కడున్న న్నాళ్ళూ నా మాట విన్నావంటే తరవాత నీకే అలవాటై పోతుంది. సీతా ఒదినకో వేప్పుల్లలు యియ్యమ్మా" అంటూ ఆ పూట పాఠం ఆపి లోపలి కెళ్లేరు. నాకు ఆ వేపపుల్లల నోట్లో పెట్టుకోగానే వారం రోజుల కింద తిన్న అన్నంకూడా వాంతి అయిపోతుందేమో ననిపించింది. ఈ లోగా ఎప్పుడొచ్చారో మా వారు నా వెనకాలే వేపపుల్లల నములుతూ నవ్వుతున్నారు నన్ను చూసి. ఈయన రాక్షసుడు లేకపోతే చెరుకు ముక్క నవిల్నట్టు ఎంత చక్కగా నవులుతున్నారో ఆ ముష్టి వేపపుల్లల! నేను వెంటనే గబగబా అయిందనిపించేశేను. తరవాత స్నానం చేసినప్పుడు పేస్టుతో తోముకోవచ్చునని.

పోనీలే లేస్తే లేచేను. కొంచెం వేడి వేడి కాఫీ తాగితే ఒంట్లో వెచ్చదనమన్నా వస్తుంది అనుకుంటూ వంటింట్లోకెళ్ళి కూర్చున్నాను. జగన్నాధం తల్లి ఏదో పని చేసుకుంటున్నది. నన్ను చూసి అరగజం పొడవున్న గ్లాసు

తీసుకొచ్చి నా చేతి కిచ్చింది. ఆ గ్లాసులో రమారమీ నిండా పాలున్నాయి. గ్లాసు చురికిపోతోంది. గబుక్కున కింద పెట్టేసి "పిల్లలింకా లేవలేదండీ" అన్నాను అతి ఎపాల జిటిక్‌గా నాకు కాఫీ ఎలా అడగడమో తెలీక. సీత కనిపించినా బావున్ను. "పిల్లలకి వేరే వున్నాయిలే. ఆ పాలు నీకే తాగు" అందావిడ ఏంవిటి! దగ్గిర్దగ్గిర లీటరు పాలు. నేను తాగాలా! పుట్లో తప్ప చస్తే పాలు తాగనే! అప్పుడైనా ఏడిచి మొత్తుకొని తర్వాత కాఫీ ఇస్తానన్న ప్రామిస్ తీసుకొని తాగేదాన్ని నాకేందారి! సమయానికి పిల్లలన్నా లేపలేదు. మా వారికి సగం ఇచ్చేస్తే. "వీళ్ళేరి సీతా!" అన్నాను. అలా తిరిగొస్తానని వెళ్ళేరండి. పరమ దొంగలు ఏ హోటలుకో పోయి కాఫీ తాగేస్తారు. నే నసలు కాఫీ తాగందే ఏపనీ చెయ్యలేను. కాఫీమాట దేవుడెరుగు. ముంద పాలుమాటేవిటి! మా కుక్కనైనా. తెచ్చేసుకాను. మొత్తానికి పాట ఘట్టం గడిచిందనిపించేను సగం తాగి మిగిలిన సగం గ్లాసు కడిగే మిషనూద బాత్‌రూమ్‌లో పారబోసేను అయినా యింకా తెల్లారలేదు. ఇప్పటినుంచీ ఏం చెయ్యడం! "స్నానం చేస్తారా!" అంది సీత నా ఆలోచనలు తెలిసినట్టు మా యింట్లో నా స్నానం పొద్దున్న పదిగంటలకే. ఈలోపున ప్రపంచం మునిగినా నేను మునగను. ఈ తెల్లవారుఝామున స్నానం బాధ పడలేకే నా పెళ్ళికి పురోహితుడ్ని బతిమాలి రాత్రి ముహూర్తం పెట్టించుకున్నాను. అలాంటిది ఈ తెల్లారుఝామున అరిచెయ్యి కనిపించని ఈ చీకట్లో, మంచుకికూడా నోరు తెరవలేని ఈ

వుడు ఆశ్చర్యపోయినట్టు ఆశ్చర్యపోతూ. "వేడి నీళ్ళు కాచరా!" నా కప్పుడే వంట్లో వణుకు ప్రారంభించింది. "లేదండీ మేమంతా ఎప్పుడూ చన్నీళ్లే చేస్తాం. చన్నీళ్ళే ఆరోగ్యంట. మా నాన్నగారు చెప్పేరు. అదిగో ఆ టబ్‌లో వున్నాయి" అని తలుపు చేరవేసి వెళ్ళిపోయింది ఆ పిల్ల. ఆ పిల్ల అలవాట్లు అన్నీ ఈ ప్రకారమే వుంటే గుమాస్తా గాడిని కట్టుకున్నా ఇల్లు ఇంద్రలోకం చేసేగలదు.

చీకటి బాత్ రూమ్‌లో నిలబడ్డాను చల్ల గచ్చుమీద! అరికాళ్ళు కన్నాలు పడిపోతూన్నట్టనిపించింది. శలవలూవద్దు. విశ్రాంతీ వద్దు మా యింటికి పారిపోతే! ఈ చలిలో మంచు లాంటి నీళ్లు స్నానవా! అసలు నేను మళ్ళీ స్నానం చేసి బతికి బట్టకడతానా! నా ఖర్మకొద్దీ జగన్నాధం భార్య ఊళ్లోలేదు. పురుటికని పుట్టింటికి వెళ్ళింది లేకపోతే ఆవిడ్ని బతిమాలి నామట్టుకు దొంగ చాటుగానైనా గిన్నెడు వేన్నీళ్లు పెట్టుంచుకొనేదాన్ని. ఏదైతే అదే అయిందని అరిచెయ్యి నీళ్ళల్లో పెట్టేను. ఎలక్ట్రిసిటీ షాక్‌లా కొట్టింది. తర్వాత నా అరిచెయ్యి ఉన్న ఫీలింగ్ పోయింది. అదేరోజు అక్కడ్నించి మకాం ఎత్తేకపోతే నా శవాన్నే ఆ ఊరునుంచి తీసుకెళ్లాల్సి వుంటుంది. వారంరోజులు ఉందామని వచ్చి అప్పుడే వెళ్ళిపోవడం ఎలా? పెద్ద కడుపునొప్పి వచ్చిందని పొద్దు ఎక్కగానే అబద్ధం ఆడితే. మా ఊరో, ఏ ఊరో డాక్టరు దగ్గరకి తీసుకువెళ్తారు. ఈ ఆశ రాగానే అంతవరకూ చచ్చిపోయిన అరిచెయ్యికి మళ్ళీ ప్రాణం వచ్చింది. కాని అంతలోనే వళ్ళంతా చచ్చిపోయినట్టయింది. రామారావుగారి తానే

వైద్యంచేస్తానంటే ! చూపుకి అచ్చు ఆయుర్వేద వైద్య డిలా ఉన్నాడుకూడా. అంత చీకట్లోనూ అతను నాకు గజం పొడువున్న ఆవఁదం గ్లాసుతోటీ తాటికాయంత లేహ్యం ముద్దలతోటీ కనిపించేడుం కాబట్టి కడుపునొప్పి సాకు వదులు కున్నాను. ప్రస్తుతం నేను చెయ్యవలసింది స్నానం. చెయ్య లేనిది స్నానం. అప్పుడు నేను చేసినపాపం చెప్పినాపోదు. ఆవేళ మొదట అక్కడున్న వారంరోజులూ నేను స్నానం చెయ్యలేదు. రోజూ బాత్ రూమ్‌లో కూర్చోవడం, మొహం కాళ్ళూ చేతులూ కడుక్కొని, నుటివిూద జుత్తు కొంచెం తడుపుకొని, పేస్ట్‌తో శుభ్రంగా పళ్లుతోముకొని, బట్టలు మార్చుకుని వచ్చేసేదాన్ని, ఈ రహస్యం మా వారికూడా చెప్పలేదు. వెక్కిరిస్తారనికాదు. నేను చేసినపని తెలిస్తే నన్ను నూతిదగ్గిరికి లాక్కెళ్ళి గేదెను కడిగినట్టు కడిగేస్తారు.

నా అనుమానం నిజమైంది. బాత్ రూమ్‌లోంచి బైట కొచ్చేనో లేదో రామారావుగారు అడిగేడు "ఆసనాలు ఏవైనా వేస్తావా ! పాలిచ్చేముందు గుర్తుచేయడం మరిచి పోయేను క్షమించు."

వేస్తానన్న అబద్ధం, వెయ్యనన్న నిజం చెప్పలేక "మా ఊళ్ళో స్కిప్పింగ్..." అని గొణిగేను.

"యూ మీన్ స్కిపింగ్ అన్నారు 'పి' వత్తకుండా ఈ ముసలాయనకి ప్రొనన్సియేషన్ పిచ్చొక టుందన్నమాట.

"స్కిపింగ్ మంచిదే కాని ఇవేవీ ఆసనాల సాటిరావు. స్వామి సహజానంద రాసిన పుస్తకం నా దగ్గిరుంది. నీకు

గిఫ్ట్‌గా ఇస్తాను. అది చదివి నువ్వు ఆశనాలు వెయ్యి. మీ ఆయనచేత వేయించు ఇంతకీ మీ ఆయన బొత్తిగా కొన్నిక్ కూడా మానేసినట్టున్నాడు." అని ఆగేరు. ఈ సహజానంద అనుకోని గండం.

వీట్లో కొట్టుకుపోతున్న వాడికి పాము చుట్టుకున్నట్టుంది నా పరిస్థితి.

"సహజానంద అంటే నీ కెవరో తెలిసినట్టు లేదు. అతగాడు చచ్చిపోయేక యిరవై రోజులవరకూ అతని శవం పువ్వులా ఉందిట."

"ఆ తర్వాత కాయైపోయిందా?" అడిగేద్దా మనుకున్నాను. ఇంతకీ నేను చచ్చిపోయేక నా శవాన్ని ఎవరూ దాచాలన్న కోరిక నాకు లేదు.

ఈ రామారావుతో వ్యవహారమంతా దొంగ యుద్ధంలావుంది. ఎప్పుడు ఎక్కడ కొడతారో తెలియదు.

"దైవ ప్రార్థన ఏమైనా అలవాటుందా?" అని అడుగుతా రనుకున్నాను. కాని మళ్ళీ నాదే తప్పు. "సీత స్నానంకూడా అయిపోయినట్టుంది. ఇద్దరూ వాకిట్లో ముగ్గులు పెట్టండి. కంటికీ, వంటికీ కూడా మంచిది. నెల గంట కూడా పట్టేరు." అని అతను అక్కణ్ణుంచి వెళ్ళి పోయేరు.

మరో విపత్తు. చిన్నప్పుడు పెట్టిన ముగ్గులు కిందటి జన్మలో పెట్టిన వాటిల్లా లీలగా గుర్తున్నాయి. వార పత్రి

కల్లో టేబుల్‌క్లాత్ మూలలకూ-ముగ్గులూ సెక్షన్ చూడడం ఆశ్చర్య చేసేను.

ఇంతలో సీత రెండు ముగ్గు డబ్బాలతో వచ్చింది. ఆ యింట్లో అన్నింటిలాగే అవికూడా పెనుసైజులో ఉన్నాయి. ఒకొక్కదానిలో మూడు వీశెల నూనె పడ్తుంది.

ఒక డబ్బా నా కిచ్చి "మిఠాయి పొట్లం మీ కొచ్చా?" అని అడిగింది. కొంచెం పరాగ్గా వున్నానో ఏమిటో ఆ అమ్మాయి అన్న విషయం నాకు అర్థంకాలేదు.

"పోనీ సీతమ్మవారి పాదమో?" అంది అప్పుడు అర్థం అయింది అవన్నీ ముగ్గుల పేర్లని.

నిజానికి నాకు వచ్చినది డైమన్ ముగ్గుతో సహా మూడు. వాళ్ళ వాకిట్లో మూడు. వాళ్ళ వాకిట్లో మూడు వందలమంది కన్నెపిల్లలకి ముగ్గుల స్కూలు పెట్టొచ్చు.

"నువ్వు పెట్టు. చూసి నేను పెడతాను." ఆ పిల్లకి పెళ్ళి కాలేదు. అసనాలువేసి, ఆవుపాలు తాగి మహా ఆరోగ్యంగా వుండేమో పిచ్చి పిల్లలాగ గెంతుతూ అవలీలగా రకరకాల ముగ్గులు పెడుతున్నాది. నేను ఆల్‌సో రేస్.

తెల్లారేవరకు ఒంగి ముగ్గులు పెడుతూనే వున్నాం. అదేం వాకిలోగాని అర ఎకరా ఉంది. ఎంతసేపు పెట్టినా తరగదే! అందుకే పల్లెటూరి వాళ్ళకి ఒళ్ళురాదు. కాని— అసలు ఒంగడవే అలవాటులేని, ముగ్గులయ్యాక, తిన్నగా నిల్చుందా మంటే నడుం పైకి లేవదే! ముగ్గుల గండం దాటేనో లేదో,

"సూర్యోదయం అయేక వేసిన పక్కవుంటే పరమ దరిద్రం" ఎప్పుడొచ్చేరోగాని- మా వెనక నిల్చున్న రామారావుగారు, భక్తిరంజని తారస్థాయిలో పెడతూ, వెంటనే వెళ్ళి పిల్లల్ని లేపమని మాకు పురమాయించేరు. అంత చిన్న వయసులోనే ఇంత బద్ధకం వుండకూడదనీ, తెల్లారుజామునే లేపి రోజూ ఏ దండీలో, బస్కీలో (ఆడపిల్లలచేతకూడా!) తీయించమనీ. ఇప్పుడుగనక వాళ్ళకు బద్ధకం బలిసిపోతే, మరి వాళ్ళనింక దేవుడుకూడా బాగుచెయ్యలేడనీ, ఎవడూ పెళ్ళి చేసుకోడనీ వగైరా సలహాలు ఇస్తూనే వున్నారు నేను మేడ ఎక్కుతున్నంతసేపూ.

ఏమిటిది? మేడా! సింహాచలం కొండా ఇన్ని మెట్లేవిటి అనిపించింది నా ప్రాణానికి. లేచి రెండు గంటలవైనే అయినా అరకప్పు కాఫీ అయినా కడుపులో పడలేదేమో కాళ్లు లొటలొట లాడిపోతున్నాయి. కళ్లుకూడా తేలిపోతున్నాయి. మెట్లు కదిలి పారిపోతున్నాయి. రేపటినుండి ఈ కాఫీ కేవైనా ఏర్పాటు చేసుకోకపోతే నా ప్రాణం ఇక్కడే హరీమంటుంది. సగంపాలు పారబోసినా, సగమైనా తాగేను కదా మరి యీ రసమేమిటి! పాలలో పోషక పదార్థాలే గాని, హుషారు లేదు కాబోలు ఎలాగైతేనేం అరగంట ప్రాణం కుదుటపడింది మేడెక్కేను.

ఇంటిదగ్గరైతే స్కూలు సైమైనా లేవని పిల్లలు అప్పుడే లేచినట్టున్నారు. ముసుగులోనే కబుర్లు చెప్పుకుంటున్నారు. అలా ముసుగుల్లో పడుకున్నవాళ్ళని చూడగానే

నాకు కోపమూ, అసూయా వచ్చేయి. "లేవండి, లేవండి పైవాళ్ళింటికి వచ్చినప్పుడైనా పెందరాళే లేవద్దా ! వాళ్ళేవనుకుంటారు ?" అన్నాను.

"ఆలశ్యంగా లేచేం అనుకుంటారు" అంది చిన్నది. అది తను అన్న ప్రతిమాటా జోకే అనుకుంటుంది వాళ్ళ నాన్నలాగ.

"అయ్యో పాపం. పసిపిల్లవమ్మా ఇన్నాళ్ళూ చదివి, ఎంత అలసిపోయేరో, ఒళ్ళు తెలీకుండా పడుకున్నారు అని కూడా అనుకోవచ్చు" అంది పెద్దది.

"పైవాళ్ళింటికెళ్తే స్కూలుండదు. లేవడానికి స్కూలుండదు" అంది రెండోది. మళ్ళీ దానికి ఆర్నెల్లకే తిట్లతోసహా అన్ని మాటలూ వచ్చేసేయి.

ఇదే మా ఇంటిదగ్గరైతే వాళ్ళ మాటలకి నవ్వేసి వెళ్ళిపోయేవాన్ని. కాని ఇప్పుడు "అశక్తి దుర్జనత్వం" అని నీరసంమీద కోపం వచ్చేసింది. వెంటనే వాళ్ళ ముసుగులు లాగేసి "బావుంది. బావుంది. లేవండి. ఆడపిల్లలకంత నిద్రదేవిటి ! వాళ్ళకి బుద్ధి లేకపోతే వాళ్ళమ్మైనా వుండొద్దా అంటారు" అంటూ వాళ్ళ రెక్కలు పుచ్చుకొని లేవదీశేను.

"మా మాటెప్పుడూ వినపలేదు కాని నీకు లేదంటారు నాన్న" అంది చిన్నది.

వాళ్ళని లేవదీశేనేగాని వెంటనే కింద వేపపుల్లల

తతంగం జ్ఞాపకం వచ్చింది. వీళ్ళని వాటి బారినుండి రక్షించక పోతే వీళ్ళు ఆ ముసలాయనతో వాదన పెట్టుకుంటారు. మేడంతా వెతికాను ఎక్కడైనా నీళ్ళున్నాయేమోనని. రాత్రి తాగడానికి పెట్టిన కూజాలో నీళ్ళు కాక యింక చుక్క కూడా లేవు గుంట లిద్దర్నీ రెక్కపట్టి ఈడ్చుకెళ్ళి డాబామీదే ఆ నీళ్లే సర్ది మొహాలు కడిగించేశేను.

"కిందకెళ్ళి కొంచెం వేణ్నీళ్లు పట్రా నువ్వు మంచి అమ్మవిట" పెద్దది బులావు లేసింది.

"అబ్బా. యింత చన్నీళ్లెలా కడుక్కోవాలి బాబూ పళ్ళు సైపు కొట్టేస్తూంటేను" చిన్నది గుణిసింది.

"సైపూ లేదు. పాట్టహేండూ లేదు. నోరు మూసుకొని కడగండి. నీలాంటి వాడేనట ఇంట్లో పెళ్ళాం లేకపోతే ఒసే అని పిల్చేడుట. వేణ్నీళ్లే లేకపోతే తేవడం ఏవిటి? గబ గబా కానిచ్చి కిందికి పదండి. పాలుతాగుదురు గాని" అంటూ పక్కలన్నీ ఎత్తేశేను. అతనుగాని సైకొచ్చి మా పక్కలవల్లే దరిద్రం వస్తుందంటాడేమోనన్న భయంతో. పిల్లలికి కాఫీ అలవాటు చెయ్యనందుకు నన్ను నేనే అభినందించుకున్నాను.

మేము కిందకి వెళ్ళేసరికి రామారావుగారు కాంపోజిషను పుస్తకాలు కాబోలు దిద్దుకుంటున్నారు. అతని కంట పడితే వాళ్ళని కూడా వెంటనే స్నానం చెయ్యమంటారేమోనని భయంవేసి, వంటింట్లోకి వెళ్ళమని సంజ్ఞ చేసేను పిల్లలకి. నా సంజ్ఞలు ఎప్పుడు పాటించాలో ఎప్పుడు అక్కర్లేదో

మా వెధవలకి బాగా తెలుసు. సీత ఎక్కడుందో తెలిస్తే బావుంటుంది. మావారి జాడేలేదు. "సీత ఎక్కడుందో" నాలో నేను అనుకుంటున్నట్టు గొణిగేను.

"సీతా! వస్తుంది. అలా కూర్చోమ్మా పరవాలేదు. మా కోడలెంతో నువ్వూ అంతే నాకు. సీత పెరట్లో కూరలు కోస్తోంది. అప్పటి కప్పుడు కోసిన కూరల్లో విటమిన్లు ఎక్కువగా ఉంటాయి కదా ఫ్రెష్‌గా వుంటుంది. మీకేం వుంది పట్టణాల్లో వారం క్రితం కోసినవి యివేళ తింటారు. అవి తిన్నా ఒకటే. తినకపోయినా ఒకటే."

"ఈసారి నుంచి తినడం మానేస్తాలెండి" అనలేదు నేను. నాకు విపరీతంగా నిద్ర వచ్చేస్తోంది - మా ఇంట్లో ఎప్పుడైనా తెల్లారు జామున లేవ్వాలసి వస్తే, అసలు మేమా రాత్రి పడుకోం. కబుర్లు చెప్పుకుంటూనో, చదువుకుంటూనో, అధమం దెబ్బలాడుకుంటూనో మేలుకొనే వుంటాం. పొద్దున ఆరులోపల గాని లేస్తే యింక ఆ వేళంతా డబుల్ ఫ్రైఫాయిడ్ వచ్చినంత నీరసంగా వుంటుంది. అంచేత నేను నిల్చునే నిద్రపోతానేమో నన్న భయంతో కుర్చీలో చతికిలబడ్డాను. పెద్దాయన ముందు కూర్చోవడం ఎందుకులే అన్న పెద్దరికాన్ని నా నీరసం జయించేసింది. రామారావుగారు భక్తి రంజని, పాలు పనులు వింటూనే కాంపోజీషన్లు దిద్దుకుంటున్నారు. ఈయనకీ మా పెద్దమ్మాయిలా రేడియో, బేగ్‌గ్రౌండు మ్యూజిక్‌లా వుండాలి కాబోలు. ఎటొచ్చీ మా

అమ్మాయి - ఏ శ్రీలంక బ్రాడ్ కాస్టింగ్ కార్పరేషన్ కా వ్యాపార విభాగ్ హై - వింటుంది - ఇతను - ఆకాశవాణి. విజయవాడ - వింటున్నారు.

"వీది వీళ్ళింకా రాలేదా?" అన్నారు మావారూ, జగన్నాధాల నుద్దేశించి.

"వచ్చినట్టు లేదు" వరండాలోకి చలిగాలి ఝుయ్ మని వేసేస్తోందేమో - వేపగాలి పీలిస్తే వెయ్యేళ్ళు బతుకు తారట. అంచేత వాకలంతా వేపతోట వేయించేరు. నా కసలు నోట్లోంచి మాట రావడంలేదు. గమకం తప్ప.

"వచ్చి వుండర్లే నేను మా వాడికి ఎంత కష్టపడి మప్పేననుకున్నావ్ యీ మార్నింగ్ వాక్. ఈ వయసులో గనుక రెగ్యులర్ గా తెల్లారు జామున కనీసం మూడు మైళ్ళు నడిస్తే యింక వాడి శరీరం ఇనుమే. డయబెటిస్ రమ్మన్నా రాదు. తుమ్మనైనా తుమ్మడు. అఫ్ కోర్సు మీ ఆయన యిక్కడున్నన్నాళ్ళూ వెళ్ళే వాడనుకో. ఇప్పుడా అలవాటు తప్పినట్టుంది. మళ్ళీ కల్టివేట్ చేయించు. నువ్వు కూడా వెళ్ళినా తప్పు లేదనుకో. కాని ఆడవాళ్ళకి ఇంట్లో పన్లుంటాయేమో!" పుస్తకాలు దిద్దుతూ, రేడియో వింటూ నాతో మాట్లాడుతున్నారు. ఇతనికి అష్టావధానం అతి ఈజీ.

ఏం మాట్లాడాలో తోచక "ఊ" కొడ్తున్నాను కథ వింటున్నట్టు. ఇంతలో జగన్నాధం, మావారు దేవుడిలా ప్రత్యక్షమయ్యేరు - అందుకేనేమో మొగుడ్ని పతిదేవు డంటారు.

'మీ మార్నింగ్ వాక్ అర్థం నాకు తెలుసులే' అన్నట్టు చూశేను వాళ్ళ వేపు - హోటల్లో అరగంటకోసారి కాఫీ తాగటం సిగరెట్లు కాల్చుకోవడం, ఎప్పుడు విసుగొస్తే అప్పుడు లేచిరావడం - యింతే కదా.

"రేపటి నుండి నన్నూ తీసికెళ్ళండి మీతో. నాకూ ఈ మధ్య ఒళ్లు తెగ వచ్చేస్తోంది" అన్నాను మా వారితో. నవ్వకుండా వుండటానికి విశ్వ ప్రయత్నం చేస్తూ.

"అవున్రా అబ్బాయ్. పాపం అమ్మాయిని కూడా తీసికెళ్ళండి రేపటి నుంచి" ఆర్డరు వేశేరు రామారావుగారు. పాపం తన పాఠం అంతవేగం నా నెత్తి కెక్కినందుకు సంతోషిస్తూ.

మావారూ, జగన్నాధం మొహాలు చూసుకున్నారు. తరవాత నా వేపు కోపంగా చూశేరు. ఆడదాని నవ్వు- అసహ్యంగా వున్న మొగాడ్ని ఎంత రెచ్చగొడుతుందో నా కప్పుడే అర్థం అయింది. అయినా మావారి ప్రెసెన్స్ ఆఫ్ మైండ్ చెప్పుకోతగ్గది. వెంటనే "ఆ చీకట్లో ఆడదానివి నువ్వు రావడమేంటి! పైగా నీకు కుక్కపిల్లల చలి. నువ్వేం నడుస్తావు యీ చలిలో!" అన్నారు.

"ఓ యస్ అలాగే తీసికెళ్తాం రా" అనేస్తారేమో నని భయపడి చస్తోన్న నాకు ఆ మాటతో ధైర్యం, విళ్ళనో పట్టు పట్టాలన్న సరదా కూడా కలిగేయి. ఎదో వాళని ఏడిపిద్దాంవని అన్నానే గాని. నిజంగా నేను చలిలో బైట అడుగు పెట్టగలనా! అరగజం దూరం నడవగలనా!

"ఆఁ! సింగినాదం. చీకటేఁవిఁటి! మీకు లేని చీకటి నాకేనేఁవిఁటి! అంతగా అయితే టార్చ్ తీసికెళ్దాం. ఇంత సేపూ ముగ్గులు పెట్టలేదూ! అప్పుడు లేని చలి నడవడాని కుంటుందా!" రెచ్చ గొట్టేను.

జగన్నాధం నా మాటల్లోని అల్లరి పసికట్టినట్టున్నాడు. "రేపటి సంగతి కదా తరవాత చూసుకుం..." అతను మాట పూర్తి చేశేలోగా వంటింట్లోంచి "ధాం" అన్న పెద్ద చప్పుడూ, మా అమ్మాయి కెవ్వుమన్న కేకా వరసగా వినిపించేయి. అందరికంటె ముందు పరిగెత్తింది నేనే. వంటిల్లంతా పాల సముద్రంలా ఉంది. మధ్యలో పాము మీద విష్ణుమూర్తిలా చిన్నది పీటెక్కి నిల్చుంది చేతో పాల గ్లాసు పట్టుకొని. పెద్దదాని కాళ్ళ దగ్గిర పాలగ్లాసు పడుంది. దాని కాలు బొటన వేలు చితికి రక్తం పాలతో కలిసి పారుతోంది. అది వీడవడం కూడా మరిచి పోయినంత బెదిరిపోయింది.

"మరి అక్కేమో పాలు తాగుదావఁని గ్లాసు తీసింది. చెయ్యి చురికిందిట గబుక్కున ఎత్తేసింది గ్లాసు" చిన్నది సంజాయిషీ చెప్పుకుంది.

ఎత్తేక ఏం చేస్తుంది! పాలు లీటరు బరువూ, గ్లాసు వీశడు బరువూను. మా ఇంట్లో కప్పుల్తో తప్ప తాగరు పిల్లలు.

మమ్మల్నందర్నీ చూసేక దానికి ఒంటిమీదకి తెలివి వచ్చినట్టుంది. అప్పుడు లంకించుకుంది ఏడుపు. దాన్ని

ఓదార్చి, కాలు కడిగి డాక్టరు దగ్గరికి మోసుకు పోయేరు మా వారు. జగన్నాధం. నాకేవీటో మనసంతా చికాగ్గా అయిపోయింది.ఏదో సరదాగా నాలుగు రోజులు గడిపి పోదా వఁని వస్తే నిష్కేపం లాంటి పిల్ల కాలు పచ్చడై పోయింది.

"అంతేనమ్మా. మన చేతిలో ఏం లేదు. ఏ క్షణాన ఏం జరుగుతుఁదో చెప్పలేం కదా! పిల్ల పాపం లేచిన వేళ ఎలాటిదో కాని ఎంత దెబ్బ తగిలింది? ఎవరి మొహం చూసిందో కాని" అని జగన్నాధం తల్లి జాలిపడి తరవాత "నీ కింకో చిన్న గ్లాసుతో యిస్తారా పాపా" అని మా చిన్న దాన్ని తీసుకొని పోయేరు. ఆవిడదీ ఆడ మనసే కదా!

వెంటనే మా వెనకనే వున్న రామారావుగారు "అసలైనా యీ కాలం పిల్లలకి అతి సున్నితం, మహా సున్నిత మూను. గ్లాసెత్తి పాలు తాగలేకపోతే ఇంక వీళ్లేం సంసారాలు చేస్తారు? మా చిన్నప్పుడు ఆ వయసుకి చెరువునుండి గంగాళం అంత బిందెల్తో నీళ్ళు మోసేవారం ..." అని ప్రారంభించేరు.

బిందెల్తో నీళ్లు మొయ్యడం వేరు. బిందెతో పాలు తాగడం వేరు అని ఆయనకు తెలీదు. ఆ తరవాత డాక్టరు దగ్గర కెళ్ళిన వాళ్ళు రావడం, పిల్లలకి స్నానాలు, తిలదువ్వడాలూ వగైరాలయ్యే సరికి దగ్గర దగ్గర పదెండి. నేనూ, సీతా చింతపిక్క లాడుతున్నాం. మా ఇంట్లో అయితే 9-30 వరకూ కాఫీ తాగుతూనే వుంటాం. పదయ్యేసరికి భోజనాలు చేసేస్తాం. భోజనం గాని పదిదాటి పది నిమిషాలు ఆలశ్యం

అయితే మా వారికి తలనొప్పి. నాకు గుండెల్లో మంటా. పిల లకి శోపా వచ్చేస్తాయి.

"అమ్మా, పడైపోయింది. అన్నం తినేద్దావాఁ?" అంది పెద్దది ఉత్సాహంగా చింతపిక్కలు లెక్క పెడ్తూ. అది భోజనానికి ఒక నిమషం వుండనూలేదు ఒక మెతుకు ఎక్కువ తిననూ లేదు.

"అయిపోయింది. పాపా! ఒక్క ఐదు నిమషాలు బియ్యం కడిగి పడేశాను. సీతా, కూరలు తరిగిచ్చే తల్లీ. పిల్లలు అకలంటున్నారు పాపం..." అని కేకేశారు జగన్నాధం అమ్మగారు. వంట ఏ దశలో ఉందో మాకు అర్థం అయిపోయింది. పది గంటలకు అన్నం తినకపోతే యింక తర్వాత మాకు పంచ భక్ష్య పరమాన్నాలు పెట్టినా అక్క ర్లేదు. కాని చేసేదేం లేదు కనుక నేనూ, మావారూ, జగన్నాధం కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నాం. పిల్లలూ, సీతా వాకిట్లో కాస్సేపు తిరిగేక పిల్లల్ని సీత దగ్గర ముగ్గులు నేర్చుకో మన్నాను మళ్ళీ అన్నం అంటారేమోనని భయంతో.

"వంటై పోయింది. పీటలూ, కంచాలూ పెట్టు సీతా. పాపం. పిల్లలు ఝూమై అకలంటున్నారు" అన్న కేకతో మాకు పోయిన ప్రాణాలు తిరిగి రావడం, పన్నెండు కొట్టడం ఒక్కసారి జరిగేయి. ఊరికే కూర్చుని తింటే ఏం బావుంటుం దని నేనూ సాయం చేద్దామని వంటింట్లోకి వెళ్ళేను. మా ఇంట్లో వంట నిల్చునే చేస్తాను. వడ్డన నిల్చునే. ఏ పని

వంగి చెయ్యలేను. కుర్చీలో తప్ప నేలని గాని కూర్చున్నా నంటే అయిదు నిముషాలయేక నా కాళ్లు ఎక్కడున్నాయో వెదుక్కోవాలి. అంత తిమ్మిరెక్కి పోతాయి.

సీత చకచకా ఒంగొని పీటలూ, కంచాలూ, మంచి నీళ్ళూ పెట్టేస్తోంది. సాయం చేద్దామన్న సత్సంకల్పమే గాని చేసే ఓపిక లేని నేను (నీరసంగా) నవ్వేను సాయం చెయ్యనా అన్నట్టు. నవ్వుదా మనుకున్నాను కాని అలా నవ్వలేక పోయాను. ఓపిక పోయింది. "ముందు పిల్లలికి పెట్టు తరవాత మేం మగాళ్ళం తింటాం." అన్న జగన్నాధం కేక వినగానే అతన్ని నేను కూనీ చెయ్యక పోవడానికి కారణం నా నీరసమే.

"ఎందుకు లేమ్మా. అందరూ ఒక్కసారే తినండి. నేను వడ్డిస్తాలే. సీతా, నువ్వూ కూడా కూర్చోండి." అప ద్బాంధవుడిలా అన్నారు జగన్నాధం అమ్మగారు. ఆవిడ అత్త కడుపు చల్లగా, అమ్మ కడుపు చల్లగా!

నాకూ మావారికీ అవసరమైతే పీటలమీద కూర్చుని తినే అలవాటుంది. కాని పిల్లలకి పుట్టిన దగ్గిర్నుంచి టేబిల్ మీల్స్ అలవాటై పోయింది. వాళ్ళని ఆ పీటల మీద కూర్చోపెట్టడానికి యజ్ఞంచేసినంత పనైంది. ఎలాగో నాకు చెరోపక్క కూర్చోపెట్టుకున్నాను ఇద్దర్నీ.

"చేతికి నోటికీ ఇంత దూరమైతే ఎలా అమ్మా?" నెమ్మదిగా గొణిగింది చిన్నది. "ఫరవాలేదు. తల కొంచెం

వంచు. సగందూరం తగ్గుతుంది." పెద్దది సలహా యిచ్చింది. నా వీపు వెనక ఇద్దరూ గుడగుడ లాడుతున్నారు.

ఎలాగైతేనేం పడ్డన పూర్తయింది. "భోం చెయ్యండ్రా. ఇప్పటికే లేటయ్యింది" హెచ్చరించేరు ఆవిడ.

ఏం చెయ్యను? నా పిండాకూడు! అన్నీ ఏవిటో నల్లనల్లగా, ఆకు పచ్చగానూ వున్నాయి. వాళ్ళ ఇట్లో ఏ పప్పుకూ పొట్టు తియ్యరుట విటమిన్‌లు పోతాయని. బియ్యం కూడా స్వంత గోళ్ళ తోను దంపేస్తారుట!

"ముందు ఒక్క కడిలో ఉసిరి పచ్చడి తినండి కొంచెం నెయ్యి వేసుకొని. మొదటి ముద్ద ఉసిరిపచ్చడి తింటే రోజూ, విటమిను 'సి' డెఫిషియన్సీ అసలు రమ్మన్నా రాదు. మన వాళ్ళు అవసరమైనవి తినడం మానేసి తరవాత మందులు మింగుతారు." ఆరోగ్య పాఠం మొదలైంది.

ఓహో అ నల్లముద్ద ఏమిటా అనుకున్నాను. ఉసిరి పచ్చడన్నమాట.

"... రోజూ ఆకు కూరలు విధిగా తింటే వందేళ్ళ గ్యారంటీగా బతకొచ్చు. అసలు మనం బతికేది రెగ్యులర్ బిట్స్‌మీదా, తినే తిండిమీదే కదూ ఆధారపడుతుంది? తినేది ఆరోగ్యమైనది ఔనా కాదా అని చూడాలి. ఆ తినే దేదో టంచన్‌గా పైముకి తినాలి. ఆకు కూరలూ, పాలూ, పళ్ళూ రోజూ ఎంత ఎక్కువ తీసుకుంటే అంత మంచిది. కారం ఎంత తగ్గిస్తే అంత మంచిది. అన్నం తక్కువా, కూరలు ఎక్కువా తినాలి. నేను చెప్పిన పద్ధతి ఫాలో

అవండీ. ఐ విల్ గ్యారంటీ యు ఎ హండ్రడ్ హియర్స్ నూకేళ్లు ఎందుకు బతకరో నేను చూస్తాను..." పాఠం కంటిన్యూ అవుతూనే వుంది.

చుక్కకూర పప్పూ, బచ్చలి పులుసూ, గోంగూర పచ్చడీ, దేంట్లోనూ అసలు మిరపకాయ ముక్కైనా కని పించలేదు. దిష్టితీసి పోసి వుంటారు. అన్నీ ఉప్ప ఉప్పగా, పసరు పసరుగా వున్నాయి. మావారు స్నేహితులు విషం ఇచ్చినా, విసీక్ ఇచ్చినా అమృతంలా గడగడా తాగేస్తారు. మధ్యలో "ఈ పప్పు ఎలా చేసేరో కనుక్కో. ఈ ఉసిరి పచ్చడి ఎలా పెట్టేరో అడుగు" అని నాతో అంటూ వంటని తెగ మెచ్చుకుంటున్నారు. ఎటొచ్చీ అన్నిటి దగ్గరా తగని పమను నాకే. ఏదీ గొంతుక దిగడంలేదు. కలపడం పక్కన పెట్టడం. ఆరోగ్యసూత్రాలు దేవుడెరుగుగాని ఈ తిండి తినడానికా వంద వేళ్ళు బతకడం.

వడ్డించి ఐదు నిముషాలు అయినా పిల్లలు ఏదీ ముట్ట లేదు.

"ఏం కావాలి తల్లీ మీకు?" అని ఆప్యాయంగా అడిగేరు జగన్నాధం తల్లిగారు.

దసరా పద్యాలు పాడేవాళ్ళలా ఒక్కసారి ఇద్దరూ "అన్నం" అన్నారు.

నాకు తల కొట్టేసినట్టనిపించింది.

"అదీ అన్నమేనమ్మా" అన్నారు జగన్నాధం అమ్మగారు.

"ఏదీ! ఇదా!" అంది పెద్దది. పప్పు చూపిస్తూ.

"మా ఇంట్లో అబద్దాలాడం"అంది రెండోది. తెలివికీ, ధారాళానికీ వాళ్ళ తండ్రికి వారసురాలనని దాని నమ్మకం.

ఆ ఎర్రముద్ద అన్నమేనని వాళ్ళని నమ్మించడానికి ఉపక్రమించేను. ఇక్కడ బియ్యం దంపించుకుంటారని బోధ పరచేను.

"ఎందుకూ అంది" మా రెండోది.

"మనింట్లో రుబ్బుకుంటామా!" అడిగింది పెద్దది.

ఎవరూ చూడకుండా ఒక తొంటిపిక్క పెట్టి "అలా చేస్తేనే ఆరోగ్యం" అని అన్నాను.

తొంటిపిక్క పని చేసింది. పిల్లలు భోజనానికి ఉపక్రమించేరు—

"అదీ. పిల్లలకి అలా ప్రతీది భోధపరచాలి" అని రామారావుగారు మెచ్చుకున్నారు నన్ను.

కడుపునిండా మజ్జిగా అన్నం తినేద్దా మనుకున్నాను. ఆ మజ్జిగ చూసేక యింక బతకలేనన్న నిర్ధారణ కొచ్చేశాను. గిన్నెలో ఏముందో కనిపించలేదు. పైనంతా కొత్త మిరి ముక్కలూ, కరివేపాకు ముక్కలూ, పచ్చిమిరప,

అల్లం, శొంఠి చెక్క తేల్తున్నాది. నోట్లో పెట్టుకుంటే సాయంత్రం లోపల ఎవర్నో ఒకర్ని కరిచేయడం ఖాయం. అంత పుల్లగా ఉంది. మజ్జిగ పులుపు, నిమ్మకాయ పులుపు పోనీ పాలు లేవేమో, మజ్జిగ సర్దలేదు అనుకుంటే తప్పకుండా క్షమించవచ్చు. కాని ఒక్కొక్కరు శేరు పాలు తాగుతున్నారు! ఇదీ ఆరోగ్య సూత్రమే అయి ఉండాలి.

మజ్జిగ దగ్గిరకి వచ్చేసరికి రామారావుగారు ఏదో శ్లోకం చదివేరు. "భోజనకాలే...నారాయణస్మృతి" అనుకున్నాను. నన్ను అలా అనుకొని సంతుష్టి పడనివ్వకుండా ఆ శ్లోకానికి అర్థం చెప్పేరు. ఆ శ్లోకంలో మజ్జిగలో వెయ్యవలసిన సామాన్లలిస్టు ఉంది. ఆ సామాన్లలో సగం నేనెప్పుడూ వినలేదు. అవన్నీ వేసిన మజ్జిగ బ్రహ్మకి కూడా దొరకదట. శ్లోకం మళ్ళీ చదవమన్నారు మావారు. శ్లోకం చదవటమే కాకుండా "నీకు సంస్కృతం వచ్చును కదటోయ్. తర్వాత రాసి ఇస్తాన్లే" అని రామారావు హామీ ఇచ్చేరు. మా ఆయన హిపక్రసీ చూస్తే నాకు వళ్లు మండిపోతోంది.

"మజ్జిగలో యివన్నీ వేసుకుంటే అందులో వున్న దోషం పోతుంది" సందేహ నివృత్తి చేశేరాయన.

ఇలా వేసుకుంటే నేనే పోతాను. రోగి పోతే రోగమే లేదు.

భగవాన్! ఈ ప్రకారం వారం రోజులు!!! ఇదేదో ప్రకృతి చికిత్సాలయంలో వున్నట్టుంది కాని శల వల్లో సరదాగా వున్నట్టు లేదు, ఈ ప్రకారం రాత్రికూడా

తింటే కేటినుండి మా వారు పన్నెత్తుకొని మేడ ఎక్కించి దింపాల్సిందే - నాకు శక్తి వుండదు. దీనికేదో యాంటీడోట్ చూసుకోవాలి! పైగా మజ్జిగ అన్నంలో అరగజం పొడవు అరటిపండు తినమని వేసేరు. నేనసలు దేవుడి ప్రసాదమైనా సరే అరటిపండు తినను. పైగా నీళ్ళ మజ్జిగా అన్నం ఓ ఆవకాయ ముక్కైనా లేకపోతే దిగదు. సిగ్గేవిటి? అడిగేసేను. "మీరు ఏ రకం ఆవకాయ పెట్టుకుంటారు?" అని ఏ రకం వున్నా వెయ్యండి అని అర్థం వచ్చేటట్టు.

"ఆవకాయలు తినే మీరంతా ఇలా తయారవుతున్నారు. అంతంత కారం తింటే పేగులు కురుపులై పోతాయి. దాంతో హైపర్ ఏసిడిటీ. గేస్ట్రిక్ కంప్లైయింట్సు వగైరాలు వస్తాయి. మా ఇంట్లో ఆవకాయ సంబంధం అసలు పెట్టనివ్వను" పాఠం మళ్ళా మొదలైంది.

ఆవకాయ ఆశకూడా పోయింది. ఏదో ఒకటి తినక పోతే పీకమీదనుంచి ఎవరైనా లేవదియ్యాలి. అంచేత కళ్లు మూసుకొని పురుట్లో మా అమ్మమ్మ పెట్టిన శొంఠిగుండ అన్నం ఎలా మింగేనో - అలా మింగేను నోటికి రుచి తెలీనంత గబగబా. పొద్దున తాగిన పాలు ఇంకా గొంతుకలోనే వున్నాయి. పోన్లే ఈ మజ్జిగతో కలిపి తోడుకుపోతాయి అనుకున్నాను. ఎలాగైతేనేం అన్నంయజ్ఞం పూర్తి అయింది.

పిల్లలు మేడమీదికి పోయేరు. పెద్దవాళ్ళం అందరం ముందు హాల్లో కూర్చున్నాం చాపలు వేసుకొని. పొద్దుటినుంచి తిండి సరిగా లేదు - తెల్లారకుండా లేవడం నిన్నంతా

ప్రయాణం - ఇవన్నీ కలిపి నా మొహం పీక్కుపోయింది. గోడకి నడుం చేరవేసేను. రామారావుగారు మాత్రం హాలు మధ్య మఠం వేసుకొని గుళ్లోలింగంలా కూర్చున్నారు.

"అమ్మాయి మొహం వాడినట్లు నీరసంగా వుండేఁ విఁటి? అన్నంకూడా సరిగ్గా తినలేదు. మనిషి వాడినట్లు కని పిస్తోంది. కొడుకు గాని పుడతాడేమిటి అమ్మాయి?" జగన్నాధం అమ్మ నవ్వుతూ అని మావారివేపు చూసేరు. మావారు "అదేమో బాబూ-నాకేం-తెలీదు" చూపొకటి నామీద విసిరేరు.

సిగ్గులేకపోతే సరి. నా సంగతి తెలిసుండే వేళాకోళం. వెకిలితనవూను.

"నా కొడుకు సంగతి దేవుడెరుగు! ఇంకా ఇలాగే ఉంటే నేను మావారి రెండో పెళ్ళానికి కొడుకై పుట్టేస్తాను" అనుకున్నాను.

ఇంతలో ఒక పెద్ద తమలపాకులు "పాందాన్" డబ్బాతో వక్కపొడీ, సున్నం వగైరా తెచ్చి మా ముందు పెట్టింది సీత.

"తాంబూలం వేసుకొండర్రా" జగన్నాధం ఆకులు తీసుకుంటూ అన్నాడు.

"నాకసలు అలవాటులేదు" బితుగ్గా అన్నాను. వక్క పొడి తీసుకుంటూ.

"పోనీ ఇప్పుడు చేసుకో, అన్నం అరగడానికి తాం

బూలం వేసుకొనితీరాలి విధిగా. మన పూర్వులు కర్పూర తాంబూలం వగైరాలు వేసుకునేవారు. మనకే వుంది? మామూలు తాంబూలమే. అయినా జీర్ణశక్తి...” రామా రావుగారి పాఠం వారపత్రిక సీరియల్ లాంటిది.

అసలు నేనేమైనా తింటేగదా జీర్ణం అవడానికి. ఆకులు వేసుకుంటే గొంతుకలో పట్టేస్తుంది నాకు.

“మా అవిడకి మంచి అన్నమేదీ సహించదులెండి. వక్కపొడి మాత్రం నవుల్తుంది” అన్నారు మావారు. ఈయన్ని చంపేస్తే వేవఁన్నా పాపంవుందా!

“చూడమ్మాయ్ వేసుకుంటే ఆకులతో కలిపి వేసుకో. అంతేగాని ఒట్టి వక్కపొడి వేసుకుంటే రక్తం విరిగిపోయి పాండురోగం పట్టుకుంటుంది”- నవుల్తున్న వక్కపొడి ఉమ్మేయ్యాలో, మింగెయ్యాలో తెలీలేదు నాకు-పట్టుకుందంటే.... అలా పాఠం చెపూనే అప్పటికప్పుడు మేకలా అరకట్ట ఆకులు నవిఁలేశేరు రామారావుగారు. వక్కపొడి ఎక్కువైందని ఆకులూ, ఆకులెక్కువైయ్యేయని సున్నపుముద్దా, ఈ రెండూ ఎక్కువయ్యేయని మళ్ళీ వక్కపొడీ, యిలా నవులుతూనే వున్నారు. నేనసలే నీరసంమీద వున్నానేమో - వాళ్ళు మాట్లాడతున్నా చాపమీదే నడుం వాల్చి అలా నిద్దర పోయేను. బహుశా నాకు నిజంగానే కొడుకు పుడతాడను కున్నారేమో ఊరుకున్నారుగాని లేకపోతే “అన్నం తినగానే నిద్ర పరమదరిద్రం” అని రామారావుగారు నన్ను లేపేసి వుందురు.

నాకా నిద్రలో - గంగాళాల్లో కాఫీ, జాడీల్లో అవ కాయ కనిపించేయి. నేను మళ్ళా నిద్రలేచేసరికి సాయంత్రం ఐదు కావస్తోంది. అసలు నా అంతట నేను లేవలేదు. "ఎవరో ఫ్రెండ్ను దగ్గరికి వస్తావని చెప్పేను. లే. లే. వేగం తయారవు" అని మావారే లేపేసేరు. అసలు నా కెక్కడికీ కదలాలనిలేదు. మా ఊళ్లో అది కాఫీస్టైము. అర్జంటుగా అరకప్పైనా కాఫీ పడకపోతే లాభంలేదు. ఆ మాటే మా వారితో అన్నాను. ఆయని అప్పుడు మంచివారే పాపం. "తోవలో హోటల్లో తాగుదాంలే రా" అన్నారు తాగినా తాగకపోయినా. తాగుతానన్న హుషారు నన్ను పావు గంటలో తయారయ్యేట్టు చేసింది. పిల్లలిద్దరూ సీత దగ్గర ముగ్గులు నేర్చుకుంటావన్నారు. బతికేం అనుకున్నాను - ఇప్పుడు వాళ్ళని రెడీచేస్తూ కూర్చుంటే కాఫీకి ఆలస్యం అవు తుంది. కడుపున పుట్టిన వాళ్ళే బరువై పోవడం అంటే యిదే కాబోలు !

ఆ సాయంత్రం ఐదున్నరకి నేనూ, మావారూ స్నేహి తుల ఇంటికి బయల్దేరేం. తోవలో ఆ పల్లెటూళ్లో ఉన్న ఒకే ఒక పాక హోటేలుకి వెళ్లేం కాని తానొకటి తలుస్తే హోటలు వాడొకటి చేస్తాడు కాబోలు - అది పల్లె టూరవడం వల్ల సాయంత్రం పాలు ఆరు దాటితేగాని తియ్యగుట. ఆవేళ పొద్దునపాలు ఇందాకనే విరిగిపోయా యిట. "అంచేత ఆరు దాటేక రండి బాబూ మాంచి కేఫీ ఇస్తాను" అన్నాడు హోటలువాడు. అప్పటివరకు బతికుంటే వస్తాంలే అనుకుంటూ ఉసూరుమంటూ ఫ్రెండింటికి వెళ్ళేం.

వాళ్ళతో మాటాడుతున్నానేగాని ఏం మాటాడుతున్నానో తెలియడంలేదు. అస్తమానం వాచీ చూస్తున్నాను. ఆరెప్పు డవుతుందా అని. పావుగంటయింది. ఇంతలో ఆ బ్రాహ్మండు భార్య కప్పుల్తో కాఫీ తెచ్చింది. నా సంతోషం వేమని వర్ణించను? అది అనుభవించాలే గాని చెప్ప నలవికాదు. పొద్దుటినుంచి ఉన్న నీరసం ఏమైందో పరమ హుషారొచ్చేసింది! "ఏవండేవండీ! మరొక కప్పు కాఫీ ఇవ్వరా" అనిలడగాలనిపించింది.

తిరిగి వచ్చేటప్పుడు ఒక చిన్న (ఇన్‌స్టాంట్ కాఫీ) టిన్నూ, ఒక ప్లాస్కూ, ఒక సంచీ ఆ స్నేహితుడి దగ్గర మా వారే పుచ్చుకుని. సంచిలో ప్లాస్కూ, టిన్నూ పెట్టి ఇంటికి తెచ్చి మేడమీద మా గదిలో మా వారే పెట్టి ఎవ్వరికీ తెలియనివ్వకు అని వార్నింగిచ్చేరు. ఆ తర్వాత అక్కడున్న వాళ్ళూ పొద్దున్నే వాళ్ళిచ్చిన పాలు తీసుకొని, పిల్లల్ని లేపుతానన్న మిషతో మేడ మీదకు పారిపోయి. కొన్ని పాలతో కాఫీ కలుపుకొని తాగి, మిగిలినవి ప్లాస్కులో పోసి అరగంట అరగంటకీ మేడమీదకు పారిపోయి, తాగేదాన్ని.

ఆవేళ మేము తిరిగివచ్చేసరికి రామారావుగారు భోంచేసి వీధి వాకిట్లో పనిష్‌మెంట్ అయిన సిపాయిలా ఒక్కరూ కవాతు చేస్తున్నారు. అప్పటికప్పుడే ఆయన భోజనం అయిపోయిందట. మా ఆరోగ్యాలమీద మాకు ఏమాత్రం శ్రద్ధవున్నా మావీ అయిపోయి ఉండేవట. మా ఆరోగ్యాలమీద శ్రద్ధలేకపోయినా పిల్లలమీద శ్రద్ధ ఉన్నా

అంతేనట (ఆఫ్టర్ సప్పర్ వాక్ ఎ మైల్ ... టు స్లీప్ విత్ ది లామ్) అన్న పాశ్చాత్య సూక్తాల్లో కూడా అతనికి నమ్మకం వుందిట. ఇతగాడు నిజంగా ఇంటర్నేషనల్ మానియక్ (పిచ్చివాడు) అనిపించింది. ఆయన మేష్టారు అవడం వల్ల మనస్సులో ఎర్ర పెన్సిలు ఉంటుంది. దానితో అతను ఎవరు ఏది అన్నా, చేసినా రైటు మార్కో, తప్పు మార్కో పెడుతూనే ఉంటారు.

"భోంచేసిరండి" అన్నారాయన.

నేను రాలేదు. భోంచేసి దొంగతనంగా మేడ ఎక్కి పోయేను. మావారు మాత్రం వెళ్ళి మరో గంట ఆరోగ్య సూత్రాలు బుద్ధిగా నేర్చుకున్నారు.

ఆ తర్వాత అక్కడున్న వారంరోజులూ కేవలం కాఫీ మీదే బతికేను. ఆ వారంరోజులూ, ఆరోగ్య పాఠాలు అవుతూనే వున్నాయి. ఆ పాఠాల ప్రకారం మేము తినేవన్నీ విషపదార్థాలే. తనువు ధృడం వుంటేనే మనసు ధృడం. వగైరా సూక్తులు చాలా నేర్చుకున్నాం. శలవలై ఇంటికి వచ్చేసరికి నన్నెవరూ పోల్చుకోలేనంత జబ్బురూపు వచ్చేసింది.

3

అదీ జగన్నాధంగారి ఊరు వెళ్ళడం ఘట్టం. అది హాలిడే యంగ్ కాకుండా కేవలం పనిష్‌మెంటు అయిపోయింది

నాకు నచ్చేవిధంగానూ ఓడించలేని మావారికి అది గొప్ప విజయం అయింది.

మళ్ళీ జగన్నాధంగారి ఊరనేసరికి నాకు అదంతా జ్ఞాపకం వచ్చింది. క్రితం సారి చిన్నపిల్లలు కాబట్టి నేనుచెప్పినట్లు విని నా పరువు కాపాడేరు. ఇప్పుడైతే ఆ ముసలాయనతో నువ్వెంతని వాళ్ళ హక్కుల గురించి సుప్రీంకోర్టుకు వెళ్ళిపోతారు. అతనికూడా ఇంకా చాదస్తం వచ్చేసి వుంటుంది. నా కెంతమాత్రం ఇష్టంలేదు కాని తర్వాత పుట్టిన మొగపిల్లలు మావారి ద్వారా ఇదివరకు మేము వెళ్ళినప్పుడు జరిగినవన్నీ చిలవలు పలవలుగా విని ఉన్నారేమో - తప్పకుండా అక్కడికే వెళ్దాం, అదేమిటో మేమూ చూస్తాం అన్నారు. అతని అంతేమిటో తేలుస్తాం అన్నారు. వాళ్ళన్న ప్రతిదానికీ మావారు తందాన అన్నారు. "వాళ్ళింటికి వెళ్ళి వాళ్ళ అంతు చూడ్డమేమిటి? మీకేం పొయ్యేకాలాలు? అతనిల్లు - అతనిష్టం - తప్పు" అని నేను నాలుగు దులిపేను నేను. "నువ్వేం భయపడకు. నా పిల్లలికి నీ పోలిక, మీ నాన్న పోలికా రాలేదు. వాళ్లు జంటిల్మెన్. వెళ్దాం. అంతగా ఎప్పుడు వుండలేకపోతే అప్పుడే వచ్చేద్దాం - అన్నట్టు ఎందుకేనా మంచిది ఇన్‌స్టంట్ కాఫీ పట్టుకో నాలుగు బిస్కట్ పాకెట్లుకూడా పట్టుకోండ్డా పిల్లలూ" జడ్జిమెంటు చేప్పేశారు మావారు. మరి అప్పీలు లేదు.

4

వెంటిత్తానికి మళ్ళీ జగన్నాధం ఊరికివెళ్లం ఈసారి కుక్కనికూడా తీసుకెళ్ళం. ఎక్సెస్ పాలు తాగడానికి. జగన్నాధమే మమ్మల్ని రిసీవ్ చేసుకున్నాడు. మూడు నిమి షాల్లో రామారావుగారు తువ్వాలుతో చేతులూ, మొహం తుడుచుకుంటూ వచ్చి కుర్చీలో కూర్చున్నారు. మనిషిలో ఎటువంటిమార్పూ లేదు. పూర్వంలాగే L.I.C. ఎడ్వర్ టైజ్‌మెంటులాగే ఉన్నారు. నా అంచనా రైటయితే అత నికి డెభ్భై ఏళ్లుండాలి కాని అప్పుడే యాభై వెళ్ళిన వాడిలా ఉన్నారు. పూర్వంలాగే కుర్చీలో వెనక చేరబడకుండానే తిన్నగా మేకు దిగకొట్టినట్టే కూర్చున్నారు. మమ్మల్నందరినీ ఒక్కసారి కలయజూసి "ఎలావుంది నీ ప్రాక్టీస్ డాక్టర్?" అని మా వారిని ప్రశ్నించేరు. "ఇతను డాక్టరు కాదుమామ్మా" అని మాత్రం జగన్నాధం చెప్పేడు.

"మొదలయ్యిందీ నేనన్నది కాదనడంకి నా కెంద కీ గోల. అమ్మాయ్ రుక్మిణీ నాకు వడ్డించెయ్" అన్నారు.

జగన్నాధం భార్య రుక్మిణి వచ్చి ద్వారంలో అతనికి కనిపించకుండా నిలబడి అతను (రామారావుగారు) అప్పుడే భోంచేసేరని జగన్నాధానికి సంజ్ఞలతో చెప్పింది.

నువ్వు భోంచేసేవేమో ఆలోచించునాన్నా" అన్నాడు జగన్నాధం.

"ఆఖరికి ఈ స్థితికి దిగజారుతాననుకోలేదు. సాయంత్రంలోగా పెద్దలకి కబురుపెట్టు. పంపకాలైపోదాం. నాకు వండే ఓపిక దానికింకా ఉండదిలే" చటుక్కున లేచి వెళ్ళి ముందు వాకిట్లో ఒక చెట్టుకు పాళెం (పళ్లెం) మళ్ళీ తవ్వడం ప్రారంభించేరు.

జగన్నాధంవేపు తెల్లబోయి చూసేం మేమంతా.

"దగ్గర దగ్గర మూడేళ్ళయింది. ఇదే ధోరణి. మీకు రాయటం మానెయ్యాలనే మానేశాను" అన్నాడు జగన్నాధం. అతిసర్వత్ర వర్జయేత్.

—•—

విసెస్ అండ్ విస్టర్ పక్సెనా

"ఇరవై నాలుగ్గంటలూ ఇంట్లోకూర్చుని మానెత్తి కిక్కపిండి కొట్టకపోతే, ఓసారి మీ క్లబ్బుకో, లేక ఫ్రెండ్ను దగ్గరకో, వల్లకాటికో అఘోరించకూడదూ?" మావారనేసరికి నా కోపం వచ్చేసింది. మామూలు కోపంకాదు పిచ్చి కోపం. ఆ అన్నది మావారు కాకుండా యింకెవ్వరై వుండినా, యీపాటికి నేను జైల్లో వుండేదాన్ని. ఆ క్షణంలోనే నిర్ణయించేసుకున్నాను. రోజూ సిటీబస్సులా ఎక్కడికో ఓ చోటికి తిరిగొద్దామని. నేను అరక్షణం కోపానికి అరవైలక్షల నిర్ణయాలు తీసేసుకుంటాను. నిర్ణయం అంతే చేసేసుకున్నాను కాని ఎక్కడికి వెళ్ళాలి? మావారన్న మూడోచోటికి మనంతట మనం వెళ్ళంకదా, ఎవరైనా మోసుకెళ్ళాలి. ఫ్రెండ్సా? నా కసలు లేరే. ఎవరైనా వున్నావాళ్ళు నాకు, మావారికి కామన్ ఫ్రెండ్సుతప్ప నాకు విడిగా ఫ్రెండ్సనుటూ లేరు. పోగా మిగిలింది క్లబ్బు. అంచేత అప్పటినుంచే అమావాస్యకీ, పున్నానికీ క్లబ్బుకీ. ప్రతీ ఫస్టుకీ సూపర్ బజారుకీ వెళ్ళడం ప్రారంభించేను.

ఆవేళ - మా క్లబ్బులో డిన్నర్. నే నెప్పుడూ డిన్నరు మిస్ కాను ఎంచేతంటే ఎప్పుడూ చూడని, పేరువినని మొంబ

ర్సంతా ఆవేళ వస్తారు. అందర్నీ ఒకసారే చూసీవచ్చును. ఆవేళ నేను, మరో నలుగురం, అంటే మిసెస్ కైలాసం, మిసెస్ జగన్నాధం, మిసెస్ సేన్, మిసెస్ మధుసూధనం (యీవిడ అయిదడుగుల పొడవు, రెండడుగుల వెడల్పు. ఒక అడుగు మందం, పదకొండు ఘనపుటడుగుల ఘనపరిమాణంలో వుంటుంది. అయితే అతి తెల్లగా వుండడంవల్ల కొందరు ఆవిడ్ని ఐరావతం అంటుంటారు రహస్యంగా) ఒక మూల టేబిలుదగ్గర కబుర్లు చెప్పుకుంటున్నాం - మా క్లబ్బులో సాధారణంగా పెద్ద ఆఫీసర్ల పెళ్ళాలంతా ఓ గ్రూపు (ఎవరిపేర్లూ నాకు తెలీవు అందరూ మిసెస్ ఫలానా అనే తప్ప.) డాక్టర్లతాలూకు ఓ గ్రూపు. అరవవాళ్లు, కన్నడం వాళ్ళు ఓ గ్రూపు యిలా రకరకాలుగా విడిపోయి కబుర్లు చెప్పుకోవడం రివాజు. అదేం తప్పుకాదు. ఎవరూ ఫీలవరు కూడా. అదేవిటో గాని పెద్ద ఆఫీసర్లనబడేవాళ్ళ పెళ్ళాలు ఎవరూ నన్ను గుర్తించరు. చిన్నవాళ్లు నా దగ్గరకు రావడానికి జంకుతారు. నాకు అరవం, కన్నడం రావు. హిందీ వచ్చును కానీ హిందీ వాళ్ళెవరూలేరు. అంచేత మొదట్లో తీర్థంలో తప్పిపోయిన పిల్లలా బెంగగా, బెదురు బెదురుగా అయిపోయేదాన్ని క్లబ్బులో. కాని తర్వాత్తర్వాత ఏగ్రూపుకీ చెందని ఓ నలుగుర్ని కూడేసి కాలక్షేపం చెయ్యటం ప్రారంభించేను -

ఆ వేళకూడా మా కబుర్లు సాగుతున్నాయి. ఇంతలో,

"మీరు తరుచు క్లబ్బుకి వస్తూవుంటారా?" అని పరి

చయం లేని అవిడ అకస్మాత్తుగా నాదగ్గరకు వచ్చి అడిగేసరికి తుళ్ళిపడ్డాను. పల్లెటూరిలో పెరగడంవల్లో, జడ్జిని కట్టుకోవడం వల్లో తెలీదుకాని నేనసలు క్లబ్బుకి వెళ్ళను. ఇప్పుడైనా పంతానికీ, పౌరుషానికీ వస్తున్నానే కాని మనస్ఫూర్తిగా మాత్రంకాదు. అంచేత ఆ సంగతి ఒప్పుకోవడం ఇష్టంలేక జవాబుగా వెర్రినవ్వు నవ్వేను.

"దటీజ్ రైట్. నేనూ ఎక్కువగా క్లబ్బుకి వెళ్ళను. ఎందుకో తెలుసా? యిక్కడికి వస్తే పేక ఆడకుండా వుండలేను. ఆడితే డబ్బుపోకుండా వుండదు" అందావిడ. "మీరేవంటారు" అన్న నవ్వు నవ్వుతూ.

జవాబు ఏం చెప్పాలో తెలీలేదు. "పేకాట ఆడకండి." అంటే కాపీపుస్తకం నీతిలా వుంటుంది. పోనీ "ఆడి గెలవండి" అందావంటే లాటరీ ఎడ్వర్టయిజు మెంటులా వుంటుంది. అంచేత మళ్ళీ వెర్రినవ్వే నవ్వేను.

"మీకు మాటలొచ్చా? మీ ఆయనేం చేస్తారు?"

"జడ్జి" జవాబు చెప్పక తప్పలేదు.

"నేనూ అలాగే అనుమానపడ్డాను."

"....."

"ఈ జడ్జీలు ఇల్లుకూడా కోర్టులాగే నమ్ముకుంటారు, ఆఫ్‌కోర్స్ అందరూ కాదనుకోండి. తనంటే అందరూ జడవడం వాళ్ళకి అలవాటైపోతుంది. అంచేత యింట్లో పెళ్ళాం, పిల్లల్ని కూడా ఖూనీ కేసులో ముద్దాయిని

చూసినట్టు చూస్తారు. దాంతో ఇంట్లోవాళ్ళ ఒరిజినాలిటీ, ఇనీషియేటివ్ అంతా చచ్చిపోతుంది. మీవారు కూడా ఆ రకవేఁనా ?"

"ఫరవాలేదు."

"మీకు పిల్లలెంతమంది ? నాపేరు మిసెస్ సక్సేనా"

"నలుగురు."

"నా పేరు చెప్పేనుకదా. మీపేరు చెప్పరేం ? ప్రశ్న వేస్తేగాని సమాధానం చెప్పడంలేదు మీరు. విత్‌ౌట్ డౌట్ మీ యిల్లు సెషన్సునోట్టే అయి వుంటుంది."

"నాకు రెండు పేర్లున్నాయి."

"ఏవిటి ! అసలుపేరూ, ముద్దు పేరూనా ?"

"కాదు పెన్ నేమ్."

"రియల్లీ ! యూ యార్ట్ ఆల్‌రైట్! కాని మీరెక్కడా రైటర్లా కనిపించరే ? ఉండండి. బైట లాన్లోకి పోదాం. రైటరంటే ఒక చేతిలో కలం, యింకో చేతిలో లిక్కర్ గ్లాస్ ...జుత్తు దువ్వుకోకుండా ఎలాగో వుంటా రనుకున్నాను."

"పిచ్చివాళ్ళలాగానా ?"

"నో. నో. కాని యు లుక్ లైక్ ఏన్ ఆర్డినరీహౌస్ వైఫ్. మీకు కథలకి మెటీరియలెక్కడ దొరుకుతుంది ? కొంపతీసి కోర్టుకి వెళ్తే రేపిటి ఖూనీ కేసులూ, డైవోర్సు కేసులూ వినడానికి ! ఓహ్. ది కోర్ట్స్ ఆర్ అఫుల్ ఐసీ.

ఒకసారి ఖూనీ కేసులో ఎవిడెన్సు యిచ్చేను. ఎవిడెన్సు పూర్తయేసరికి ఎవరు చంపేరా అన్నమాట వదిలేసి అసలు ఎవరైనా చచ్చిపోయారా అన్న డౌట్ వచ్చింది నాకు. అంత కన్ఫ్యూజ్ చేసి పారేసేరు ఆ జడ్జి, లాయర్లు కలిసి నన్ను. బైదిబై మీరు ఎప్పుడైనా ఖూనీ చేశారా?"

ఆవిడ ధోరణి వింతగావున్నా, ఆవిడ చొరవ నన్నాకర్షించింది నలభై ఏళ్లు వుండొచ్చు సబ్బు ఎడ్వర్టైజుమెంటు తల్లీ పిల్లలలో - తల్లిలా - ఆవిడలో వయసు కనిపించదు. ఉన్న కొద్దితెల్లవెంట్రుకలూ దట్టంగావున్న నల్ల వెంట్రుకల్లో కలిసిపోయి పరీక్షగా చూస్తేగాని కనిపించవు. మనిషి మాంచి స్లిమ్‌గా వుంది. (నేను లావెక్కిన దగ్గర్నుంచీ, స్లిమ్‌గావున్న ఆడవాళ్ళనిచూస్తే నాకు సరదా. కొండొకచో జెలసీ). అది అందమో, ఆకర్షణో చెప్పలేనంత వావుంది. లిప్‌స్టిక్ రాసుకుందా అన్న అనుమానం వచ్చేటంత ఎర్రగా వున్నాయి పెదవులు. ముఖ్యంగా చెప్పుకోవలసింది ఆమె పెద్ద కళ్లు. ఆ కళ్ళకి ఆ మొహం చిన్నదై పోయిందేమో అన్నంత పెద్దగా వున్నాయి. చీకట్లోకూడా మెరుస్తూనే వుంటాయి. ఆవిడలో ఉన్న అతి ముఖ్యమైన ఆకర్షణ. అతి కొత్తవాళ్ళతోకూడా అతి సన్నిహితంగా మాట్లాడడం. ప్రపంచంనిండా యిలాంటివాళ్ళే వుంటేయుద్ధాలే వుండవేమో అనిపిస్తుంది.

గదిలో ఒకమూలనున్నా, అవసరమైతే సెంటరాఫ్ దిస్టేజ్ దగ్గరున్నట్టు కనివించగలదు. లేదా నీడలావచ్చి ఎవ

రికి కనిపించకుండానూ వుండగలదు. యీవిడ హాబీలేవిటో అన్న ప్రశ్న నాకు అకస్మాత్తుగా కలిగింది. పెయింటింగ్, గార్డెనింగ్ వగైరా అయివుండదు. కవిత్వం ఎందుకో కాదని పించింది. బహుశా స్టేజ్ లేదా మోడల్‌గర్ల్.

"ఏమిటాలోచిస్తున్నారు. మా యింటికో సారి రాకూడదూ?"

"అలాగే"

"చూశేరా. ప్రశ్నకి సమాధానమే చెప్పేరు కాని మీరూ మా యింటికి రండని మాటవరసకైనా అన్లేదు మీరు..."

"ఛ. ఛ. అదికాదు..."

"నేనేం అపెండవలేదులెండి. మీలోని ఇనీషియేటవ్‌ని మీ జడ్జిగారు ఎలా నొక్కేశేరో రుజువుచేస్తున్నాను. మీరేం అనుకోకండి యిలా అంటున్నానని."

"కాని నన్ను మాటాడొద్దని ఆయన అన్లేదే?"

"చూశారా. మీరతన్ని ఎలా డిఫెండ్ చేస్తున్నారో. మాటాడొద్దనలేదు కాని మాటాడనివ్వరు. అంతే. ఇంతకీ యీ ఇంజనీరు మిసెస్ ఎవరో ఎందుకు యిస్తున్నట్టు యీ డిన్నర్?"

"వాళ్ళాయనకి వచ్చిన ట్రాన్సఫరు ఆగిపోయిందట."

"ఏవిటీ! ట్రాన్సఫరాగిపోతే డిన్న..." ఆశ్చర్యంతో వాక్యం పూర్తిచెయ్యలేక పోయింది.

"ఎవరి బాధలు వాళ్ళకుంటాయిలెండి"

"పీతకష్టాలు పీతవని శ్రీ. శ్రీ. కదూ అన్నది! ఆల్ యూ రైటర్స్ ఆర్ పెసిమిస్టిక్......"

"అందులో సింపథీయే వుంది."

"హేయిర్ స్ప్లిట్టర్స్"

"మీరు తెలుగు చదువుకున్నారా!" అడిగేను. ఆవిడ అక్కడా అక్కడా తెలుగు మాట్లాడినా, ఎక్కువగా ఇంగ్లీషులోనే మాట్లాడుతోంది.

"పరవాలేదు. మీలో నమ్మకం కుదురుతోంది. ఇప్పటికైనా ఒక ప్రశ్న వేశారు."

"కాని మీరు జవాబివ్వలేదు." నాకు కొత్తవాళ్ళతో మాట్లాడమే కొంత బిడియంగావుంటుంది. కాని, కొంచెం పరిచయం అయితే మాట్లాడంలో ఆవిడనే బీటౌట్ చేస్తానని ఆవిడకి తెలీదు.

"నేను ఆంధ్రానే. మా ఆయన పక్కేనా. మా ఫాదర్ నార్త్‌లో ఉద్యోగం చేశేవారు. నన్ను చూసినవాళ్ళెవరూ నేను తెలుగుమనిషని అనుకోరు. ఆఫ్‌కోర్స్, అదేబావుంది. ఆంధ్రాలో ఎక్కడికి వెళ్ళినా ముందు నా పనే చూస్తారు."

ఆవిడలో సెన్స్ ఆఫ్ హ్యూమర్ గమ్మత్తుగావుంది.

ఖాలోగా డిన్నరుకి బైటనడం‌తో అందరం లేచేం.

వెళ్ళిపోయేముందు నన్ను వాళ్ళింటికి ఓసారి రమ్మని మరో సారి చెప్పి మరీ వెళ్ళింది ఆవిడ.

ఆతర్వాత మరో రెండుసార్లు క్లబ్బులోనూ, బజార్లోనూ కూడా ఆవిడని కలుసుకోడం జరిగింది. ఆవిడకీ నాకూ కొన్ని కామన్ ఇంటరెస్ట్స్ వుండడంవల్ల ఇద్దరం సరదాగానే కబుర్లు చెప్పుకొన్నాం. కలుసుకున్నప్పుడల్లా వాళ్ళింటికి రమ్మని నన్ను ఇన్వైట్ చేస్తూనేవుంది. అదేవిటో నేనెవర్నీ ఇంటికిరమ్మని ఇన్వైట్ చెయ్యలేను. ఇష్టంలేకకాదు చేత కాక. అక్కడికీ మావారు, "మనింటికోసారి రమ్మను బుద్ధావతారంలాగ అలా నిల్చోక" అని ప్రాంప్ట్ చేస్తూనేవుంటారు. నాలోలేని బోల్డ్‌నెస్, చొరవ వగైరాలు మిసెస్ సక్సేనాలో వున్నాయి. అంచేతే ఆవిడ నాకు మరీనచ్చింది. అవకాశం చూసుకొని వాళ్ళింటికోసారి వెళదామనుకున్నాను. అనుకోవడమే కాని చాలా రోజులవరకు వెళ్ళడంకుదరలేదు. నాకు స్టార్టింగు ట్రబుల్ ఎక్కువ. కాని ఒకనాడు అనుకోకుండానే వెళ్ళడం జరిగింది.

ఎలాగంటే:- ఆవేళ ఫస్టుతారీకు. అలవాటుగా నేనూ, మాఅమ్మాయీ సూపర్ బజారుకి బైల్దేరేం. బజారుకి వెళ్లేం. గేటుమీద "ఈరోజు శలవు" అని తాటికాయంత అక్షరాల్తో బోర్డు వేలాడుతోంది. మా డ్రైవరు ఏం చెయ్యమన్నా రన్నట్టు కారు ఆపి చూస్తున్నాడు. నేనూ, మా అమ్మాయి ఒకరి మొహాలొకరు చూసుకొని నవ్వుకున్నాం. నవ్వడం అయిపోయేక శలవని నువ్వు చెప్పలేదేం అంటే

నువ్వెందుకు చెప్పలేదని వాదించుకొని నాకేం తెల్సని తప్పించుకొన్నాం. ఎలాగా ఇంట్లో సాయంత్రం అయిదు వరకూ రామని చెప్పేంకదా ఇంకెక్కడికేనా పోదాం అంది మా అమ్మాయి. అప్పుడు నా పీతబుర్రకి తట్టింది ఆ దగ్గర్లో ఎక్కడో సక్సేనాగారిల్లుందని వాళ్ళింటికి వెళ్దాం అన్నాను. అయిష్టంగానే ఒప్పుకుంది, మా అమ్మాయి.

గుర్తులు వెతుక్కొని వాళ్ళిల్లు చేరేం. బయట ఆర్. టి. సక్సేనా. మేజర్ రిటైర్డ్ అన్న బోర్డు వుంది. గేటు దాటి లోపలికి వెళ్లేం. వీధి వరండాలో ఒకాయన పడక్కుర్చీలో పడుకొని పేపరు చదువుకుంటున్నాడు. మనిషినీ, తెల్ల మీసాల్నీ చూడగానే అతనే మిలిటరీ ఆఫీసరని అర్థమైపోయింది. అతను మమ్మల్ని చూసికూడా లేచే ప్రయత్నం ఏదీ చెయ్యకపోవడంతో నాకు అతని మేనరు మీద చిన్న చూపు కలిగింది. మిలిటరీ వాడికి మేనర్సు ఏమిటిలే అని కూడా అనుకున్నాను. మేము ఫలానా అనీ, మిసెస్ సక్సేనాగారికోసం వచ్చేమనీ మా అమ్మాయే చెప్పింది. వెంటనే అతను "రండి. రండి. కూర్చోండి. మీ గురించి మా ఆవిడ తరచు చెప్తూ వుంటుంది. ఇప్పుడే ఆవిడా, అబ్బాయీ బజారుకి వెళ్ళేరు. ఎందరగానే వచ్చేస్తారు. కూర్చోండి" అంటూ కుర్చీలు చూపించేడు మమ్మల్ని కూర్చోమన్నట్టు. అతని తెలుగు వింటే తెలుగు వాడే అనుకుంటాం. అంత స్పష్టంగావుంది విధిలేక కూర్చున్నానే కాని యీ మిలిటరీ అతన్తో నేనేం మాట్లాడగలను.

పోసి వెళ్ళిపోతేనో మళ్ళీ వస్తానని చెప్పేసి" అని పించింది.

మిలటరీవాళ్ళకి సిక్స్‌సెన్స్ వుంటుందేమో మరి!

"వచ్చేస్తుందిలెండి. అబ్బాయి మళ్ళీ వెళ్లిపోతాడు కదా, అంచేత తల్లీ, కొడుకూ కలిసి అవీ, ఇవీ అన్నీ, తెగ కొనేస్తున్నారేమో. అసలు పొద్దున మీరు ఫోనుచేసి వుండాల్సింది. ఇప్పుడీ శ్రమలేకపోను" అన్నాడతను, ముందుగా ఫోనుచేసి రానందుకు సున్నితంగా విమర్శిస్తూ, ఎంతైనా మిలటరీ డిసిప్లిన్ !!

మేము అనుకోకుండా వచ్చేమనీ, అసలు యిక్కడికి వద్దామని అనుకోనేలేదనీ, అంచేత ఫోను చెయ్యలేక పోయేమనీ అతి ఎపాలజెటిక్‌గా చెప్పి యీసారి ఫోనుచేసే వస్తామని భరోసాకూడా యిచ్చేం.

అతను కూర్చున్నది వీధివరండా. ఆ వరండామీద అతను కూర్చున్న పడకకుర్చీ కాక మరోనాలుగు గార్డెన్ చెయిర్లు, ఒక టీపాయ్ మాత్రం వున్నాయి. వరండా చుట్టూవున్న మెష్‌కి మనీప్లాంట్ చిక్కగా అల్లుకుంది. గోడని ఒకే ఒక పెయింటిగ్ ఒరిజినల్ దేవుంది. కాంపౌండ్ నిండా గులాబీలు వున్నట్టున్నాయి. మొక్కపైజు, పువ్వుపైజు చూస్తే వాటిని చాలా శ్రద్ధగా పెంచుతున్నట్టు తెలుస్తుంది. కాంపౌండులో ఎక్కడా ఒక రాలిన పువ్వుగానీ, ఎండిన ఆకు గాని లేకుండా నేలనే మనం కూర్చోవచ్చు సన్నంత నీట్‌గా వుంది. టీపాయ్ మీదున్న చక్కటి ఫ్లవర్ వేజ్‌లో రెండే

రెండు గులాబులు వున్నాయి. ముందలతనికి మంచి ఆర్టిస్టిక్ సెన్స వుంది అనిపించింది. పెద్ద అడవిలాటి సీనులు బోల్డు ప్రింటువున్న లుంగీ కట్టుకున్నాడతను. అంటే మోడర్న ఫేషన్సకు యిష్టపడతాడన్న మాట. మనిషికిగాని మనసుకి వయసు రాలేదుకాబోలు!

"ఆడవాళ్ళు వచ్చినా లేవనందుకు క్షమించండి. నాకు ఒక కాలులేదు. తీసేసేరు" అన్నాడు ఆయన మేము కూర్చున్నాక. పాపం! యీ మిలటరీ బతుకులే అంత. యుద్ధం లేనప్పుడు యెంతో హాయిగా ఆరోగ్యంగా బతుకుతారు. కాని యుద్ధంవస్తె ప్రాణం పోకపోయినా కళ్లో, కాళ్ళో పోతాయి. అంత ఆరోగ్యంగా కనిపిస్తున్న అతనికి కాలు లేదని ఊహించ లేకపోయేను. నోట మాట రాలేదు.

"ఏ యుద్ధంలో పోయిందని అడక్కండి..." అన్నాడాయనే మళ్ళీ.

నేను అడగలేదు.

"మూడు యుద్ధాలు చూశేను. సరిగ్గా చెప్పాలంటే చేశేను ఒక్క గోరుకూడా పోలేదు..."

"....."

"శలవలకి ఇంటికి వెళ్తే లారీ గొంకేక్కింది. ప్రిమ చూర్‌గానే రిపైర్ చేశేరు."

అయితే అతనిలో కనిపిస్తున్న వయసు నిజమైనది కాదన్నమాట. యాక్టివ్ లైఫ్‌కి అలవాటు పడ్డాక కాలు

పోయి, కుమిలి కుమిలి వయసు రాకుండానే ముసిలి అయి పోయుండాలి. నా ఆలోచన గ్రహించినట్లున్నాడు. "వయసు రాకుండానే ఇతని కింత నెరిసినజుట్టు ఎలా వచ్చిందని ఆలోచిస్తున్నారా, ఈ మిలిటరీ ఉద్యోగం లాగే అదీ నా వార సత్వం" మెల్లగా నవ్వుతూ అన్నాడు.

నే నేమీ మాటాడలేదు.

"మీరు నక్సలైట్లా ?"

"ఏం అలా అడిగారు ?" అడగక తప్పలేదు.

"డెమాక్రసీలో నమ్మకం లేని వాళ్ళలా అతి సైలెంట్‌గా ఉంటే"

మిలటరీవాళ్లు యుద్ధంలో అడవుల్లోనూ, యుద్ధం లేనప్పుడు పెద్ద పట్టణాల్లోనూ ఉండి జీవితాన్ని పరీక్షగా చూడలేరని నేనప్పటివరకూ అనుకునేదాన్ని. ఇతన్ని చూసేక ఆ అభిప్రాయం మార్చుకున్నాను.

"మీవారు జడ్జి అటగా ! తీసుకురాలేక పోయారా !" అడిగేడు అతను.

"సూపర్ బజారుకని బయలుదేరేం" సగమే చెప్పేను.

"అతను చాలా తెలివైనవారు అయుండాలి. ఇటీజ్ ఎ ఫాలీ టు గో షాపింగ్ విత్ ఎ వుమన్ ఆడవాళ్ళతో బజారుకెళ్ళడం తెలివితక్కువ. ఫ్రెండ్‌తో బార్‌కి, పెళ్ళాంతో బజారుకి వెళ్ళకూడదు. మీ రేమంటారు ?"

"ఫ్రెండ్‌కీ. పెళ్ళానికీ డబ్బుంటే తప్ప" అన్నాను.

"అందుకే వైటర్ తోటీ లాయర్‌తోటీ వాదించకూడదంటారు" అన్నాడతను.

పాలిటీషియన్‌తో కూడా" అన్నది మా అమ్మాయి.

"కొంపదీసి నువ్వూ రైటర్ వేనా ఏమిటీ? నీకు టాలెంట్ ఉన్నా నామాట విని రాయకు. నువ్వు బాగా రాయలేకపోతే ఆ తల్లికి తగ్గ కూతురివి కావు అంటారు. బాగా రాస్తే మీ అమ్మే రాసి నీపేరు పెట్టిందంటారు. అంచేత నీకు ఎలాగూ పేరురాదు కాబట్టి కథలు రాయకు. ఇంతకీ ఈ దేశంలో కథలూ కవిత్వం రాయడంకన్నా కాకర కాయలు అమ్ముకుంటే ఎక్కువ డబ్బు వస్తుంది. నా ఫ్రెండ్ కెప్టెన్ రామచందర్ ఒకసారి కథరాసి ఏదో మేగ జీన్‌కి పంపేడు. అచ్చయింది. పత్రికవాళ్లు ఏం పంపుతారో పార్టీ పీకుదాం అని మేమంతా ఆతృతగా ఎదురుచూసేం. పత్రిక పంపేరు" అంటూ ఆ విషయం తలుచుకొని అతను గట్టిగా నవ్వేడు.

నేను యింకెంతసేపు ఉండాలో తెలియక ఇబ్బందిగా కుర్చీలో కదిలేను.

"వెళ్ళిపోకండి. మా అబ్బాయి మిమ్మల్ని చూడాలి. మీ అమ్మాయి నన్ను ఇంప్రెస్ చేసింది."

ఇంకానయం నేను-అతన్ని ఇంప్రెస్ చేసేనని అన లేదు. మిలటరీ ముండావాడు అంటేమాత్రం నేను చేసే దేమిటి! గులబీ చెట్ల వేపు చూస్తూ కూర్చున్నాను.

"మా అబ్బాయి తోట ఎలావుంది! నిన్నల్లా కూర్చుని

ఎండాకులు !ఏరేను. పుప్పు అందం ఎండాకు తినేస్తుంది. మీ రేమంటారు ?" అతను అడిగేడు.

ఇదేదో రేడియో ఇంటర్వ్యూలావుంది.

"తినేస్తుందంటాను." అన్నాను.

"మీకు పనులున్నా నిర్బంధంగా కూర్చో పెట్టేస్తున్నా నని అనుకోకండి. కేవలం మీరు మా అబ్బాయిని చూడా లనే ఆపుతున్నాను. మియర్లీ ఫాదర్స్ ప్రైడ్ అంతే."

"ఏం చదువుతున్నారు మీ అబ్బాయి ?" అనడిగేను. ఏం అడక్కపోతే బావుండదని.

"బావుందండోయి. చదువేమిటి మిలిటరీ ఎకాడమీలో ట్రైనింగ్ అవుతున్నాడు. అసలు నాకేమాత్రం ఇష్టంలేదండీ వాడు మిలటరీలో చేరడం. ప్రతి తండ్రీ తన కొడుకు తన ఉద్యోగమే చెయ్యాలనుకుంటాడేమో. మంగలాడి కొడుకు మంగలాడు అవడం మంగలివాడికి ఇతరులకీ కూడా ఇష్టమే. కాని మామిలటరీవాళ్ళకిమాత్రం మాపిల్లలుమిలటరీలో చేరా లని వుండదు. మావాడు డాక్టరో, లాయరో అవాలని నా కోరిక. లాయరయితే జడ్జి అవవచ్చు. మా మిలటరీవాళ్ళకి శత్రువుని చూసిన కన్నా జడ్జిని చూస్తేనే భయం. నువ్వేం చేస్తున్నావ్ ?" మా అమ్మాయివేపు తిరిగి అడిగేడు.

"మెడిసన్" అంది మెల్లిగా.

"ఇంకేం అదృష్టవంతురాలివి. మొగాళ్ళకు జబ్బులు ఉండాలేకాని నువ్వు ప్రాక్టీసు ఎక్కడ పెట్టినా డబ్బుకి కొద

వుండదు. నా కెందుకో మా అబ్బాయి సైకియాట్రిస్ అవా లని కోరిక వుండేది. అన్ని రోగాల్లోకి పిచ్చి మహా భయం కరం. మీ రేమంటారు!" కొంచెం ఆయాసం వచ్చినట్టుంది ఆగేడు.

"కాదనడానికి నాకు ఎప్పుడూ పిచ్చెక్కలేదు." విసు గుతూ అనేసి తర్వాత అంత మోటుగా అన్నందుకు బాధ పడ్డాను.

"సైకియాట్రిస్ట్ అవడానికి మావాడికి అర్హతవుంది. వాడు సిగరెట్లు కాలుస్తాడని నాకు చాల్నాళ్లే తెలుసు కాని తను కాల్చడంలేదని నమ్మించడానికి శలవలకి వచ్చేముందు వారంరోజులు ముందు సిగరెట్లు కాల్చడం మానేస్తాడు పెది మలు తనని పట్టి ఇచ్చేస్తాయని. నా దగ్గర వున్నన్నాళ్ళూ లోపల ఎంత బాధపడతాడో తెలియదు కాని సిగరెట్లు కాల్చడు." దూరంగా కొడుకు వస్తాడేమో నన్నట్లు చూస్తూ ఉండిపోయేడతను.

మళ్ళీ ఏదో జ్ఞాపకం వచ్చినట్టు మొదలు పెట్టేడు: "నాకు అంత పాతకాలం పెంపకం నచ్చదు. తనంతవాడు తను. అయ్యేడు. మైనారిటీ తీరిపోయింది. ఇంకా నా నీడలో వాడు ఎదగకుండా ఉండాలనుకోవడం తెలివితక్కువ. ఎకాడమిలో చేరేక అంతా కొద్దో గొప్పో తాగుతారు. అంచేత మొన్న వాడొచ్చినాడు సాయంత్రం వాడిని ఫ్రిజ్ లోంచి విస్కీ రెండు గ్లాసులూ తెమ్మన్నాను. రెండు గ్లాసుల్లోనూ పోసి ఒకటి వాడికిచ్చి "మనిషికి ధైర్యం

ఉండాలి మై బోయ్ నేనున్నప్పుడ చేయలేని పని నేను లేనప్పుడకూడా చెయ్యడు. తాగినంతమాత్రాన తాగుబోతూ అవకక్లేదు. చెడిపోనూ అక్కర్లేదు. నువ్వు చెయ్యకూడని పనులు వేరే వున్నాయి ఇవికావు." అన్నాను. "థాంక్ యూ డాడీ" అంటూ గ్లాసందుకున్నాడు. ది ఫెలో ఈజ్ డిస్లీ (గేట్పుల్ టుమి. నేను చేసింది తప్పంటారా? కాలాన్నిపట్టి మనం పోవాలి." మళ్ళీ అతని కళ్ళు అదో మోత్తరుగా అయిపోయేయి. విప్పి వున్నా చూడని కళ్ళలా వున్నాయి. అతనికి కొడుకుమీద వున్న గౌరవానికి ఆశ్చర్యపోయేను.

"వయసు వచ్చింది కాని చిన్నతనం పోలేదు. ఈ వేళ చూడండి ఏం చేసేడో. ఇంట్లో నేను కర్రకాలు వాడను. క్రచెస్ వాడతాను. తాను బజారుకి వెళ్తున్నప్పుడు నేను పేపరు చదువుకుంటున్నాను. వాడు వచ్చేసరికి నేను ఎక్కడిక్కైనా వెళిపోతానేమోనని నాకు తెలీకుండా నా కర్రలు ఎక్కడో దాచేసేడు. ది లిటిల్ ఇంప్ ఇక్కడే అవడంవల్ల వాడేం చేసినా నాకు నచ్చుతున్నాడేమోనని నా భయం. అంటూ అతను నవ్వేడు.

ఈలోగా అతని భార్య కారులో వచ్చి "ఎంతసేపైంది. మీరు వచ్చి క్షమించండి" అంటూ దిగింది. దిగుతూనే లోపలికెళ్ళి అతని కర్రలు పట్టుకు వచ్చి అతనిపక్కపెట్టి "మీ యుద్ధం కబుర్లతో వీళ్ళని కాల్చుకు తినలేదు గదా కొంపదీసి" అంది.

నాకు ఎంచేతో ఏదో తెలియనివెల్తి ఆవిడలో కని పించింది. "రండి ఇల్లు చూద్దురుగాని" అంటూ ఆవిడ మమ్మల్ని లోపలికి తీసుకు వెళ్ళింది. ఇల్లు డబ్బుకు ఇబ్బంది లేనివాళ్ళ ఇల్లులాగే కాకుండా మంచి అభిరుచులున్న మనుషుల ఇల్లులా వుంది. ఆఖర్ని వీధి వరండా పక్కనున్న పడక గదిలోకి వచ్చేం. అప్పటికి నాకు కలిగిన వెల్తి అర్థం అయింది.

ఆవిడతో వాళ్ళ అబ్బాయి వస్తాడనుకున్నాను. కాని రాలేదు. కారులో ఆవిడ ఒక్కర్తే దిగింది.

"మీ అబ్బాయి ఏడి?" అడిగేను.

వెంటనే ననూ్న, మా అమ్మాయినీ దెయ్యాలని చూసినట్టు చూసింది. మొహం వెయ్యి వంకర్లు పోయింది. ఆవిడ పళ్ళు గోరీలోంచి లేచిన మనిషి కళ్ళలా వున్నాయి. క్షణం మావేపుచూసి అకస్మాత్తుగా మంచంమీద బోర్లా పడి ఏడవడం ప్రారంభించింది. వంట్లో ఉన్న ప్రతి ఎముకా విరిగిపోయేటట్టు వణికే ఆవిడ ఏడుపు చూసి మాకు భయం వేసింది. ఈలోగా ఈదురు గాలిలా సక్కేనా గదిలో ప్రవేశించి ఆవిడ పక్కని కూర్చుని ఆవిడ కన్నీళ్ళు చేత్తో తుడుస్తూ "మీరు వెళ్ళిపోకూడదా" అన్నట్టు మా వేపు చూసేడు.

మేము చప్పుడు చెయ్యకుండా వాళ్ళ ఇల్లు వదిలేసేం. పాపం తర్వాత తెలిసింది వాళ్ళకు ఉన్న ఒక్క కొడుకు పదో ఏటో పన్నెండేళ్ళకిందటే పోయేడని.

—: o :—

డ బొమ్మ-1

కట్టుకున్న గళ్ళలుంగీ మోకాళ్ళదాకా ఎత్తి బిగించి, పద్మాసనం వేసి ముచ్చటిస్తూ, వర్తమానాన్నీ భవిష్యత్తునీ ఒక్కలాగే బూతులు తిడుతూ అతను లెక్చరుసాగిస్తున్నాడు, నే నా రైలు పెట్టెక్కే సరికే. అతని చుట్టూ అతని పార్టీ యెనిమిది తొమ్మిది మందున్నారు. జిడ్డు మరకలున్న తన టెర్లిన్ చొక్కా గుండీ పీకకు తగిలేవరకూ వెనక్కిలాగి ఒక చేత్తో రెండో చెయ్యి రాసుకుంటూ, పదిమందున్నా ఒక్కర్నే ఉద్దేశించి మాట్లాడ్డం అతని అలవాటు అతని కళ్ళ కింద పొంగు, అతనికి నిషా వస్తువులు నిషేధం లేదంటుంది. అతని జుట్టు మూడుగజాలుంది. అతని గెడ్డం మూడ్రోజులది. అతను మూడు కాలాల గురించీ త్రికాల జ్ఞానిలా ఒక్కలాగ మాట్లాడగలడు. పోయిన యుద్ధంలో మిలటరీ కెళ్ళి పాడై పోయినవాళ్ళగో, లేకపోతే నాలుగుసార్లు జైలుకెళ్ళి బాగు పడ్డ వాళ్ళగో వున్నాడు. "అన్నా" అని పలకరిస్తే, "ఏం కాన్మగిదీ" అని పలికే రకంలా, చూస్తేనే నమ్మకూడ దన్నట్టున్నాడు. అతనికి 45 సంవత్సరాలు వుండొచ్చు.

ఈలోగా ఒక కుర్రాడు - అతని పార్టీవాడే - రైలు పెట్టెక్కి అతనికి రెండు బీడీకట్ట లిచ్చేడు.

అతనా కుర్రాడివేపు శపిస్తున్నట్టు చూసి "నీలాటి దాన్నేనా అవతలీదికెళ్ళి అగ్గిపెట్టె తెమ్మంటే అర్నెల్లకడుపులో సహా తిరిగొచ్చిందట ! లేకపోతే యింతసేపట్రా లంజి కొడుకా ! - ఒక బీడికట్ట తెమ్మంటే !" అని ఆప్యాయంగా ప్రశ్నించేడు.

కుర్రాడు "ఒకటి కాదు గురూ ! రెండూ" అన్నాడు నవ్వుతూ.

"అన్ని తెలివి తేట్లుండబట్టేనా లారీ క్లీనరయ్యేవు. ఎక్కడ సస్తే సచ్చేవ్ గాని 'టీ' లేవీ !"

"తెస్తున్నాడు గురూ" అని ఆ కుర్రాడంటూ వుంటే ఒక 'టీ' కుర్రాడు ప్రవేశించి వాళ్ళ పార్టీ అందరికీ 'టీ'లు అందించేడు.

అతను 'టీ' చవిచూసి, చప్పరించి, మిగతా 'టీ' అంతా గడగడా తాగేసి కిటికిలోంచి తుప్పని ఉమ్మి "సిస్సీ ! ఇంతకంటే కిరసనాయిలునయం. ఏటీ 'టీ' తాగితే సిన్నప్పుడు తాగిన ఆవఁదంకూడా బైటికొచ్చేసేట్లుంది" అంటూ గ్లాసు పక్కవాడి కందించాడు.

అతని మాటలకి అంతా నవ్వేరు. దాంతో అన్యాయం కేసు గెల్చిన ప్లీడర్లా అతను రెచ్చిపోయేడు.

"ఒరే అబ్బాయ్ ! ఈ 'టీ' లో టీయాకు లేస్తాడా, ఎంగిలాకు లేస్తాడ్రా మీ ప్రొవైటరు" అని 'టీ' కుర్రాడ్ని తిట్టి మన బతుకులే యీ టీ నీళ్ళలా ఐపోనాయి గురూ.

అంతా సెకెండేండు బతుకులు. ఎక్కడ సూడు, సవకబారు ఎస్తుపులూ, నాసిరకం మనుసులేను.

"నా సిన్నప్పుడు సూడు; గాంధీగార్లా టోడు ఒకస్టెటి మెంటిచ్చేడంటే అటు లండన్నిం చిటు లంక్రలేవ్వారకూ ఎవుడికి అరదంగాక గడగడ్లాడిపోయీవోరు, తెలీజెప్పమని. మళ్ళీ ఆ బాబు కాడికే ఎల్లీవోరు. మళ్ళీ అలాటోడే నెహురూ. ఎనక జేనమలో పూజ తక్కువై మన్లో పుట్టేడుగాని నేక పోతే అమెరికాలో పుట్టాల్సినోడు. ఆ బాబు యిదేశాలెత్తే ఏటి సేసీవోరో ఎరికా? ఎత్తుకొని నెత్తి కెక్కించుకునేవోరు. కాళ్ళుకడిగి నీళ్ళు జల్లుకునేవారు. ఇంకాడాళ్ళ సంగత్సరేసరి రోడ్లు కెగబడి పోయీవోరుట. ఆ బాబు సిన్నతనంలో ఓ పాలి రష్యా ఎల్తే ఏస్తైందో తెల్సా? మాకు రాజు లేడు. రాజులాగున్నావు మాకు రాజున్నేసుకుంటావని అక్కడోళ్లు బతిమిలాడ్నా. ఆ బాబొచ్చీసేట్టు. మనిసంటే అతగాడు మడిసి. బంగారం కడ్డీ; ఇనపగుండు

అంతెందుకు. నా సిన్నప్పుడు పంచాయితీ పెసిడెంటు పంతుల్లేమా? చూస్తే పది జనమల పాపాలు పోయీటట్టుండే వోడు. ఇప్పుడూ వున్నారు, పెసిడెంట్లు మనకి! ఏం నాబం? పొట్టకోస్తే మాంసం ముక్కలత్తప్ప అచ్చరం ముక్కుండదు. నోరిప్పితే సరేసరి. పుప్పిపల్లూ, కొండనాలుకా తప్ప మాట పెగల్దు" అంటూ అతనక్కడితో ఆగి, పక్కనున్న బీడీకట్ట లోంచి ఎంచొక బీడీ తీసి, దాని రెండోవేపు నోట్లో పెట్టుకొని, శివుడు శంకం వూదినట్లు వూది, మళ్ళీ సన్నవేపు

నోట్లో పెట్టుకుని, అంటించి, గట్టిగా దమ్ము లాగాడు. కాని పొగ సమంగా రాలేదు. వెంటనే బీడీ కిటికీలోంచి విసిరేసి "యిన్ని కన్నాలున్న బీడీ ఎపుడు కాల్చుర్రా బాబూ! బీడీకి ఏడి కన్నాలు, బేంకు యినప్పెట్టి కన్నాలు, బడ్జట్టుకి కన్నాలు, ఎగిరే ఇమానం యింజన్లో కన్నాలు. అంతా కన్నాల బతుకులై పోనాయంటే నమ్ము!

"నా సిన్నప్పుడు అణా ఇచ్చి బీడీకట్టిమ్మంటే అర్ధణా తిరిగిచ్చీసీవోరు. కట్టసించి బీడీ యెలిగిస్తే సారామోదికే పోయీదికాదు మనసు. అర్ధణా యిచ్చి కాఫీ తాగితే యిలా యెలా గుండేదనుకుంటావేటి! కాక్ సెయిలుండే, కాక్ సెయిల్లా గుండేదంటే నమ్ము. ఇంతకీ ఈతకల్లు, ఎమోనియా సారా తాగే మీ కేటి తెలుస్తాదిలే కాక్ సెయిల్రులుసి!

"నా సిన్నప్పుడు అణా యిచ్చి యీ సొరకాయలు కొని యిలా పొయ్యిమీదెట్టేసరికి ఎన్నైపోయీవి. ఇప్పుడో! రూపాయిన్నరిచ్చి యీ సొరకాయలు కొని పొయ్యేక్కిస్తే పొయ్యారిపోద్ది. మొన్నేమైందో ఎరికా! మా యాడది మాంసం వండి అన్నానికూకొని, తినకుండా లెగిసిపోనాది. "ఏటే పిల్లా! మాంసం ఒగ్గేసినావే" అన్నానో లేదో, తాసు పాంలాగ తోకమీద నెగిసి "ఇది మేకమాంసవా? మోటారు సైరుముక్కా! మా గొప్పమాంసం తెచ్చేవుగాని వల్లకుండు" అని కళ్ళెర్రజేసింది. మళ్ళీ దానికి మాంసవంటే ఎంతిష్టమో తెల్సా! ఎప్పుడో పాలి నన్నే తినేస్తాదేమో ననిపిస్తాది.

"ఇప్పుడంతా డబ్బు గురూ! డబ్బు! ఇలువైన సరు కెవురికీవొద్దు. ఇక మనిసి యిలువ అసలేవద్దు.

"డబ్బు సూపితే చాలు- ఈడిలో కోతాడద్ది. ఇట్లో ఆడది కోతిలాగాడద్ది. డబ్బుంటేసాలు, కార్లు కొనొచ్చు. మేళ్లు కట్టొచ్చు. దేవుడు డెరుగు తిరక్కపొతే ఏ సెయి ర్మేనో, ఏమ్మేల్యేగూడా అయిపోవచ్చు.

"నీకు డబ్బుంటే, నీ కొడుక్కి బంగార బొమ్మలాంటి కోడలు బంగారం సంచుల్తో వస్తాది. నీ కూతుర్ని గొప్పో డెవడో కట్నం నేకుండా పెళ్లి సేయిస్సుకుంటాడు. నీకొడుకు తరుడుపారం ఎంగుకు దాచ్నేదనడగరు. నీ కూతురు ముంద చేడు అచ్చమ్మాస్ప త్రిర్లో ఎందుకు జేరిందనడగరు. నీబామ్మర్ది కర్రి మంత్రసాని ముడ నెందుకు, పీకపిసికి సంపేశాడనడు గరు. నీ వొంశంవద్దు, నీ గుణం అసలేవద్దు. నీ సదువేటనడ గరు. నీ డబ్బు కావాలి పెపంచానికి. ఆకిరికి దొంగ నల్ల మాదు హోల్సేలు యాపారం నీదేననికూడా పట్టించుకోరు.

"ఇంతెందుకు, ఈదిలోకెళ్లు. ఎల్లి, రూపాయలసంచీ గలగల్లాడించు. నీ పక్క నెంతమంది సేరుతారో సూసుకో.

"నీ క్కారమ్మతా పనొకడొస్తాడు. నీకిల్లు అమ్మతా నని మరో డొస్తాడు. నీకు వొళ్ళు అమ్మతానని పదిమంది వొస్తారు. మళ్ళీ ఆళ్ళు సూడ్డాని కెలా గుంటారో తెలాన్న! రావణాసురిడికింద ఏడుస్తున్న సీతమ్మోర్లలా గుంటారు.

"ఇంతెందుకు; పదిమందిలో పొలీసోన్ని పబ్లిగ్గా సెప్పట్టు

కొట్టిపడిరూపాయల్నోట్లు ఆడిసేతిలోపెట్టు. నువ్వూ, ఆడూ ఏదో లెంపకాయలాట లాడుకుంటున్నట్టు నవ్వేసి ఎల్లిపోతాడు.

"తిరపతెల్లు. కాని రైలుదిగక, దిగకుండానే ఎంక కేస్సరుడి గుడేపు తిరిగి డబ్బుసూపీ. ఏడుకొండలూ ఒక్క బిగిని గంతేసి నీవొళ్లో వల్తాడస్వామి.

"ఈ రోజుల్లో పాకీవోడు మొదలుకొని పరబ్రహ్మం వరకు, డాట్టుబాబు మొదలు డాఫర్నాయుంల వొరకూ అంద రికీ ఒకటే కావాలి. ఏటనుకున్నావ్? డబ్బు!

"నీకు డబ్బు నేకపోతే నువ్వు గాందీగార్లాటోడివైనా నీ మొకంమీద ఉమ్మ్మమ్మా ఉమ్మ్మరు. గాందీగార్నైనా— మొదట్లో అమాయకం రోజులు గాబట్టి బతగ్గలిగేడు గాని ఈ మాయదారోజులొచ్చేక బతకనిచ్చినారా! కాలిసి సంపే సినారుగాని - ఆ బాబుకే యింత డబ్బుండి లంచవిచ్చి పది మంది పోలీసోళ్ళని సుట్టూ ఎట్టుకుంటే సచ్చిపోయివోడా? ఆ బాబుని సంపెసీవోరా?

"ఈ డబ్బుదగ్గర మనిసిని మనిసి నమ్మ్మడు. పెళ్ళాన్ని మొగుడు నమ్మ్మడు. పిల్లని తల్లి నమ్మ్మదు దేశాన్ని దేశం పొట్టనెట్టేసుకుంటాడి. నామాటబద్దమైతే ఈ పాలెల్లి మీ యాడదాన్ని దానమ్మగోరిచ్చిన ఆరెకరా లమ్మేసి నీకు సెకం డేండు టాక్సీ కొనిపెట్టమను. అది ఈ రేత్తిరే నీ సాపగుడ్డ ఈదరుగుమీద పారీబోతే నన్ను నంజకొడుకని పిలు. నేను పలుకుతాను. ప్రోనోట్లేకుండా పదొండలు అప్పియ్యమని నీ

తమ్ముణ్ణి ఈవేళే అడుగు. ఆసాకు (shock)ఆడుసచ్చినాన్నా పోతాడు. నేకపోతే నిన్ను సంపేసినాన్నా సంపేస్తాడు.

"రెండు పిట్టలు కలిసుంటాయి. రెండు పుల్లు కలుసుంటాయి కానిద్దరు మనుషులు కలుసుండరు, డబ్బు సంవందం ఏఁ వీఁ నేకపోతే.

"డబ్బుదగ్గర న్యాయం నేకపోతే మన్నైపోతావు. నువ్వు లారీ నడుపుతే రిటన్లో లోడేం లేదని నీ బ్రొయ్ట్రుతో అబద్ధం సెప్పకు. నువ్వు పంచదారమ్మంతే కాయితానికి కాణీ పుచ్చుకోకు. బియ్యం అమ్మంతే రాళ్లు కలపకు. పాలమ్మంతే నీళ్ళు కలపకు. యాపారంచేస్తే దొంగలెక్క బ్రాయకు. అలాచేసి పచ్చేవేడు నీ ఎడసు నీకు తెలుస్తే నాకొచ్చి సెప్పు. నీ కిల్లుండదు. నీ భూమి సావుకారుడి. నీ పెళ్ళాం నీ కొల్లదు. నీ కుక్కే నిన్ను కరుస్తాది. నీ వప్పు త్రీర్చనేక నూతిలో గెంతి నరకానికి పోతావ్! పోతే పోతావు డబ్బులే నెదవ్వి. నా ఏడుపల్లా నువ్వు మాకు పనికిరాదనే" అని ఆగేడు.

చుట్టూ వున్నవాళ్ళు ఆలోచనల్లో పడ్డవాళ్ళలా మాటాడకుండా వూరుకున్నారు. కాని వాళ్ళలో ఒకడు "అయితే డబ్బుకోసం ఏ పీకన్నా కోసీమంటావన్నమాట" అన్నాడు.

"ఆ తప్పుమాట నా కంటగట్టబోకండొరె. నాకు పరమసయ్యం. అసల్నాకు డబ్బంటె యిష్టవని ఏనఁజికొడుకు సీతో సెప్పింది! కట్టుకున్నా కొగ్గకూడదని మాయాడదాన్తో

వుంటున్నాగాన్నేకపోతే ఏనాడో సన్నాసినై పోయుండే వోణ్ణి: నా నసలు ఋషిలాంటి మడిసిని.

"ఇంతకీ కళ్ళారా మాడాటుబాబుకత సూసేకూడా డబ్బుకి లొంగిపోమంటారా బావుల్లారా" అని మూడు నిలువుల నిట్టూర్పు భూమిలోకి గుచ్చి ఆగేడు.

"ఎవుడ్రా డాటు? ఏమా కత" అని పంచతంత్రంలో రాజు కొడుకుల్లా చుట్టూ వున్నవాళ్ళు అడిగేరు.

"అయితే సెప్తా వినుకోండి" అని బీడీకట్టలోంచి ఒక బీడీ ఎంచి, ముట్టించి, బీడీ కంపెనీవాడి తల్లీ, పెళ్ళాల శీలం శంకించకుండా కథ ఆరంభించేడు: "నేను మీడూరాకముందు ఎక్కడుండే వోడ్నో తెల్సా?...లో. అక్కడో పెద్దాస్పత్తిర్లో పన్జేసేవోడ్ని. పెద్దాస్పత్తిరంటే జనరలాస్పత్తి రనుకునేరు. జనరలాస్పత్తిరికెల్తే పేషెంటుకి తోడెల్లినోడు ముందు సస్తాడు. ఆ ఏనక పేషెంటు సస్తాడు. అది కాదు మాయాస్పత్తిరి. మాది 'పంకజం నర్సింగ్ హోమ్'. ఆ వూరి కొండపక్కని సంద్రాని కెదురుగా వుండేది.

"ఆ యాస్పత్తిరికి తొలీసుట్టు నౌకరీకెల్లి రిచ్చాదిగి, దాని కాంపౌండు గోడ సూసేసరికి గుండె సల్లబడిపోనాది. తొల్సుట్టు సెంట్రల్ జైలు గోడ సూసినప్పుడలాగే అనిసించిందొకే. లోన కెల్లబోతే గేటుకాడ గూరకావోడు గెంటేబోనాడు. ఆకిరికి నా కాయితాలూసి ఒగ్గేసినా డనుకో.

"గేటుదాటి ల్లోన కెల్లబొయ్యేసరికి కళ్లు ఝుమ్మన్నాయనుకో. అదేదో పెద్ద హోటేలుల్లాగో, సినీమాకంపెన్లో

లాగో పుండిగా నీ ఆస్పత్రిర్లాగ నేదు. గేటు దాటగాగే ఎకరా లెకరాల పూలతోట; సొరగంనుండి రతనాలు రాలిపోయినట్టు ఆటి పువ్వులు.

"ఎన్నెల రేత్తిరి పువ్వాల మొకాలపక్కన సిమ్మెంటు బెంచీమీద కూచుంటే జొత్తాగా నీల్లు సల్లగా తుంపర్లా బడతూవుంటే నా సావిరంగా...సస్తె యీ ఆస్పత్తిరిలోనే సావాలనిపిస్తాది.

"ఇంకాస్పత్తి రెలా గుంటాదనుకుంటావేటి! దాని కోవారంగు గోడలు చూస్తే కొరుక్కొత్తినేయ్యాలనుంటుంది. దాని నేల్లో నీ యెదవమొకం సూసుకు గెడ్డం గీసుకోవచ్చు. ఆస్పత్తిరి ఆరంతస్తులు. ఆపరేసనలస్నీ ఆరో అంతస్తులో, మిగతా అంతస్తుల్లో అస్నీ స్పెషల్ వోర్డులు, కిందంతస్తులో ఆఫీసూ, కన్సల్టీషనురూమూ, కంపౌండర్లు గదీనీ.

"పేషెంట్లు కిచ్చే గదు నెలాగుంటాదేటి! దేనికీ బైటి కెల్లక్కర్లేదు. ప్రతీగదకీ బాత్రుమూ, లెట్రిన్లుంటాయి. ఆ యాస్పత్తిరిలో ఒక హోటేలు, ఒక మందుల్సాపు, ఒక మామూలు సాపు, ఒక పుస్తకాల్సాపు, ఒక బీడీకొట్టు అస్నీ వున్నాయి ఒక బయస్కోపూ, బట్టల్సాపూ లేవన్నమాట గాని, నేకపోతే అదో సిన్నా రేవనుకో. ఆ యాస్పత్తిరి యింటిపన్ను యిరవై వేలు. కరెండు కరుసు మూడువేలు.

"ఇంకాస్పత్తిరి కొచ్చేవా ళ్ళెలాటి వోళ్ళనుకుంటావేటి!

'పీకలవరకూ లంచాల్తిసే పెద్దుద్యోగులు, నీ యమ్మ

సస్తాంటే నీ పెళ్ళాంపుస్తె అమ్మించేసి నీకు పదిరూపాయల ముందు యిరవై కమ్మ్నాతారే అదిగో అలాటోళ్ళు; యీ ఏల కడితే రేపు కొట్టుకుపోయ్యా బ్రిడ్జిలుకట్టే కంట్రాక్టర్లు; రేత్తిరికి రేత్తిరీ షిప్పుల్లోంచి బ్రాందీ, నల్లమందూ దింపి బంగార మ్నేళ్లు కడతారే ఆళ్లు; అంతా అలాంటోళ్ళే ఆ యాస్పత్తిరి కొచ్చేది.

"పల్లెటూరి నాయుడి నాలుగో పెళ్ళాం తన సైజు కుర్రాడితో పట్నవాసంలో వుండడానికి లేని జబ్బు సెప్పి మా యాస్పత్తిలోనే వుండేది. కలకటేరు పెళ్ళాం కానుపు మాకాడే. ఎప్పటికీ సవర్తాడని సూపరెంటు కూతురు ఆపరీసనూ మాకాడే.

"అంతే కాని నీలాట్నాలాటి బీదెదవలు రారక్కడికి. అలాటో డెవడైనా మతిసెడి వచ్చేడో, గేటుకాడ గూరకా వోడు, గేటుకాడే పీకపిసికి సంపేస్తాడు.

"ఇక మా బాబంటావా? ఎప్పుడూ ఎనరితోనూ మాట్లాడ్డు. అచ్చ సినిమా హీరోలా గుంటాడు. పెదాలమీద సిన్న పావులా అంత సిరునవ్వుతో ఎవురొచ్చినాసరే మూడు మాటల్తో ముగించి పంపేసీవోడు. ఈ బాబు అస్పత్తిరిలో ఆడే మాటలన్నీ ఇంగ్లీసూ, తెలుగూ కలుపుకుంటే రోజుకి అరవయ్యింటాయి. ఆ బాబెప్పుడూ నవ్వడో రే. (ఎప్పుడూ నవ్వని మొగాడ్ని, ఎప్పుడూ ఏడవని ఆడదాన్ని నమ్మ్నాకూడ దంటారు.)

"ఆ బాబు కింద ఆడోళ్ళతోసహా ఆసుగు రసిస్టెంట్లు,

మూడు పుంజీల మంతర్నాన్లు; యికనర్సులూ, వార్డుబోయిలు సంగతి సెప్పన్లేనేలేదు" అంటూ అతను మరో బీడీ అంటించడాని కాగేడు.

"యింతకీ నీ కేటుద్దోగం ఆ యాస్పత్రిలో" అని అడ్డు తగిలేడు ఒకడు.

"షాపుర్ ... పేరుకే డ్రైవర్నుగాని డాట్రుబాబుకి చెక్రెటీడాటో డ్నునుకో. నాతో సెప్పంది ఆ బాబేపనీ సేసీ వోడుకాదు. పొద్దుటేల ఇంటికాడ్నుంచి ఆ బాబు నాస్పత్రికి కారులో తీసుకొన్నూ వుంటే ఆ వేల ఏ ఆపరేసనుసేస్తాడో, అదెంత కష్టవో, ఆ ముందట్రోజు పేషెంటు ఎందుకు సచ్చిపోయాడో, అన్ని సెప్పేవోడు. అసల్నాకు డాట్రు పన్నేర్వు తానని బతిమిలాడీవోడు. అప్పుడ్నేరుసుకున్నా బాగుండేది. ఇప్పు డీ నారీ డ్రైవరుద్యోగం తప్పిపోయాది.

"ఆ బాబెంత మంచో డనుకుంటావేటి? రెక్కల్లేవుగాని దేవుంశ్నాటోడు. ఆ బాబు సెయ్యేసీసరికి వొల్లు సల్లబడిపోవాల. నూటాసు జొరవున్నోడికి. ఆ బాబు సూప్పడెసరికి ఎవరన్నా సరే- ఆకరికి మన లారీ కంపెనీ పొప్పరైటరు ముండ దురగమ్మలాటిదైనా సరే కినీవొలిసిందే.

"ఇంకా బాబు వొయిద్దె మంటావా! ఇవరించడం నా తరంకాదు. పేషెంటుకి అకలేస్తేమందు, ఆకలెయ్యకపోతే మందు, నవ్వొస్తే యిండీషను, ఏడుపొస్తే యిండీషను. పిల్లలు పుట్టడాని కాపరీసను, పుట్టుక పోడాని కాపరీసను. ఆ బాబు కాడ వొయిద్దెు లేని జబ్బు లేదుపో!

"ఇక మడిసంటావా ? సూస్తే యముడుకూడా యెను బోతు దిగిపోతాడు. సచ్చీ ఎదవకూడా సావడం మానేస్తాడు. ఎంతటోడికన్నా ఆ బాబుని సూస్తే హడల్ !

"ఆస్పత్తికి గేటుకాడ, కేడిలాక్ కా రెనకసీట్లోంచి దర్జాగా దిగి, గేటుకాడ గూరకావోడి సలావందు కోకుండా ఆస్పత్తిలో నడిసెల్లిపోయీ పెద్దపుల్ని నువ్వెప్పుడైనా సూసేవా ? అదుగో, అలా సూసివో రతన్నంతా. ఆస్పత్తి కొస్తావుంటే; ముందు రేత్తిరి మూడు పురుళ్లుపోసిన మంత ర్సానిముండకూడా హుషారు గుండేది అత నొచ్చేసరికి.

"ఆ బాబుకి పెళ్ళయిందా ?" ఎవరో అడిగేరు.

"నువ్వల్ల కుండొరే. నేకపోతే కీళ్ళిరిసేసి కిటికీలోం చిసిరీగల్ను. సుట్టుపీకంతున్నావ్, నీ కెంత తొందర్రా నంజి కొడకా ? కత సెప్పడం రాస్సరిగదా, యినడంకూడా రాదు మనెదవలకి.

"పెళ్ళయిందిరాబాబూ, అయింది. మాఅమ్మగోరెలా గుంటార నడగవేం ! బంగారబొమ్మ; రతనాల రాసి; ముట్టు కుంటె మాసిపోద్దేమోనన్నట్టు పింగాణీ బొమ్మలా గుండీది. ఆయమ్మ దాహం పుచ్చుకుంటే గొంతులో నీల్లు కనిపించా లన్నమాట.

"ఆ యమ్మ కూకున్నసోట తవ్వితే రతనాల గనుండ వొలసిందే.

"ఆయమ్మ సెయ్యిపడితే గొడ్డుటావుకూడా సూలు కట్టెయ్యాలి.

"ఆయమ్మ సూప్పడితే నువ్వుకూడా యిమానం డైవ రువై పోతావన్నమాట. ఆయమ్మ రాములోరి కాలంలో పుట్టుంటే, సీతూసికి రావణాసురు డెల్లకపోయావోడు.

"అంతందం నా జనమలో సూళ్లేదురా బాబూ! నేను ఆయమ్మని సూసిన కళ్ళతో నిూ దయిద్దరం మొకాలు సూసి, ఆ యమ్మని కూకుండబెట్టి కేడిల్కారు నడిపిన్నేను, బేకుల్లేని దురగమ్మ లారీ నడుపుకోవా ల్సొచ్చిందంటే అంతా నా కరమరా, బాబూ! సారా అమ్ముకున్నాళ్ళో సోడా లమ్ముకున్నట్టున్నాదంటే నమ్ము నా బతుకు.

"నా నారికాడ నౌకరీక్కుదురుకుండీ సరికే ఆరికి మూడేళ్ళబ్బాయి, ఆ తరువాత యింకెవరూ లేరు. యిం కుండకుండా ఆ యమ్మకి ఆపరేసను సేసేరట ఏదో జబ్బు సేసే.

"యింక బ్బాయెలాగుండేవోడంటావేటి? మన నర సిమ్మాలు బడ్డికొట్టుకాడ బాలకిష్టుడి బొమ్మలేదూ? అదుగో అలా గుండేవోడు, గిరిజాల్తో! బంతులాంత బుగ్గలమద్దిల; ముప్పానించీ మూతి; యిదుగో ఇంత ముక్కు; పాలతెలుపు; నవ్వితే ముత్తెలవోన పడ్డట్టుండేది. యిదిగో యీ సేతుల్తోనే పెంచేను.

"కుర్రోడు ఎంత సురుకంటావేటి! ఆరేళ్ళొచ్చీసరికల్లా నా ఒళ్లో కూకుని కార్నడిపీసీవోడు, సదువుతున్న దొర్లర బళ్ళో ఫస్టుపెయిజులన్నీ ఆ బాబువే.

"ఆ డాక్టుబాబుకి నానంటే ఎంత దయా! ఎంతబి

మానం! ఏం పండుగొచ్చినా.... ఆకిరికి పీర్లపండు గొచ్చినా సరే "యిందరా ఎంకటేశా! యీ పదిరూపాయలూపట్టుకెళ్ళి పిల్లల కేదన్నా కొనిపెట్టరా ... అనిచ్చేవోడు. నాకు పిల్లల్లేరనీ, మా యాడదాన్నేత మూడుముళ్ళూ వేసి న్నేనుగా స్సరికదా, మూడుకళ్ళన్న యీశ్వరుడుకూడా కనిపించలేడనీ, ఆ బాబు కెన్నిసార్లు సెప్పినా గేప ముండేది కాదు.

పొద్దు న్నెనిమిది గంటల కాస్పత్తిరి కెల్తే మళ్ళీ రేత్తి రెనిమిది గంటలకే తిరిగి రావడం. యీలోన చేతుల్నిండా పనే. నూర్రూపాయల్నోటూ, నూరిన కత్తులూ పట్టుకుందుకే పుట్టే డా బాబు. రేత్తి రింటికొచ్చి తాన్నవాడి అమ్మగారి కెదురుగా కూకుంటే సాలు ఆ బాబు మొహం లారీ లైట్లా గెలిగిపోయీడి. ఆ యమ్మంటే అతని కంతపేమ.

"తాగీవోడా మీ డాట్రు?" ఎవరో అడ్డుతగిలేరు.

"ఎవడ్రా నువ్వు? రాములోరి పుట్టినోజుకి, రహీం సాయిబు తద్దినానికి వీటా సంవందం! ఆ బాబు తాగితే నీకేం? తాక్కపోతే నీ కేంరా? బొన్రా, తాగీవోడ్రా! తాగీవోడు. నీలా బెల్లంసారా మట్టుక్కాదు. ఆ బాబు తాగీబుడ్లు సూస్తేనే, పువ్వులుగుచ్చి టేబులుమీద ఎట్టుకోవా లనిపిస్తాది. అంత బావుంటాయి. యింకాటి కరీదు యింటే గుండె పగిలి సస్తావ్, వల్లకుండు. కద సెప్పనీ.

"యింత మంచోడైనా ఆ బాబు కొకటే లోపం. సెందురికీ మచ్చున్నట్టు. బీదోళ్ళంటే గిట్టదు. దరమం అస లెరుగదు. అతన్తోపోలిసి చూస్తే మన దురగమ్మ నాలుగు

కేతులున్న దరమడేవతే ననుకో, ఆ బాబెదుకే ముష్టోడు పడి సస్తాంకే అకాన్న మందియ్యాడు. అణా దరమ మియ్యాడు.

"ఆ బాబు జనమలో ఏదో రహిస్సెం వుండంటా దసీ, ఎప్పుడో బీదోళ్ళ కేత కండుజెల్లు తినేసుంటాడనీ అను మాన మేసీది. ఆకిరికి ఎలాగైతేనేం పట్టేసే సా రహిస్సెం.

"ఆ బాబూ, మా యమ్మగోరూ మేనత్త మేనమాం పిల్లలట. సిన్నప్పుడు ఒక టేబిలుకాడ తిని, ఒగ్గదిలో పడు కుండేవోరట. సిన్నప్పట్నుండీ ఒకళ్ళ నొకళ్లు పెళ్ళి సేసు కుందా రనుకుండీవోరట. ఆళ్ళ పెళ్ళి మొదట్లో ఆళ్ళ పెద్దో ళ్ళకీ యిష్టమేనట.

"కానీ మా బాబు పరీచ్చై ప్రాక్టీసు పెట్టేసరికి అత నాస్తంతా అరించిపోయిందట. అతని తండ్రి తనాస్తంతా పండెపు గుర్రాలతోకలకీ, పట్నపుసానుల కోకలకీ ముడెట్టేసి సచ్చిపోనాట్ట. ప్రాక్టీసు పెట్టబోయ్యాసరికి పకీరై పోనాట్ట. మా బాబు, అతగోడిమేనమాంకి ముప్పైలచ్చలాస్తుందిట. 'నాలా ముప్పైలచ్చలాస్తి నేకపోతే పోనాదిగాని, మూడుకాన్లు కరీదు సెయ్యవ్. నీ కెలాగిచ్చేది పిల్లనీ,' అనేసేట్ట మా బాబుతో. అప్పుడు మా బాబు 'మూడేళ్ళు టయమియ్యి. మూళ్ళచ్చలు పట్టుకొస్తే పిల్లనియ్యి. నేకపోతే నీకూతుర్ని నీ కిష్టమొచ్చినోడి కిచ్చి పెళ్ళిసేసెయ్యి. నే నొచ్చి అచ్చింత లేస్తా,' అని బతిమిలాడి మూడేళ్లు టయంపొంది కత్తిపట్టి ప్రాక్టీసు పెట్టేట్ట.

మొదట ముణ్ణెల్లూ మూణ్ణాల పరక రాకపోయినా,

తర్వాతందుకుందా బాబురాశి. ఆ మూడేళ్లూ ఆ బాబు
ిద్దశేషోనేదుట.(అసలన్న వేఁ బోంచెయ్యలేదట) లచ్చమీద
లచ్చ లారిజించి పారీసీట్ట. మూడేళ్ళూ అయ్యాసరికి 'ఇదిగో,
మాఁవాఁ! మూళ్ళలచ్చలమీద మరో అరలచ్చ మిగి
ల్చేను. యిస్తు డేటంటావ్?' అని మా యమ్మగోర్ని
పెళ్ళాడేసీట్ట.

"కాని ఆ మూడేళ్ళలో పట్టుకున్న దన దాహం. మరి
డమ్మకు పట్టుకున్న రకత దాహంలా, మన దురగమ్మ
కూతుర్ని పట్టుకున్న తురకదెయ్యంలా మరొగ్గలేదా బాబుని.
లచ్చిందేవికి తన బతుకు బలిచ్చీసినా డనుకో.

"ఇలా గుండగా మూడేళ్ళొద్దిప్పటికి. ఆవేల దసరా
దసిఁవిఁ. ఆ బాబు ప్రేక్టీసెట్టిం దాపొద్దే. రేత్తిరి కింట్లో
పెద్దపారిటీ ఏర్పాటు చేసినాడు. ఆ మద్దేన్నం రెడయ్యా
వరకు పన్జేసి కారెక్కి 'ఎరి మద్దేన్నం రావద్దు పోసిరా ఎంక
టేశా' అన్నాడు. నేను కారు లాగించి. – కారంటే కారా
రెక్కల్లేవుగాని గాల్లో ఎగిరిపోద్దనుకో. అసల్దానింజను
యిమాన పింజనట – నాకు గేటు దాటించ బొయ్యాసరికి
అడ్డంగా రోడ్డుమీద లారీ వస్తె గేటుదాటి కారాపేసేను.
గూరకావోడు గేటేసేడు. నాను గేరు మారసబోతూవుంటే
పరిగెత్తుకొచ్చే డొకే ఓ జాలడోరు. మని పెలాగున్నా డను
కున్నావేటి! గట్టునబడి మొన్నటిపొద్దు సచ్చిపోయిన నల్ల
సేపలాగున్నాను. ఆడు నిలబడుంటేనే బతికున్నాడనుకుం
టాంగాని పడుకోబెడితే సచ్చిపోయే డనుకుంటాం.

"ఆడి వొంటికి గోసీ తప్ప వేల్నాదు."

"కంటిని సీకటితప్ప మరేట్నిదు."

"బాబూ! డాట్రుబాబూ! రచ్చించు, రచ్చించు, పిల్లోడు సంద్రంలో పడిపోనాడు. అల్లదిగోమావోళ్ళు మోసు కొస్తున్నారు. బాబ్బాయి! యిటి కెళ్ళిపోకు; రచ్చించు," అని కారు కడ్డం పడ్డాడు.

"ఈడి నెత్తిని భేడకా సెడితే, అణాపరక్కూ ఎవుడూ కొండు, యిప్పుడింటి కెళ్ళకుండా యీడి కొడుకుని రచ్చిస్తే యీ డేటిస్తాము! ఏటివ్వగల్డు! యిశ్వాసం ఎవుడిక్కావాలి! పావలాపర కిచ్చి కల్లురొట్టి కొసిపారేస్తె యీదికుక్క సూపుద్ది యీడికంటే ఎక్కు విశ్వాసం," అని మా బాబను కున్నట్టున్నాడు. అసలా బాబేటనుకున్నా నాకు తెలిసి పోద్దిలే.

"ఆ బాబు ఆ జాలారోడ్డొం కోపాలీ, నావొంకోపాలీ సూసి 'దరమాసుపత్తిరికి తీసికెళ్ళం,' డని ఆడ్తో అని, 'పోనీరా' అన్నాడు నాతో, నాను పోనిచ్చినాను.

"మా వెల్లబోయీసరికి ఆనందు కలకటేరు కొడుకు పుట్టిన్రోజు పారిటీ కెళ్ళేడు. 'రండి రండి' అంటూ మా యమ్మగోరెదురొచ్చినాది. మా బాబు కారు దిగి 'వణ్ణం దిని బేగి రారా ఎంకటేశా! డ్యూళ్ళో కెల్దారి, అని నన్ను పంపించీసేడు.

"అరగంటలో వణ్ణా దిని నా నొచ్చీసినాను. అప్పుడుకే సూటేసుకొని తయారై పోనాడాబాబు. కారెక్కు 'జెనర లాస్పత్తిరికి పోనీరా,' అన్నాడు మాం ఆసుపత్తిర్లో కెల్లి బొయ్యీసరికి మా కారుజూసి ఓ డాట్రు పరిగెత్తుకొచ్చి

నాడు. యిలా ఎలా పరిగెత్తే డనుకున్నా వేటి? అల్లప్పుడు మన సిటీసర్వీసు సివంచలంగోడి బస్సున్స్టూడెంటు కుర్రోళ్లు తగల బెట్టేసి, సివంచలంగోడిని కాలిశీనాడికి ఆ డెంటబడితే ఆడు పరిగెత్తినాడే - అప్పు డ్నేను నాయనకొట్లో టీ తాగు తున్నాన్లే - అదుగో ఆ సివంచలంగోడ్లా పరుగెత్తుకొచ్చినా డా డాట్రు. ఆ బాబూ, మా బాబూ వేదో యింగ్లీసులో మాటాడుకొని పరిగెత్తినారు. ముందాళ్ళా, ఎనక నేనూ ఏకబిగిని మూ డంతస్తు లెక్కేసినాం. తోవలో ఆగపడ్డ పెతీ డాట్రూ మా యెనక బడ్డాడు.

"మూడో అంతస్తు జేరేక ముందున్న డాట్రు ఒగ్గది తలుపు తీసినాడు. మా బాబు గదిలో కెల్లబోయి గదిలో నేల లేనట్టు నిలబడిపోనాడు నానెళ్ళి సూద్దునుకదా!

"గది మద్దిల బల్లమీద మా అబ్బాయి బాబు సచ్చి పడున్నాడు. నీరు మింగీసేడేమో, కడుపు బంతిలాగైపొనాది. బాబూరే! నేజైప్తా నినుగో. నను కన్నతండ్రి నా సేతుల్లోనే పేనా లొగ్గేసినాడు. నన్ను కన్నతల్లిని యిదుగో, ఈ సేతుల్తోనే బూడిద సేసీసేను. అప్పుడు కూడా నా కంత కష్టం కలగలేదంటే నమ్మండొరే.

"వచ్చేవా నాన్నా?" అన్నట్టు అబ్బాయి బాబుకళ్లు మావేపే సూస్తున్నట్లున్నాయి. కాని చిత్తరవేటంటే మా డాట్రుబాబు ఒక్క మాట మాటాడితే నిన్ను సంపుకుతిన్నం తొట్టు. ఒక్కకన్నీటిసుక్క రాలుస్తేనానుబారికాడికి పుట్టినట్టు.

"అబ్బో! గొప్పాళ్ళ కష్టసుకం ఒక్కనాగే అన్నబ గించీస్తారు. మన బీదెవవలే - యెవడన్నా మన గుడిసెలకాడి

కొచ్చి బీడీ కాల్చుకోనాడికి అగ్గిపుల్లగీస్తే కొంప లంటించీసి నట్టు గోల సేసేస్తాం. మన పిల్లోడికి రెండిరోసినా లై తే సచ్చి పోయినట్టే ఏడిసేస్తాం. కాని గొప్పోళ్ళలా కాదులే.

"సుట్టూ వున్నవాళ్ళంతా కుసింత తెలుగులో, ఎక్కు-విం గ్లీషులో మా బాబుతో ఏటేటో జెప్పేరు. నా కరద మయిం దేదంటే - మాఅబ్బాయిబాబు ఆస్పత్తిరి కొచ్చిన ఎంటనే పేనం ఒగ్గేసినాడనీ, పావుగంట ముందొస్తే సచ్చి పోయావోడు కాడని మాత్తరం అరదవైయింది.

"ఆకిరి కెలాగైతేం నాలుగ్గదులు దాటి యీది వొరండాలో కొచ్చినాం. ఆ గుంపెనకాల నానున్నాను. ముందు మా బాబున్నాడు.

"వొరండా మలుపు దిరగ్గానే మా బాబు దెయ్యాన్ని సూసినట్టాగిపోనాడు. ఏమైందో ఏటోనని నాను ముందు కెళ్ళి సూద్దునుకదా! మా కెదురుగ్గా ఎవుడొచ్చినా డంటా వేటి? సచ్చిన నల్లసేప శవం జాలారోడు 'పిల్లా డెలాగు న్నాడు బాబూ,' అంటూ ముందర కొచ్చినాడు.

"ఆడ్ని సూసేసరికి మాబాబు కాళ్ళాడక, పక్కనే బెంచీమీద కూలబడిపోనాడు. మోకాళ్ళమీద సేతు లెట్టు కొని, సేతుల్లో మొక మెట్టుకొని ఉండచుట్టుకుపోనాడు. కా నప్పుడుమాత్తరం మాబాబు కన్నీటిసుక్కలు ఆ బాబు జోళ్ళమీదే పడ్డాయెరే!

"కాని ఆ బాబుదగ్గర కెవరూ ఎల్లనేలేదు. కాస్సే పేడిసేస్తేగాని దుఃఖం కడుపు కోసేస్తాదని మావంతా వల్లకుండిపోనాం.

"అయిదు నిమిసా లయ్యేక ఒక ముసిల్డాట్రు మా బాబుకాడ కెల్లి బుజమ్మీద సెయ్యేసి నెగమన్నాడు. కాని మా బాబు నెగనేదు. ఆ ముసిలాడు కిందిపినాడు. కిందపీసరికి కింకేటుంది. మా బాబు నేలమీది కొరిగిపోనాడు. అంతా క్లోజైపోనాది.

"ఆ బాబ్బతికున్నన్నాళ్ళు బీదోళ్ళ కేసాయం సెయ్యనేదు. ఆళ్ళని సచ్చిన పురుగుల్లా సూసేవోడు. ఆళ్ళు కూడా తన నలాగే సూస్తా రనుకునేవోడు కాబోలు. ఆ జాలారెదవ తన పిల్లోడిపట్ల యింతబినూనం సూపిస్తాడను కొనుండడు.

"బిడ్డ సచ్చిన సాక్కు (shock) నిలబడినాముగాని బీదోడు సూపిన సత్తేనికి నిలబడ్నేపోనాడు. ఆ సాక్కు సచ్చి పోయి ఆసుపత్తి రొరండాలో దిక్కుమాల్న సెనంలా పడి పోనాడు," అని అతను ఆగి బీడీ ఆఖరిదమ్ములాగి, కిటికీ లోంచి విసిరేసి, తనకథ ఎఫెక్టుకోసం అందర్నీ కలియజూసేడు.

"మీ యమ్మగో కేకైనారు." యెవరో అడిగేరు.

"ఏఁవొద్ది, కనుకున్నాను పోనాడు. కట్టుకున్నోడు పోనాడు. ఆళ లగ్గిలోపడి పోనాయి.

"ఇంతకీ కంట్రాక్టరు కనకయ్య సత్తే మెకానిక్కు ముత్తుస్వామిగో డున్నాడనుకోఁవానికి మన దురగమ్మలాటి దిగా దొరే మా యమ్మ.

"అయమ్మకత మరోపాల్సెబుతాగాని, దిగుదిగు టేస నొచ్చీసినాది." అంటూ అతను కైలు దిగిపోయేడు.

—o—

వెయ్యి ప్రశ్నలు ఇవ్వని జవాబు

ఆరోజు రాధకి బాగా జ్ఞాపకముంది. ఆ సుదినం ఆమె హృదయంలో చెరగని ముద్రవేసి పోయింది. నాడే ఆమెకు తన భావిభర్తతో విచిత్రపరిస్థితుల్లో పరిచయమవడం, ఆ పరిచయం మొదట ప్రణయంగానూ ఆ తర్వాత పరిణయంగానూ మారడం జరిగింది. ఆరోజు తన జీవితంలో ముఖ్యమైనదానిగా నాడే గుర్తుపట్టలేకపోయినా, త్వరలోనే దాని ప్రాముఖ్యతని గుర్తించి దాని వివరాలు మధుర స్మృతులుగా తన హృదయంలో దాచుకుని వీలైనప్పుడల్లా వివరాలు బైటకుతీసి వివరంగాచూసి మళ్ళీ హృదయంలో పెట్టి తాళంవేస్తుందామె. ఆ నాడు....

ఆనాడు రాధా, జానకి, కమలా, అరుణా ఆఖరుసారి విశాఖపట్నం సముద్రపొడ్డున కూర్చున్నారు. తమ స్నేహితురాలు నిర్మల పెళ్ళికి విజయనగరంవెళ్ళి తిరుగు ప్రయాణంలో విశాఖపట్నంలో వాళ్లు గడిపిన మూడ్రోజుల్లోనూ ఆఖరురోజది....మర్నాడే హైదరాబాదు వెళ్ళిపోవాలి వాళ్ళంతా.

హైదరాబాదు చేరినవెంటనే తాత్కాలికంగా ఆగిపోయిన తమ యాంత్రికజీవితాలు మళ్ళీ ఆరంభమవుతాయి.

నిద్ర పూర్తిగా తీరకుండానే లేవడం-రుచిలేని కాఫీ-విసుగుపుట్టించినా తప్పనిసరైన ముస్తాబు - పది గంటల తొందర భోజనం - చెమటలు కక్కించే బస్సుక్యూలు - ఆస్పత్రిని గుర్తుకు తెచ్చే తెల్లగోడల ఆఫీసు బిల్డింగూ - ఆఫీసులో తోడేళ్ళ చూపుల ఆకలీ - కొక్కిరిగీతలు పెడ్తూ పరిగెత్తే పెన్సిళ్ళ విరిగిన ముళ్ళూ - తలని బద్దలుచేసే సైపు మెషిన్లలోహపుచప్పుడూ - ఆనందం యివ్వని వాచీకొట్టే అయిదుగంటలూ - తమకంటే చిన్న వయస్సుగల మగ స్టూడెంట్లు తమని ఆకర్షించడానికి బస్సుల్లోనూ, సినిమా ల్లోనూ, చేసే వెకిలిచేష్టలూ - అలసిన పరుపులూ - తీరని నిద్రా - తోటి స్త్రీలలా లేమనే వ్యథా - ఇవీ వారి హైదరాబాదు జీవితాలు.

వాళ్ళెవరికీ సిగరెట్లు కాల్చాలనీ, పాంపేను తాగాలనీ సినిమాల్లో వెయ్యాలనీ, స్విట్జర్లేండు వెళ్ళాలనీ కోరికలులేవు. తమకు వున్న సాదా దుస్తులు వారికి ఆశాంతి కలిగించవు. జీతాలు పెంచమని వారు కోరలేదు పన్నులు తగ్గించమని కోరలేదు. సిటీబస్సులు యెక్కువ చేయమని గాని, రేషనింగు పెట్టమని గానీ, కాంగ్రెస్ గవర్నమెంటుని రాజీనామా యివ్వమనిగాని వారు కోరలేదు.

వాళ్ళకున్న ఒక్క కోరికా పెళ్ళి చేసుకుందామని,

తోటి స్త్రీలాగే సంసారాలు చేద్దామనీ, పిల్లల్ని కందామనీ.

ఆ నలుగురిలో ఏ ఒక్కరికీ పెళ్ళి కాలేదు. పెళ్ళి కాలేదన్న బెంగా, వేగం చేసుకుంటే బాగుండునన్న కోరికా నలుగురికీ వున్నాయి. పెళ్ళికావలసిన వయసు త్వరగా దాటిపోతున్నాదని వాళ్ళందరికీ తెలుసు. ఇక బహుశ పెళ్లి కాదేమోనన్న వ్యక్తం కాని భయం వాళ్ళందర్నీ లొంగదీసుకొంటూంది.

వాళ్ళల్లో ఎవరికీ 23 ఏళ్ళ కి తక్కువ వుండదు. కాలు మీద కాలేసుకుని తిండానికి ఆస్తి లెవరికీ లేవు. అన్నదమ్ములూ, వదినెలూ అందరికీ వున్నారు. కొందరికి ముసలి తండ్రో తల్లో వున్నారు. వాళ్ళను జీవితాంతం పోషించే భారం మీదను వేసుకోడానికికాని వారి పెళ్ళిళ్ళ బాధ్యత తీసుకుందికి కాని ఎవరూ సిద్ధంగా లేరు.

పొట్ట చేతో పట్టుకుని సైపు మెషీన్లు జోలిలా మెళ్ళో వేసుకొని హైదరాబాదు వాళ్ళలో ఎవరూ రాకపోయినా అంతా ఉపాధికోసమే ఆ భాగ్యనగరం చేరేరు. కష్టపడో, సులభంగానో కంపెనీల్లో స్టెనోటైపిస్టు ఉద్యోగాలు సంపాదించుకో గలిగేరు. అంతా ఒకే హాస్టల్లో వుంటున్నారు.

వాళ్లు రంభ, ఊర్వశి, తిలోత్తమ, మేనకలు కారు. వాళ్ళని చూసిన వాళ్లెవరూ "దివినుండి దిగినచ్చిన నలుగురు అప్సరసల్ని చూస్తేం" అనుకోరు. పెళ్లిళ్ళు కానందువల్ల

ఆరోగ్యంగానూ, కాలంతో వున్నందువల్ల ఉండవలసినకంటే ఆకర్షణీయంగానూ, ఉద్యోగాలు చేస్తున్నందువల్ల ఎరుపు మెరుగులతోనూ వాళ్ళుంటారు. నలిగిన నూలుచీరెలు కట్టుకొని మాసిన జాకెట్లు వేసుకుంటే వాళ్ళని ఏ బస్సులోనో, సినిమాలోనో చూసిన ఏ మొగోడూ మరోసారి చూడ్డానికి కూతూహలం పడకపోవచ్చు.

వారంతా అత్యంత సౌందర్యం, ప్రత్యేక ఆకర్షణలేని మామూలు స్త్రీలు. కాని కురూపులు కారు. ఒకరికి నల్లని పొడుగాటి జడవుంటే మరొకరికి అందమైన ఉంగరాల నొక్కుల జుత్తు, ఒకరికి శరీరచ్ఛాయ కాస్త తక్కువైతే మరొకరికి కాస్త పల్లపుముక్కు. వాళ్ళలో ఎవరు ఎక్కువ అందమైన వాళ్ళన్న ప్రశ్నకి జవాబు సులువుగా లభించదు.

"అదృష్టవంతురాలు హాయిగా పెళ్లి చేసేసుకుంది. నిర్మల" అంది సన్నిహితులున్నప్పుడు ధారాళంగా మాటాడే అరుణ.

"ఏం బాగున్నాడే? దాని మొగుడు!" అంది జానకి నిర్మల భర్తతప్ప ప్రపంచంలో యితర మొగళ్ళంతా చచ్చినా తాను అతన్ని పెళ్ళాడ్డిల్లనన్నట్లు మొహంపెట్టింది.

"తల మాసినవాడెవడో ఒకడు పెళ్ళిచేసుకుంటే బాగున్నానే వయిసొచ్చేస్తున్నాది మనందరికీ" అంది కమల పులి కోరలాంటి పళ్ళాన్ని బైటపెడ్తూ.

"అలా అయితే అడుగో! అన్నెవరో ఒకరు పట్టండి"

అని అరణ వాళ్ళత్తో అని "అన్నయ్యా" అని కాస్త దూరంలో తలవంచుకుని నవుస్తున్న తన అన్న శేఖరాన్ని పిలిచింది.

శేఖరం వాళ్ళ వద్దకు వచ్చేడు. పరిచయాలు అరుణే పూర్తిచేసింది. శేఖరం విజయవాడలోని ఒక పెద్ద కంపెనిలో ఎకౌంటెంటు. అతని జీతం గుమాస్తా జీతానికి ఇరవైరూపాయలు ఎక్కువ. ఆఫీసరు జీతానికి రెండు వందలు తక్కువ. అనుకోకుండా విశాఖపట్నం కేంపుమీదొచ్చేడతను.

పరిచయమైన వెంటనే "అన్నట్టు చెప్పడం మరచేను. మీవూరే నాకు ట్రాన్స్‌ఫరైంది," అన్నాడు శేఖరం అందర్నీ ఒక నవ్వుతో చుట్టేస్తూ చూసి.

ఆ వార్తకి అంతా సంతోషించేరు. సంభాషణ అందరి మధ్యా సాగుతూనేవుంది.

ఈలోగా స్నానం చేసిన సద్రాబ్రహ్మళ్ళ నిండు చంద్రుడు – సముద్రంలోంచి లేచేడు.

సము దాన్ని అలలు చిన్న పిల్లల్లా అల్లకల్లోలం చేసేస్తున్నాయి.

ఒక కొబ్బరిచెట్టు ఆకులు వెన్నెలకి తడిసి మెరిసేయి.

రాధ కళ్ళు ఆనందంతో మిలమిల్లాడేయి వారంతా మాట్లాడుతున్న కొద్దీ శేఖరం తనపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నాడని ఆమె గ్రహించింది అతని మొహంమీద వెన్నెల

పడకపోయినా అతనుయెటు చూస్తున్నాడోకనిపించకపోయినా అతని చూపుల వెచ్చదనం తనని అలుముకుంటున్నట్లు ఫీలైందామె.

సినిమాలనుంచి సింహాచల యాత్రవరకూ అనేక విషయాలు మాటాడి వారు లేచేసరికి తొమ్మిద్దాటింది. మిగతా వాళ్లని వాళ్లి హోటల్‌వద్ద విడిచి శేఖరం శలవు తీసుకుంటుంటే "వీళ్ళ ముగ్గుర్లో ఎవరో ఒకర్ని పెళ్ళాడెయ్ అన్నయ్యా!" అంది అరుణ స్నేహితురాళ్ళని హేళన చేస్తూ.

బరువైన సిగ్గు అందరి తలలూ వంచింది. కాని రాధ మాత్రం శేఖరం దించిన కళ్ళతోనే తనవేపు చూడడం తన కంటి కొసల్నుండి చూడగల్గింది. శేఖరం మరి తలెత్తకుండా వెళ్ళిపోయాడు. "ఓ-అలాగే తప్పకుండా!" అంటూ.

* * *

"ఓ - అలాగే తప్పకుండా!" అన్నారు జానకీ క్రమంగా వాళ్ళని రాధా శేఖరం తమ వివాహానికి ఆహ్వానించినప్పుడు.

బేండు రండోళ్ళూ, సన్నాయి నొక్కులూ, లౌడ్ స్పీకర్ల కీచు పాటలూ; స్నేహితురాళ్ళ కిలకిలలూ, మత్తుగా లేచే ఊదొత్తుల సీలిపొగలూ, అర్థంకాకపోయినా శ్రావ్యంగా వినిపించే మంత్రాలూ, అలలుగా లేచే సెంటువాసన్లూ, తలంటిపోసుకున్న ఆడాళ్ళజడలూ, కష్ట సుఖాలనుభవించిన

పురోహితుల నెరిసిన తలలూ, నిండయిన ముత్తయిదువుల కుంకుమబొట్లు ఎరుపూ పెళ్ళిలో రాధ చుట్టూ అలుము కుంటున్న మత్తు తెరలుచించి ప్రస్తుతాన్ని ఆమె ముందుం చాయి.

"అదృష్టవంతురాలు హాయిగా పెళ్ళి చేసుకుంది. అంది జానకి కమలతో హాస్టల్ చేరాక.

"మొగుడు కూడా చూడ్డానికి పర్వాలేదు" అని తన అభిప్రాయం వెలిబుచ్చింది కమల.

పెళ్లయిన కొన్నాళ్ళవరకూ దివికి భువికీని ఇంటికీ ఆఫీసుకి ఉన్నంత దూరమే - వుందనిపించింది రాధకి. ఆమె ఇంద్రధనస్సునీడ నాట్యం చేసింది. మేఘాల అంచున ప్రయాణం చేసింది.

కొన్నాళ్ళవరకూ -

గులాబీ రేకుల మధ్య సిగ్గు దొంతర్లు కనిపించేయామెకి. మల్లెపందిర వలపుపూలు పూసిందామె దృష్టిలో. చంద్రుడికి చల్లని చందనం వాసన వున్నట్టనిపించింది. తన బస్సు వెళ్లే తారురోడ్డు చెక్కిళ్లలో అగుపడేదామెకి .... ఆఖరికి పైపుమెషిన్ల చప్పుళ్ళతో వింత సంగీతం వినిపించే దామెకు.

ఆమె చెక్కిళ్లు గులాబులు వూసేవి శేఖరాన్ని చూసి నప్పుడల్లా.

కాని యిదంతా కొన్నాళ్లే!

కాలం దొర్లుతున్నకొద్దీ రాధ స్వర్గంనుండి ఈ ప్రపంచంవేపు గబగబా రా సాగింది.

పెళ్లయిన నెల తిరగ్గానే పాలవాడు పాల్లో కలిపే నీళ్లు గుర్తించగలిగింది.

రెణ్ణెల్లు కాకుండానే కందిపప్పు శేరు రెండున్నర దాటిందని తెలుసుకొంది.

మూణ్ణెల్లలో తనకి వచ్చిన ఐదు రూపాయల ఇంక్రిమెంటూ వచ్చినా ఒకటే మూనినా ఒకటేనని గ్రహించింది.

నాల్నెల్లలో ఒక మనిషికి నెలకి యెంత ఖర్చౌతుందో యిద్దరు మనుషులకు అంతకు రెండింతలు పైగానే ఖర్చౌతుందనీ తెలుసుకొంది.

ఐదు నెల్లయేసరికి మెటర్నిటీలీవు వివరాలు నేర్చుకుంది అవసరమొచ్చి.

ఇన్ని తెలుసుకున్నా రాధ తెలుసుకోలేంది ఒకటే! శేఖరం తనలో దేన్ని చూసి తన్ని భార్యగా స్వీకరించాడు! తనకంటే జానకి తెలుపు; తనకి నల్లని పెద్ద జడుంటే కమలది ఉంగరాల నొక్కులజుట్టు. తన యిద్దరి స్నేహితురాళ్ళకన్నా తాను యెందులో మిన్న! కాని వొక విషయం మాత్రం నిశ్చయం, సముద్రపొడ్డున తమందరినీ చూసిన దగ్గర్నించీ శేఖరం తనని ప్రత్యేకంగా చూడసాగాడు. కాని ఎందువల్ల? ఎంత తర్కించినా యీ ప్రశ్నలకు జవాబు ఆమెకు దొరకలేదు.

ఈ ప్రశ్నకి సమాధానం తెలుసుకుందామన్న కుతూహలం పెళ్లికి ముందే బీజంగావుండి, పెళ్లి తర్వాత మొలకెత్తి సంవత్సరం తిరిగేలోగా ఊడలు తన్నిన జడలమర్రిలా విస్తరించిపోయింది. క్రమేపీ ఆ తలపే అమె మనసునంతా ఆక్రమించుకొంది. భర్తనే సమాధానం అడుగుదామనుకుండేది. కాని యెప్పుడు అడుగుదా మనుకున్నా సిగ్గు ఆమె పెదవులను విడనివ్వలేదు.

* * *

పెళ్లయి సమంగా ఆ రోజుకి సంవత్సరం. ఆ రోజు ఆమె భర్తను ఆ విషయం అడిగెయ్యదల్చుకుంది.

"నే నొకటడుగుతాను చెప్తారూ ?" లాలనగా ప్రశ్నించింది.

"ఊ" విసుగ్గా మూలిగేడు శేఖరం ఇప్పుడీ హాస్కీమిటన్నట్టు తన్ను దగ్గరికి తీసుకుంటూ.

"అబ్బా, చెప్తే నే"

"ఏమిటో అడుగు"

"అబద్దం ఆడరు కదూ ?" నిజంకాని సందేహం వెలిబుచ్చింది మాటలకు తడుముకుంటూ.

"ఆడను"

"ఒట్టు ?"

"బట్టు !"

"మీరు నన్ను చూసినప్పుడే నన్ను ... అందర్లాగే చూళ్ళేదు కదూ ?"

"....."

"నాలో ఏం చూసి పెళ్లాడేరు నన్ను"

"....."

"చెబ్దురూ ?"

"అందర్నీ చూసినట్టే నిన్ను చూళ్ళేదు,"

"ఏం ?"

"ఇప్పుడు నన్నా విషయం అడక్కు రాధా !"

"ఒట్టేసేగు నా కేం" అంది మంచంమీద జారి పోతూ.

"వెంటనే చెప్తానని ఒట్టెయ్యలేదుకదా ! చెప్తా తప్పకుండా చెప్తా, కానిప్పుడుకాదు. నాలుగేళ్ళు పోయాక సమంగా యిదేరోజుని మళ్ళీ అడుగు అప్పుడు చెప్తా. తప్పకుండా చెప్తా" అన్నాడు, ఆమె దగ్గరకు వెళ్తూ.

రాధ అతన్ని చెంత చేరనివ్వలేదు. సమాధానం వెంటనే కావాలని చిన్నపిల్లలా మారాం పెట్టింది. పాములా బుసకొట్టింది. ఏడాది కాపురంచేసిన పెళ్లాంలా దబాయించింది. శేఖరం బతిమాలేడు. లాలించేడు. బుజ్జగించేడు. ఎలా ఐతేనేం బుజ్జగింపబడ్డానికి వప్పుకుంది రాధ.

• • •

రోజులూ నెలలూ పెనవేసుకొని పొడగ్గా సంవత్సరా లౌతున్నాయి.

బియ్యంలో రాళ్లు- యిళ్ళద్దెలా జాస్తి ఔతున్నాయి పాలవాడి దృష్టిలో పాలకీ నీళ్ళకీ తేడా పూర్తిగా పోయింది బస్సుల్లో నిలబడ్డ ఆడవాళ్ళకి మగాళ్ళు సీట్లు యివ్వడం తగ్గిం చేస్తున్నారు. రాధ కూతురు, తర్వాత వుట్టిన కొడుకుని పీలైనప్పుడల్లా కొడుతుండి.

నెలకి నాలుగుసార్లు సినీమాలుచూసే రాధ నెలకో సినీమాకి తగ్గించేసి అంతటితో సంతృప్తిపడక పిక్చర్లో పెట్టు కోక తనింటికి దగ్గరగావున్న హాలులకే వెళ్ళడం ప్రారంభిం చింది. రిక్షాచార్జీలు మిగుల్చుకుందికి.

జీవితం ఆమె దృష్టిలో ఇంద్రధనసు రంగులు కోల్పో యింది. సైపు మెషీనుల చప్పుడులో రాగం పోయింది. చప్పుడు సమ్మెట దెబ్బల్లావుంది. తారురోడ్లు మళ్ళీ ఎప్పట్లా నల్లగా అసహ్యంగా కన్పిస్తున్నాయి.

చిరిగే చీరలు - పాలడబ్బాల బ్లేక్ మార్కెట్ - బిడ్డల వేడుపు వంటాలస్య మైందన్లో - చాకలి బట్టలు తేలే దనో. భర్త చీదరింపు, ఆఫీసుకు పోడానికి బస్సు దొరకదన్న బెంగ-ఇరుగింటివారికి పంచదారఐపోయి అప్పివ్వకేమో నన్న అనుమానం - తానే డబ్బు అప్పుచేయవలసి వచ్చే 20 వ తారీఖులోగానే పొరుగింటావిడ తనవద్దకి అప్పుకి వస్తుం దేమోనన్న భయం- ఏ చుట్టమో పక్కమోవచ్చి తనింట్లో

తిష్ఠవేసి హైదరాబాదంతా తాపీగా చూస్తాడేమోనన్న భీతి. ఆమెని నిత్యం ఆరాట పెడుతూనే వున్నాయి.

తనదీ తన భర్తదీ చాలని జీతాలు. పెరుగుతున్నకొద్దీ సంసారం పెచ్చౌతున్నకొద్దీ ధరలూ ఆమెని నిత్యం ఆరాట పెట్టేవి. జీవితంలోని ఆనందాన్ని ఏ అజ్ఞాతశక్తో దోపిడీ చేసింది.

తన అశాంతికి కారణాలు ఆమెకు తెలియవు. దినుసుల కరువూ, పంచదార బ్లేక్ మార్కెట్టూ, తమ జీతాన్ని ఓడించి పెరిగిన ధరలూ, పొడుగాటి బస్సుక్యూలు కావచ్చు. లేక పోతే వైవాహికజీవితం పాతబడి దానిలోనిమొజు మాయమై దాని బాధ్యతలే అసహజమైన పెద్దసైజులో కనిపించి ఆమెలో నిరాశా, నిస్పృహా, విసుగూ కలిగించి ఉండవచ్చు.

కానీ, తనకీ భర్తకీ మధ్య అనురాగం తగ్గలేదని తెలుసు. ఆ అనురాగం వ్యక్తం చెయ్యవలసిన సందర్భాలు మరీ అరుదైపోతున్నాయి. అంటే- నిత్యం జీవితంలో ఆమెకు ఏదో వెలితి కనిపిస్తూనేఉంది. అయిదేళ్ళ పాతదనం - చిరిగిన చిరునవ్వులు - పగిలిన ఆశలు - అర్ధంకాని వెలితి జీవితంలో ఓటమి - బతుకులో విసుగూ, ఆమె వైవాహిక జీవితంలోని ఆనందాన్ని హరించేసేయి.

మల్లెపందిర మల్లెపూలే పూస్తోంది.

గులాబీ రేకులమధ్య శూన్యంతప్ప మరింకేమీ లేదు.

చంద్రుడికి చందనం వాసన పోయింది.

పైపు మెషీన్ల చప్పుడు సమ్మెట దెబ్బల్లావుంది.

* * *

ఆరాత్రి ఆమె కిటికీ తెరిచింది. నిండు చంద్రుడు ఆమెని పలుకరించేడు. నెలకోసారి యింట్లో వసూలు చేసేవాళ్ళ వచ్చే చంద్రుడిలో ఆమె యే కొత్తదనమూ చూళ్లేక పోయింది.

చంద్రుడు చందనం వాసన ఆమెమీద వెదజల్లలేదు. కింద కుళ్ళుకాలవనుంచి కంపు మెల్లగా మేలికలు తిరుగుతూ లేచింది.

"రాధా, నన్ను కట్టుకొని సుఖపడ్డావా?" మెల్లగా అడిగేడు శేఖరం.

ఇంటి ఆసామి పెంచిన అద్దెకీ, మంత్రులు పెంచిన పన్నులకీ, తన భర్త బాధ్యుడుకాడని తెలుసుకొనే వివేకం ఆమెకుంది.

"ఇప్పుడవన్నీ యెందుకండీ?" అంది విసుగ్గా. కాని 'సుఖపడ్డాను' అన్న జవాబు తనకు తెలియని కారణాలవల్ల యివ్వలేకపోయింది.

"నన్ను మొదట చూసినప్పుడు నాలో ఏవిటి నిన్నాకర్షించింది?" మళ్ళీ ఆడిగేడు శేఖరం.

"మరీ బావుంది వరస." లేని నవ్వు తెచ్చి పెట్టుకుని జవాబిచ్చింది.

"నాలో యేం చూసి పెళ్ళాడేవు?" దేన్నో గుర్తు తెస్తున్నట్టు శేఖరం ప్రశ్నించేడు.

ఆమె జవాబులు చెప్పుకుంటూ దూరంగా శూన్యంలోకి చూస్తూ కిటికీదగ్గరే నిలబడిపోయింది.

"నాలో ఏం చూసి నన్ను పెళ్ళాడేరు? మీరు మొదట మమ్మల్నందర్నీ చూసినప్పుడే నన్ను అందర్నీచూసి నట్టే చూళ్ళేదుకదూ?" అని రాధ అడుగుతుందని శేఖరం ఆశించేడు. కాని ఆమె ఆ ప్రశ్నలు వెయ్యలేదు.

నాటికి హరి వివాహమై సర్దుగా ఐదేళ్ళు.

—:o:—

దారి మధ్యలో అంత వాన వస్తుందని మేము కలలో కూడా అనుకోలేదు. ఇంకోగంట వరకు వాన రాకపోయి వుంటే హాయిగా విశాఖపట్నం చేరిపోయే వాళ్ళం. రోడ్డు మీద కారు ఎగిరిపోతుందేమోనన్నంత తీవ్రంగా వీస్తోంది గాలి. అయినా మొండిగా కొంతసేపు కారు పోనిచ్చేం. కారు ముందున్న అద్దాలు కరిగిపోతున్న మంచు పలకల్లాఉన్నాయి. కారు లైట్లు వెల్తురులో వర్షపు చినుకులు వెండి మేకుల్లా ఉన్నాయి.

ఒకచోట కారు ఆపక తప్పిందికాదు ముందు ఆగి వున్న లారీలు బస్సులూ చూసి. ఆ లారీలకు ముందు రోడ్డుకి అడ్డంగా పెద్దచెట్టు పడిపోయిందట. అంచేత ముందుకివెళ్ళలేం. కారు దిగినా అద్దాలు దించినా కరడు గట్టిపోవడం తధ్యం. అంచేత కొంతసేపు కారులోనే గడిపేం. మరి కొంతసేపటికి వర్షం తగ్గింది కాని గాలి హెచ్చిపోయింది. రోడ్డుపక్కనున్న చెట్లని మొదళ్ళ దగ్గర్నుంచీ గిరగిరా తిప్పేస్తోంది. గాలికి రాలిపోయిన ఆకులు రోడ్డుని కప్పేసేయి. కారుని వదిలేస్తే, గాలికి ఎగిరిపోతుందేమో నన్నంత బలంగా వీస్తోంది గాలి. కాని కారులో కూర్చుంటే ఏ చెట్టో మీదపడి చచ్చిపోతామని భయం. అయినా మొండిగానే కూర్చున్నాం భగవం

తుణ్ణి తల్చుకుంటూ. ఇంతలో మా వెనుక 50 గజాల దూరంలో ఒక చెట్టు దభీమని పడిపోయింది. ఇంక కారులో కూర్చొని వుండడం అసంభవం. కేవలం తెలివి తక్కువ. కాని ఎక్కడికి వెళ్ళడం? ఎక్కడికైనా సరే. పక్కనున్న పొలాల్లోకి పోతే పాములూ, కప్పలు ఉండొచ్చుగాని చెట్లు పడి నడుములు విరగవు అంచేత కారు దిగక తప్పలేదు. దిగేక కనిపించింది. వందగజాలలో ఒక పాకలాంటిది. పెద్ద పెద్ద చెట్లు కూడా ఆగని ఆ గాలికి ఆ పాక ఎలా ఆగి నిలబడివుందో ఆశ్చర్యమే!

పాకలోవున్న గేస్‌లైటు వెల్తురునుబట్టి అందులో ఎవరో ఒకరు వుండకపోరు. వాళ్ళు ఎంతచెడ్డ వాళ్ళయినా పొలాల్లో పాములపాటి చెయ్యకపోరు. తెగించి వర్షంలో తడుస్తూ, చీకట్లో తడుముకుంటూ ఆ పాక చేరుకున్నాము. చేరుకున్నాక తెలిసింది అది కాఫీహోటలని. మేము వెళ్ళడం చూసిన కొంతమంది లారీలవాళ్లుకూడా వచ్చేరు. మరి కొంతమంది అప్పటికే అక్కడ వున్నారు. రమారమీ అంత మందీ ఒక్కలాగే తడిసిపోయేం.

ఆ హోటల్లో పొట్టి రాటలకి బిగించిన బల్లలు బెంచీలుగా పని చేస్తున్నాయి. వాటిముందు రాతి పలకల టేబిల్సు ఉన్నాయి. చుట్టూవున్న తడికలకు సినిమా పోస్టర్లు అంటించి ఉన్నాయి. ఒకమూలగా పొయ్యి పక్కన మూడు కుక్కలు ముడుచుకొని పడుకున్నాయి. ఒక కర్ర బీరువాలో పకోడీలు,

జంతికలు వగైరా నిలవవుండే టిపిన్లు వున్నాయి. పొయ్యి దగ్గవ క్లీనరు ఖుర్రాడు కూర్చున్నాడు. ఉన్న ఒక్క కుర్చీలోనూ ప్రొప్రయిటరు కూర్చున్నాడు. అతను కూర్చుంటే ప్రొప్రయిటరు, నిల్చుంటే సర్వర్! అతని పక్కనున్న టేబిలుమీదున్న గేస్ లైటు వెలుగుతోందనడంకంటే మండుతున్నదీ అనడం నిజం! మాతో వచ్చిన లారీలవాళ్లు ఒక బెంచీమీద కూర్చున్నారు. అందులో మధ్య కూర్చున్నవాడిని ఒకసారి చూస్తే మళ్ళీ చూడాలనిపిస్తుంది. అతని జుత్తు సగం నెరిసినా దట్టంగావుంది. అతని గళ్ళలుంగీ కాకీలాల్చీ తొడుక్కున్నాడు. ఆ బెంచీమీద కూర్చున్నవాళ్ళంతా కాకీ బట్టల్లోనే ఉన్నారు. అందులో ఒకడు బాగా ఖుర్రాడు. బహుశా కారీ క్లీనరు అయి వుంటాడు. ప్రొప్రయిటరు వాళ్ళబల్ల దగ్గరికి వెళ్ళేడు ఏం కావాలంటూ.

"సలి సలి" సణిగేడు క్లీనరు ఖుర్రాడు.

"మళ్ళీ గనక సలి అన్నావంటే సంపేస్తాను, లంజి కొడకా. ఇక్కడెవడూ ముండని కావలించుకొనిలేడు. సలి నీకొక్కడికేకాదు. నోరుమూసుకొని ఒల్లకుంము" అని ఆ ఖుర్రాడ్ని నాలుగుతిట్టి నువ్వు మావోడిమాటలు యినకు. ఈడికి ఎండెక్కితే- దాహం. పొద్దుగూకుతే- సలి. ఇలాంటి ఖుక్కపిల్ల లంజికొడుకు లెక్కడ దొరుకుతారో మా ప్రొప్రయిటరు తల్లికి. ఇంతకీ ఏటిస్తావ్! వీడిగా వీటుంది?" ప్రొప్రయిటరు వేపు తిరిగి అన్నాడు గళ్ళలుంగీవాడు.

"తైరువడ..."

"అంచే ఏటి మజ్జిగ పుణుకులేనా ?"

"జంతిగై, పగోడా, బజ్జీ..." రాని అరవయాసతో మాటాడుతున్నాడు ప్రొప్రయిటరు.

"నువ్వెంత పగోడా అన్నా నువ్వు అరవోడివనుకోం గాని; నాకు జంతిక పట్టా. మావోళ్ళకేటి కావాలోసూడు"

వాళ్ళు ఆర్డరిచ్చినవన్నీ తెచ్చేడు ప్రొప్రయిటరు.

గళ్ళలుంగీవాడు ఒక జంతిక కొరికి "హబ్బా" అని చెంప చేత్తో పట్టుకొని ఒక్కక్షణం పోయేక "సూడు ప్రొప్రయిటరుబాబూ ! ఇయ్యి పొట్లం కట్టియ్యి ఇంటికట్టికెళ్ళి పిల్లలకిస్తే దొర్లించుకుంటాగు సెక్కాల్లాగ. ఇంతకీనీ తిప్పేటుందిలే. ఈ రేత్తిరియింత వరసఁలో ఇన్ని టిఫిన్లున్నాయంటే, యీ వోరానివనుకోవడం మాదే తప్పు. ఆ పకోడీలట్టా అయ్యోల్లా తగలడ్డాయో సూద్దాం సూడ్డానికి తుపాకీ గుళ్ళలావున్నాయి; గవర్నమెంటోల్లకి అమ్మ్మా. వాటిని మన గవర్నమెంటు ఎప్పుడూ యుద్ధానికి కెల్లదు గాబట్టి అయ్యా పేలీదీ, పేల్దీ నువ్వు సచ్చీలోపుగా తెల్దు."

ప్రొప్రయిటగు అతని మాటలకి నొచ్చుకోలేదు. అతడు పకోడీలు పట్టుకొచ్చి యిచ్చేడు. గళ్ళలుంగీవాడు ఒక పకోడీ రుచి చూసి" ఇయి కొంత నయం లఁకలో ఇభీషణుల్లా మా అందరికీ "కేపి"లటుకురా. అడుగో. ఆ కొసోడికి మాత్తరం టీ. ఆడు సిన్నప్పుడు దొరలకాడ జోళ్లు తుడిసినోడట. అంచేత ఆడు "టీ" తప్ప "కాఫీతాగడు" అన్నాడు.

ప్రొప్రయిటరు 'కాఫీలు' 'టీ' తెచ్చి వాళ్ళ బల్లమీద పెట్టి తనకుర్చీ దగ్గరకు వెళ్లిపోయేడు. ప్లేట్లు తీసుకోవడానికి వాళ్ళ బలమీదపెట్టిన కుర్చీ దగ్గరకు వెళ్ళేడు పొయ్యి దగ్గరున్న క్లీనరు.

అప్పుడే కాఫీరుచి చూసినలుంగీవాడు" మీప్రొప్రయిటరు ఏచేస్తాడ డికాక్షన్లోకి! కాఫీగింజలా! సింతపిక్కలా! ఏదైతే నేట్లే ఏడిగుంది అంతేసాలు." ఇంత సీకట్లో దొరసానైతేనేటి! దొమ్మ్రోసానైతేనేటి! ఆడదైతే సాలన్నాట్ట ఎనకటికెవడో! అని కాఫీ పూర్తిచేసి "బీడీ ముక్కందా గురూ" అడిగేడు పక్కవాడిని.

"లేదు గురూ" అన్నాడు, పక్కనున్న గురుడు.

"ఏటి, నీసేత బీడిముక్కలు మానిపించేసి బెంజిలారీ లోనేద్దావనుకుంటున్నాదేటి నీ పెళ్ళం! బీడీ మానేస్తే దవడ్లు పీకేగాని బేడా పరక మిగల్దు. నీ మాటాయమ్మా ఎలాగా యినదుగని నేను సెప్తాలే."

"అబ్బే మానీలేదు గురూ" ఎపాలజెటిక్‌గా అన్నాడు పక్కవాడు.

వాళ్లలో ఒకడు బీడీలకట్ట బల్లమీద పడేశాడు. అందరూ బీడీలు అంటించేరు.

"ఇంత స...చెమించు గురూ" అన్నాడు లారీ క్లీనరు.

అన్నం పెట్టడానికి అమ్ముండగా పెళ్లాందేనికి అనే వయసరా నీది, నీకే అంత సలైతే మా మాటేటి! సలికి

ఎవిఁకలు సుట్టుకపోతున్నాయి. నిన్ననగా బయలెల్లినాం. ఎప్పుడు జేరుతాఁవోఁ కొంప. ఈలోగా ఏ ఆఫీసరు కారో మన లారీకి గీసుకుంటే యింటికెళ్లేది వొచ్చీవారమే. ఏం బతుకుర్రా మనయి, సీ-సీ వట్టి కుక్క-బతుకులు" అన్నాడు గళ్లలుంగీవాడు.

"మనం ఇలా సలికి సన్తూవుంటే మంచు కొట్టీసి కులు కుతూ ఉంటాది మన ప్రొప్రయిట్రు ముండ."

"మనకే ఆ ముండ కున్నంత డబ్బుంటే" వాళ్ళలో ఒకడన్నాడు.

"సీకు తెల్దురా బాబూ, డబ్బుంటే ఉండే కష్టాలు. మనకేటీ హాయిగా రాజాలాగ ఉంటే తింటాం. నేకపోతే కడుపులో కాళ్లెట్టుకు తొంగుంటాం. మనం పడుకోడానికి పంకావొద్ద పరుపొద్దు. మన్లాగ డబ్బునోన్నడిని తొంగోమను సూద్దాం. ఆడు పెళ్లన్నట్టుకు తొంగుంటాడనుకునేవ్. ఇన పెట్టిని పట్టుకొని తొంగుంటాడు. ఇప్పుడు నీకే డబ్బుందనుకో యిలాగుండగలవా! పంటలు కొట్టుకు పోనాయో యేటో నీ తోటలు పడిపోనాయో వేటో నీ మేడ కూలి పడిపోనాదో వేటో నీ పెళ్ళాం లేచిపోనాదో వేటో-ఇలా టాలోచనలతో కుళ్ళిపోతావ్. ఇక మనకంటావా! మన కొంపలు పడిపోతే మూడ్డబ్బులతో మళ్ళీ లేపేవచ్చు. మన పెళ్ళాలు యెవురుకీ అక్కరలేదు. నువ్వు లచ్చ చెప్పు, ఎయ్య చెప్పు మన బతు కులే హాయి."

"నువ్వు ఎంత చెప్పినా డబ్బునోన్నడి మజా మనకెలా గొస్తాది!" ఒకడు అమాయకంగా అడిగాడు.

"డబ్బు లేకపోతే బాధలు నీకు తెల్దుగాని వుంటే ఉన్న బాద నీకు తెల్దు. నీకు లచ్చ ఉంటే రెండో లచ్చ యెలాగ చేసుకోవడమా అన్నదో బాద ఐ పోద్ది. నీకు బూడిద ఉంటే పక్క పంతులు పొలం యెలా కలిపేసుకోవడమా అన్న బాధ. నీకు యాపారం ఉంటే దొంగ లెక్కలు ఎలాగరాయడవాడి? దొంగ బేరం ఎలాగివ్వడమా! ఇయ్యే ఆలోసెన్లు."

"డబ్బుంటే సినిమాలు తియ్యొచ్చు"

"తీసేస్లే మా ఊరు పంతులొకడు. పదేళ్ళకిందట మెడ్రాసు ఎల్లేడు. మరి కంట పళ్లేదు. ముందటేమి సూస్తే పట్నంలో శవాన్ని మోస్తూ అగుపడ్డాడు. దగ్గరోళ్ళు ఎవరో పోనారనుకొని అప్పుడడక్కుండా మర్నాడడిగినాను. సచ్చినోడు దగ్గిరోడూ కాడు దాపలోడూ కాదన్నాడు. ఆ బాబు బాపనోడు కాబట్టి శవాలు మోసుకు బతుకుతున్నాడు. నువ్వే ఆ బాబయితే ఈ పాటికి నీ శవాన్నే మోసీసుందురు"

"డబ్బుంటే ఉన్నదాంతో సంతుష్టిపడి పక్కోడిబూమి లకీ మేళ్ళకీ ఆశపడకుండా హాయిగా బతకలేమంటావా!"

"అంటాను. ముమ్మాటికీ అంటాను. నీకు డబ్బుంటే దాన్ని పెంచాలని లేకపోవొచ్చు, కాని దాన్ని ఎలా నిల బెట్టుకోవాలా అనే బాధ నిన్ను తినేస్తాది. కాని అది ఎల్లి పోయా పైమొస్తే ఎల్లిపోద్ది. లచ్చిం తల్లిని కోకతోకొగ్రుకు కట్టేస్తే కోకిప్పుకుని ఎలిపోద్ది టయిమొచ్చినప్పుడు. మీకేటి తెల్సు నాలుగాదివోరాల నక్కలు?"

"ఆ టయం రాకపోతే!"

"కాని ఏదో ఒకటొస్తాది లచ్చిందేవికి శాపముందట, ఆవిణ్ణి కాడ సుకంవుండకూడదని ఆఖరికి ఆయమ్మ మొగుడ్ని సూడు. పెపంచం అంతా ఆ బాబుదే అయినా సంద్రంలో మకాం ఎట్టేడు. ఎక్కడ పడుకుంటాడనుకుంటావ్ ? పందిరి మంచంమీదా, పట్టుపరుపు మీదా కాదు. పామ్మాద! ఏటను బవించేస్తున్నాడంటావ్ ఆ బాబు. అందుకే ఆయమ్మకి శాప మంటారు. ఆఖరికి మా నాయుడు కథలో లాగ పిల్లల్లేరన్న బాదేన అట్టు కుంటాది"

"ఎవరా నాయుడు! ఏంవిటతని కథ!"

"అదో పెద్ద ష్టోరీలే. సెప్తాగాని ముందో బీడీ ముక్కి-చ్చుకో. ఆ తర్వాత ప్రొప్రయిటరు బాబుని మరో కాఫీ అట్టుకు రమ్మను. సూడొరే బాబు వొరసం తగ్గిందేటో. కదకేం గాని తెల్లారీసరికి ఊరు సేరకపోతే పీకట్టుకుంటాది ప్రొప్రయిటరు తల్లి"

"వొరసం అలాగే ఉంది"-అన్నాడు వొకడు గుమ్మం దాకా వెళ్ళి.

బీడి అంటించి కాఫీ చప్పరిస్తూ మొదలుపెట్టేసు అతనుకథ.

"బాబూరే, నాకిందులో తెలిసింది. తక్కువ ఇన్నది లావూను. ఎంచేతంటే నాకు, తెలిసీ సరికే కదలోబిళ్ళంతా పెద్దోళ్ళు ఐపోనారు. నా సిన్నప్పుడు అంటే పదేను రోజుల కోపాలి గెడ్డం గీయించుకుండే రోజుల్లో మా ఊళ్ళో పెద్ద నాయుడుండేవాడు. ఆ బాబెంతుండీవోడంటావో ! కంచు ఇగ్రహంలా అదుగో అంతెత్తుండేవోడు. ఆ బాబు మీసాలు ఇనప మీసాల్లాగ ఇంతంకుండేవి. ఆ బాబు కొప్పు కోయిస్తే

ఆరు సవరాలు కట్టించుకోవచ్చు. సెవుల కమ్మలు కరిగిస్తే మూడుతులాలు మిగలాలన్న మాట. సేతుల కడియంతో మొడితే మూడు సేర్లనూనింకుతాది. సిన్నప్పుడు ఏటికెళ్ళినప్పుడు- తుపాకీలో గుళ్ళయిపోతే సేత్తో కొట్టి సంపినాడట సిరతపుల్ని. ఆ బాబోపాలి ముండింట్లో వణ్ణంతింటూ వీదో కోపమొచ్చి ముండ నడుందగ్గిర కోకట్టుకొని ఎడంసేత్తో ఎదురు గోడకేసి కొట్టేసినాట్ట. ముండ సచ్చీసి గోడకి అప్పడంలా అంటుకు పోనాదట.

ఆ బాబు ఎలాగుంటాడో సెప్పినానా, ఇంకా బాబు ఆస్తిమాట. ఊరు పక్క ముప్పై ఊరవతల ముప్పై మొత్తం అరవై ఎకరాలమాగాణీ-ఇయిగాక అంటుమామిడి తోట్లు, నిమ్మతోట్లు. 6 దొడ్లు, ముప్పై గొడ్లు, మూడంతస్తుల మేడ ఈ టన్నిటిత్తోటీ రాజుని తాతా అని పిలిస్తే ఓయ్ అని పలికే వోడట రాజు"

"ఆ బాబు కెంతమంది పెళ్ళాలు."

"ఇద్దరు"

"ఏం...."

"పెళ్ళాలిద్దరన్నాను గాని ఆడోళ్లు ఇద్దరన్నానా. ఓరానికో కొత్త కాతా ఎడితేనేగాని ఆ బాబుకి నిద్దరట్టేని కాదట. ఆ జిల్లా హాల్ మొత్తంలో కన్నెరికాల కంట్రాక్టు ఆ బాబుదేనట.

ఆ బాబుకి కోకల సరదా తరవాత కోర్టులు సరదా కోడిపుంజులు సరదా ఆ బాబు కిర్రు సెప్పులేసుకొని అత్తా కోడలంచు పంచి కట్టుగోని నోట్లో సుట్టెట్టుకోని మీసం

దువ్వుకుంటూ ఈడిలో వడిసెళుతూ వుంటే ఎనకాతల ఇద్దరు నాకిరీవోళ్ళు వొకడు కోడిపుంజూ, ఒకడు పికిలిపిట్టా, పట్టుకు నడుస్తూవుంటే ఇలా గెలాగుండి ఓడంటా వేటి దర్బారు కెళుతున్న మైసూరు మారాజు లాగుండీవొడు..."

"మరాబాబు పెళ్ళాలు!"

"సెందనం బొమ్మల్లాగుండీ ఓరనడంకన్నా రాతి బొమ్మల్లాగుండీ ఓరనడం కరెక్టు. కుండంత కొవ్వూ, బానంత బొజ్జా, సెయ్యెత్తు విగహం నల్లగా ఒక్కొక్కర్తి ఎలాగుండీ దంటా వేటి! మనిషిని గుద్దితే మూడీశలు బంగారం రాలా లన్నమాట. ఆయమ్మ లిద్దరి మద్దెల ఆ బాబు నిలబడితే గాడు గేదల మద్దిల డిల్లీ పోతులా గుండీ వోడు"

"ఇద్దర్నెందుకు పెళ్ళాడేడు!"

"అక్కడే ఉంది లిటిగీసను. ఆ ఇద్దరూ పరాయోళ్ళు కారు. అప్ప సెల్లెళ్ళే. ఆ బాబుకి మేనత్త కూతుళ్ళు. ఆ రోజుల్లో ఈ ప్రేమలూ గట్రా ఏవీ వుండేవిగావు. ఆస్తులు పోకుండా అయిన సంబందాలు సేసుకోడం, ఆ తర్వాత యెవ డిష్టం వచ్చినట్టు వాడుండడం. ఇదే మామూలు.

మొదట పెళ్ళయ్యాక ఆ బాబు పెళ్లాంతో పడుకున్న రోజులుకన్నా పరాయోళ్ళతో పడుకున్న రోజులే యెక్కువ. వంటికి నలభై ఏళ్ళొచ్చినా వొక నలుసూ కలగ లేదన్న ఇచారం ఆ బాబుకి లేదుగాని ఆయమ్మను పట్టుకు పిడించేసీది. అటు పూరీ మొదలుకొని ఇటు తిరపతివొరకూ ఆయమ్మ మొక్కని దేవుడు లేడు. కాల్లు కడగని బేమ్మడు లేడు,

నోచని నోములేదు. చెయ్యని దానంలేదు. యెన్ని సేసినా బొజ్జే పెరిగింది గాని కడుపు కానరాలేదు. ఆయమ్మకు నలభై దాటేసరికి దేముడ్ని మొగుడ్ని నమ్మకొని నాబం నేదని గ్రహించేసినాది. ఆయమ్మ పాట్లేవో ఆయమ్మ పడ్డాది. ఆ పాపం నా నోట సెప్పించుకోకు. అవ్వ! సిన్నా పెద్దా, యెక్కువాతక్కువా అన్న మాటుండేది గాదు. అన్నిపాపాలు పిల్లలకోసం సేసింది. సరదాకే సేసిందో, పిల్లలకోసంసేసిందో నాకు తెలీదుగాని, ఆ బాబు మాత్రం ఇటొచ్చి అటొచ్చి 'నీకు పిల్లలు పుట్టడం పాడుసేనులో పంటలు పండటం ఒక్కటే. నాను దత్తతచేసుకుంటాను.ఇంతా స్తి ఒగ్గీసిపోన్నాను. సస్తే నా తద్దినం నువ్వెడతావా నీ బాబెడతాడా? సొరగానికి నరకానికి ముద్దిల తలకిందులు గుండి పోవాల నేను!' అని రోజు రోజుకీ బెదిరించీ వోడట.

ఎలాగయితేనేం ఆయమ్మకి నలభై ఐదూ యాబయ్యా ఆ బాబుకి అరవయ్యా వచ్చేసరికి ఆయమ్మకి వొక్కసయం తెలిసిపోనాదట, తనకింక పిల్లలు పుట్టరని. ఇంతా స్తిపోకుండా నిలబెట్టుకోవాలంటే వొక్కటే మారగం కనిపించింది ఆ యమ్మకి. అంచేత యెంటనే సవారీ బండి కట్టించుకొని ఓ పొద్దు పుట్టింటికి పోనాదట. పోయి సెల్లెల్ని పంపి 'యిదిగో సెల్లెలా' నాను సెప్పేది జాగర్తవిను.నాస్నికంటే పెద్దదాన్ని: మగంచేత నాను సెప్పావొచ్చు. నువ్వినావొచ్చు. నీ మంచికీ నా మంచికీ వొక మాట సెపుతా వినుకో.

నాకు మొగుడున్నాడు. ఆ మొగుడికి లంకంత ఇల్లు, సంద్రం అంత సేనూ ఉంది గాని, ఎత్తుకోడానికి పిల్లలేరు.

మాం సప్తే సాకలోడు నోట్లో నీళ్ళు పొయ్యాల్సిందే గాని వేరే దిక్కులేదు.

ఇక నీకంటావా. నిలువగ ఎంతెదిగినావో అడ్డంగా అంతెదిగినావు. మన బాబు ఆస్తి కాకట్లుపోతే నీకు పసుపు కొమ్ములకు రాదు. నువు సిన్నదానివి. నీకు ఏవో ఆలోసెన్లుం టాయి. నీ వుద్దేశాలకు నేనడ్డురాను. అంచేత మానాయుడ్ని నీకు పుస్తికట్టనీ. పెళ్ళయ్యేక నీ సోకులు నువ్వు మాను కోకు. నాకు సేతనైన సాయం నేను చేస్తాను. ఆడదాని మెళ్ళో నల్లపూసుంటే నూరు పాపాలు కాస్తాది. మరింకింత కంటే ఇవరంగా నన్ను సెప్పమనకు. కాని ఒక్కమాట. ఎలాగో ఓలాగు ఒక్క కొడుకుని మాత్రం కనీ."

అప్పకు మొగుడులాటిది సెల్లెలు. అంచేత అసలు ఇసయం ఇట్టే గ్రహించేసింది. ఇటుపైన కదుపులు దించుకో వాలన్న బెంగుండదు. ఈదిలో మొగుడువుంటేసాలు పెరట్లో పాపాలు పైకిరావు. అని సెప్పి పెళ్లి కొప్పీసుకుంది, ఆ పెళ్ళి గూడా నాను సూడ్నేదు."

"రెండో పెళ్ళామన్నాకందా!"

"కనలేదుగాలి ఆయమ్మ తప్పుకాదు. ఆయమ్మ చెయ్యాల్సిందంతా సేసింది. ఆయమ్మ ప్రతీపనికీ అప్ప అండ గుండేది. అయితే అప్పకీ సెల్లెలకీ బేద మేటంటే అప్ప మొదట్లో దేముడ్ని నమ్మేక మనిషిని నమ్ముకుంది. సెల్లెలు తొలికాడ్నుంచీ మనుషుల్నే నమ్ముకుంది.

"ఇదిలాగుండగా నాయుడికి అరవైఐయిదో అరవై

యారో వెళ్ళిపోనాయి. పిల్లల్లేరన్న దిగులుతో నడుంజార్గొ
సిన పాపానికో జబ్బుచేసి మంచం అట్టీసినాడు. ఆ బాబులాగ
మంచం ఎక్కినాడో లేదో మూల మూలల్నించీ దిగినారు.
వోరసులు బొమ్మల్లాంటి పిల్లల్తో. మా కొడుకుని దత్తత
సేసుకో, మా పిల్లోడ్ని సేసుకో అని ఆబాబు పేనం గొలుక్కు
కనీసినారు. ఆ బాబుకూడా యములోళ్ళ నీడలుకనిపించీయో
వేటూ లొంగిపోనాడు. బొందిలోపేనం ఉండగానే కొంపతో
కుర్రోడు నడవాలని పట్టుపట్టినాడు. అప్పుడాయమ్మలు వేటిసేసే
రనుకున్నావ్? ఊళ్లోవుంటే ఈగల్లాగ ఈ వోరసులు
ఊరుకోరనీ నాయుడ్ని పట్నం తీసుకుపోయి అక్కడ పెద్ద
డాక్టర్ల చేతిల్లో ఎట్టేరు. ఆ డాక్టర్ల మందులతో ఈ
యమ్మల పాతి ప్రొత్యానికో తెల్లుగాని ఆ బాబు బైటపడి
బట్టగట్టినాడు. మళ్ళీ ఊరొచ్చీలోగానే ఆ పట్నం
లోనే ఆ బాబుకి నూరిపోసినారా తల్లులు 'నీ కేటితక్కువ
దత్తత సేసుకోడానికి. దిమ్మిస దుక్కలాగున్నావు. ఓ జబ్బు
సేత్తే సచ్చిపోయిసట్టైనా? ఇప్పటికీ నువ్వో గుద్దు గుద్దితే
ఈశ్వరుడైనా మూడు కళ్లూ మూసీ వొలసిందే. ఈ
జిల్లాలో మూతిమీద మీసం వొచ్చిన వే మొగాడ్నైనా
నీతో తాగమను, తినమను సూద్దాం. నీ సత్తువ నీకు తెల్దు.
మాకు తెల్సు. మనకి పిల్లల్లేరంటే ఆ దోసం మాదిగాని తప్పు
నీదికాదు. మూణ్ణెల్లు టయిమిస్తీ. వచ్చిన వోరసుడ్ని
ఈప్మీదగుద్ది పంపించీ, నీకో గుమ్మటంలాంటి గుంటని తెచ్చి
పెళ్లి జేస్తాం. ఒక సంవత్సరం టయిమిస్తీ ఆ గుంటకి, అప్ప
టికీ అది కనకపోతే నీ యిష్టం నీ ఆస్తికి దత్తతే సేసుకుం

టావో దానాలే సేసుకుంటావో. నీ కడ్డొస్తే కొప్పులు కోసి ఈదిలోకి ఈడిసీ మమ్మల్ని" అని నచ్చచెప్పారు.

ముసిలోడికి మళ్లీ పెళ్ళంటే మతిపోనాది. కంసాలి సెవం లాగ తలపాగా ఎట్టుకొని తయారైపోనాడు సెయ్యమని.

ఆ యమ్మలు మూడ్నెల్లు టయామడిగినారా. మూడో రాల్లో పట్టుకొచ్చినారు పెళ్ళికూతుర్ని. సికాకోళం అవతల్నుంచి. మూర్తాలేవని బేమ్మడేడిసినా, బెదిరించి పెట్టించినాగో మూర్తం. అదిగో నా నెళ్ళిందా పెళ్ళికి. సేతికి ఎవిఁ కఁలు ఇరుసుకొని కర్చెట్టినారా పెళ్ళికి. అనకాపల్లి సరుకు పనికిరాదని బెజవాడనుంచి తెప్పించినారు బోగం మేళం. పెళ్ళినాడు ఊళ్లో ఎవళనీ పొయిలో నిప్పేసుకోనివ్వలేదు. సెరుకు పెనాలతో తెప్పించినారు సారా. తొలిపాలి నేను రుసి సూసింది ఆ పెళ్ళిలోనే.

రేత్తిరి మూర్తం. పెళ్ళి పందిరి కిట కిట లాడిపోనాది. ఆ పెళ్ళికి మా ఊరు తొలిసారి గ్యాస్ లైట్లు తెప్పిస్తే.

ఇక పెళ్ళికొడుకూ పెళ్ళికూతురూ అంతావా. నల్ల మందు అలవాటైందేమో పీటమీద కూసున్న నాయుడు పీటమీదే తూలుతున్నాడు. సిన్నప్పుడు తిరిగిన తిరుగుళ్లకి మనిషి ఊరిపోయి ఉబ్బిన శవంలాగున్నాడు.

ఇక పెళ్లికూతురంటావా. వయసులోనే నాయుడు పెద్దా ఆమె సిన్నా. మనిషి మాత్రం అతనంతా ఉంది ముక్కు నోరంతా ఉంది ఎడల్పు. పట్టుకోకా, జరీ రవికా తొడుక్కొని ఇంతింత జెబ్బలతో నల్లగా ఇలా గెలాగుంధంటే...మన ఊరవతల అమ్మోరు పట్టుకోక కట్టుకొని నడి

చొచ్చేసి పీటమీద కూకుంటే ఎలాగుంటుంది-అదిగలాగుంది. అయమ్మ పీటమీద కూకుంటే కడుపు బేమ్మడి ఒళ్లో ఉంది. మొగోడికి ఆడ ఏసం ఏసినా అయమ్మ కంటే బాగుంటాడు.

ఇలాగ తిన్న పెళ్లి బూర్లు అరిగేయో లేదో అలా ఆ మూడోపెళ్ళానికి కడుపన్నారు. రెండోనెల్నే గాజు నెట్టిం చేసినారు మాకిదే ఆచారం అంటూ. పెళ్లయిన మూడ్నెల్లకి పురిటి కొచ్చేసినట్లయి పోనాది ఆ మనిషి. ఈ ప్రతాప మంతా తనదే అయినట్లు నాయుడు తంగీ వోడు అడగ నోడిదే పాపం. అందరికీ సెప్పే వోడు తన పెళ్ళానికి కడు పని...బాబురే వొరసం తగ్గినట్టుంది సూడు ... లేవడానికి నాకు కీళ్ళు పట్టీసినాయి" అని ఆగేడు బీడి అంటిస్తూ.

"కద కానీ తర్వాత చూద్దాం" అన్నాడొకడు.

"కదకేటుందిరా అయిపోనాది. మరోనెల పోనాక అయమ్మ కడుపుపోనాది. ఏతాం కాడ, ఉన్న నాయుడు ఈ మాటినగానే కళ్ళుతిరిగి ఇరగబడిపోయి నూతిలో పడి సచ్చేసినాడు. ఏ బరంపురం నుంచో వోరసుణ్ణంటూ ఎవడోవచ్చి ముగ్గురు ముండలకీ మనోవర్తి పారీసి-అదిగో నాను సెప్పేనా వొరసం పోనాదని. లారీలు స్టార్టయి పోనాయి నెగండి-మనో వర్తి మూడ్డబ్బులు పారీసి ఆ స్తంతా పట్టుకుపోయేడు"అంటూ లేచి పోయేడు అతను.

— o —

ప్రియమైన పాఠకులకు....

నమస్కారం !

నవభారత్ ప్రచురించిన ఉత్తమ సాహిత్యాన్ని మీరు ఆదరించేరు. మీ ఆదరణలో నవభారత్‌కి ఒక వున్నతమైన స్థానాన్ని ఇచ్చేరు. మీ హృదయాలలో చెరగని ముద్రగా నవభారత్ స్థిరపడింది. అందుకు ఎంతో ఆనందిస్తున్నాం, గర్విస్తున్నాం.

రోజురోజుకీ పఠనాసక్తి పెరుగుతోంది. తనని అభిమానిస్తున్న పాఠకుల వుత్తమాభిరుచిని దృష్టిలో వుంచుకొని నవభారత్ ఎన్నో కొత్త ప్రచురణలను పరిచయంచేస్తోంది. 'నవలా ప్రియదర్శిని, నవలా నవమోహిని' పథకాలద్వారా ఈ ప్రచురణలు మీ అభిమాన ప్రచురణ స్థాయిల్లో వుండేందుకు అన్ని జాగ్రత్తలూ తీసుకుంది. పుస్తక ప్రచురణల రంగంలో తొలిసారిగా సాహితీబాలెట్ ఎన్నికలు, వ్యాసరచన పోటీలు ప్రవేశపెట్టింది.

ఈ ప్రయత్నాలన్నింటివెనుక నవభారత్ పాఠకులున్నారు. వారి ఆదరణే ఈ ప్రయత్నాలకు నాంది అయ్యింది.

నవలా ప్రియదర్శిని, నవలా నవమోహిని పథకాలు పాఠకులవే !
వీటి న్యాయనిర్ణేతలు పాఠకులే !
ఉత్తమ రచనలను సన్మానించేది పాఠకులే !
పుస్తక విక్రేతలకు సాయపడేది పాఠకులే !
ఈ పథకం విజయపతాకాన్ని నవభారత్‌కి అందించేదీ పాఠకులే !

వందల కలాలు పోటీపడి రాయాలి !

వేలాది పాఠకులు అభిమానించి చదవాలి ! !



న వ భా ర త్ వా రి

నవలా ప్రియదర్శిని సాహితీ బాలెట్

మొదటి పోటీలోని నవలలు

లీలా మనోహరం	మల్లాది సూరిబాబు	5_00
వెన్నెల మెట్లు	వై. రామలక్ష్మి	6 00
కొత్త చిగురు	వి. రాజారామమోహనరావు	5_00
మర్రిసీడ	పి. సత్యవతి	5_00

రెండవ పోటీలోని నవలలు

హాలాహలంలో అమృతం	కొలిపాక రమామణి	5_00
మంచు పల్లకీ	వంశీ	5_00
పుతీ	ఆలేటి నాగమణి	5_00
రేపటి కొడుకు	మల్లాది వెంకటకృష్ణమూర్తి	5_00
మృదుల	జయశ్రీ ఉండవల్లి	5_00
కాంతా కనకాలు	పురాణం సూర్యప్రకాశరావు	5_00

నవలా నవమోహని పథకంలోని నవలలు

గడిపోచలు	కొలిపాక రమామణి	త్వరలో
ప్రేమకు పుల్ స్టాప్ వుందా ?	యెర్రంశెట్టి సాయి	"
మల్లిక	పి. యస్. నారాయణ	"
గంగ	యార్లగడ్డ సరోజిని	"
వయస్సు 18 జాగ్రత్త :	ఆదివిష్ణు	"
మాతృమూర్తి	రాజామణి	"
బంధాలు	చెళ్ళూరి సీతారాజేశ్వరరావు	"
స్వర్గం – నరకం	దాసరి నారాయణరావు	"
గృహమే స్వర్గసీమ	శ్రీకాంత్ శర్మ	"

57

బీ నా దే వి

డబ్బు! డబ్బు!! డబ్బు!!!

మీకు జలుబు చేసిందా -
అయ్యో పాపం తుమ్ములొస్తున్నాయా ?

మీవారు స్మోకింగ్ పైగరా -
చిత్తం ! మీ ఇంట్లో కుక్కలు,
పిల్లులు, చిలుకలు, నెమిళ్లు, పిచుకలు
వగైరా వగైరాలున్నాయా ?

మీకు డబ్బు వుందా -
అయ్యో పాపం లేదా -
డబ్బును గురించి ఆలోచించి
తల బ్రద్దలు కొట్టుకుంటున్నారా ?

మీరంతా వేసవి సెలవులకి
పలైటూరో ఓ పాత ఫ్రండింటికి
వెకేషన్‌కో వెళ్తున్నారా -

సరె, సరె, మీ ఇంట్లో కుర్ర
డాక్టర్లున్నారా ?

- అయితే డబ్బు కథలు చదవండి

తప్పక చదవండి!

స్వతంత్ర ఆర్ట్ ప్రింటర్స్, విజయవాడ-520004.